5-1Pg1FB 1 VJA_5-1Pg1FB.qxd 05/Jan/26 12:12 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 335 పేజీలు: 12 వెల: 6.50

**కిమ్ మళ్లీ కవ్వింపు చర్యలు**
క్షిపణిపరీక్షలతో తూర్పు ఆసియాలో ప్రకంపనలు
9లో

**పుతిన్‌ను ఇలాగే తీసుకు రాగలరా?**
అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రోఖన్నా


Ministry of Rural Development
Government of India

ప్రతీ గ్రామానికి అన్ని-వాతావరణాలలో అనువైన రోడ్లు
ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన క్రింద గత 11.5 సంవత్సరాలలో 1.47 లక్షల పాఠశాలలు, 83 వేల ఆసుపత్రులు, 1.39 లక్షల వ్యవసాయ సర్వీస్‌లు మరియు 3.28 లక్షల రవాణా సర్వీస్‌లు అన్ని-వాతావరణాల రహదారులతో అనుసంధానం చేయబడినవి.
గ్రామీణాభివృద్ధి ద్వారా జాతి నిర్మాణం
CBC 35101/13/0047/2526

Pradhan Mantri Gram Sadak Yojana

# భోగాపురానికి ఫ్లైట్
# ఎపికి గేమ్ ఛేంజర్!


ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్టులో విమానం దిగిన అనంతరం విక్టరీ సింబల్ చూపుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్



**ఉత్తరాంధ్రలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం**
**ఇది కీలక మైలురాయి: సిఎం చంద్రబాబు**
**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిస్తుంది**
**రోడ్డు కనెక్టివిటీపైనా దృష్టి సారించాం**
**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**విజయనగరం/ విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. భోగాపురం ఎయిర్ పోర్ట్ నుంచి గగన విహారానికి తొలి అడుగు పడింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా తొలి వాణిజ్య వాలిడేషన్ ఫ్లైట్ ఆదివారం భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో విజయవంతంగా ల్యాండ్ అయింది. ఈ విమానంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఏటీసీ చైర్మన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు భోగాపురం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వీరికి జిల్లా ఉన్నతాధికారులతోపాటు విమానయాన సంస్థ అధికారులు ఘన స్వాగతం పలికారు. అత్యాధునిక టెక్నాలజీతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 96 శాతం ఎయిర్ పోర్ట్ పూర్తయిందని జీఎంఆర్ సంస్థ తెలిపింది. జూన్ 26వ తేదీన ఈ ఎయిర్ పోర్ట్‌ను ప్రారంభించనున్నారు. భోగాపురంలో తొలి విమానం ల్యాండ్ కావడం ఎయిర్‌పోర్ట్ చరిత్రలో కీలక మైలురాయి అని సిఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో తొలి విమానం >>2

భాష, వారసత్వం, సంస్కృతి వల్లే
# మన సంబంధాలు బలోపేతం



**ఇంగ్లీష్ భాష వినియోగం పెరుగుదల ఆందోళనకరం**
**తెలుగు వంటి ప్రాచీన భాషపై ప్రతికూల ప్రభావం**
**ప్రపంచ తెలుగు మహాసభలలో మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్**
**తెలుగు సాహిత్యం, భాషను ప్రోత్సహించడంలో**
**ఎపి సిఎం చంద్రబాబు విశేష కృషి అంటూ ప్రశంసలు**
**సంప్రదాయాలతో మారిషస్‌లో ఉగాది పండుగ నిర్వహించుకుంటున్నామని వెల్లడి**

**విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంగ్లీష్ భాష ఎక్కువగా వినియోగించడంతో తెలుగు వంటి ప్రాచీన భాషపై ప్రతికూల ప్రభావం చూపుతోందని మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ వ్యాఖ్యానించారు. మారిషస్‌లో తెలుగు సాహిత్యం, భాషను ప్రోత్సహించడంలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు విశేష కృషి చేశారని అన్నారు. చంద్రబాబు మారిషస్ వచ్చినపుడు దేశంలో విద్య, తెలుగు సంస్కృతి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు వైభవంగా కొనసాగుతోన్నాయి. ఆదివారం రెండవ రోజుఈ సభలో పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషాభివృద్ధి కోసం కృషి చేస్తోన్న సిఎం చంద్రబాబుకు హృదయ పూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచంలో సగానికి పైగా భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పూర్వీకుల నుంచి వచ్చిన మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి విధిగా తీసుకోవాలని సూచించారు. చారిత్రాత్మక, విశిష్టమైన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరు జిల్లాలో జరపడం అభినందనీయమని >>2

# నీళ్ల లెక్కలు త్వరలో అన్నీ బయటపెడతా!
**సిఎం చంద్రబాబు**
**తెలంగాణ అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ప్రాధాన్యం**

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** నీటి పంపకాల అంశానికి సంబంధించి అన్ని విషయాలను త్వరలోనే ప్రజలకు తెలియజేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిగా అధ్యయనం చేసి, వివరంగా మాట్లాడుతామని ఆయన స్పష్టం చేశారు. నీటి వనరుల నిర్వహణలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. నీటి పంపకాల (లిఫ్ట్ ఇరిగేషన్) అంశంపై త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని చంద్రబాబు చెప్పారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను తన విన్నపం మేరకు ఆపించినట్టు చెప్పిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు 2020లోనే ఎన్జీటీ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే సంబంధిత పనులు ఆగాయని ఏపీ ప్రభుత్వం >>2



**రాష్ట్ర పండుగగా వడ్డే ఓబన్న జయంతి**
**11న అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంతోత్సవం**
2లో
**అన్ని జిల్లా కేంద్రాల్లోనూ నిర్వహణ:మంత్రి సవిత**

# అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్
**రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణ చేస్తూ ఉత్తర్వులు**

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రభుత్వం నకిలీ పత్రాలతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడానికి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సభ్యులుగా ఉంటారు. రిజిస్ట్రేషన్ చేసే అధికారి కావాలనే తప్పు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ విషయాన్ని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తెలిపారు. ఆయన ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



# తీరు మార్చుకోకపోతే మీపైనా చర్యలు

**క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ వార్నింగ్**
**న్యూయార్క్ డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో మదురో**
**వెనిజులాను పాలించేది మేమే: అమెరికా అధ్యక్షుడు**
**దేశ తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్**
**ప్రజలకు స్వేచ్ఛ లభించింది: ప్రతిపక్ష నేత మచాడో**
**పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం: భారత్ విదేశాంగ శాఖ ప్రకటన**
**చమురు నిల్వల కోసమే వెనిజులాపై ట్రంప్ దాడులు**
**అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ధ్వజం**
**వెనిజులా ప్రజలకు మస్క్ స్టార్‌లింక్ ఉచిత ఇంటర్నెట్**


9లో



# నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు
**2020లోనే ఎన్‌జిటి ఆదేశంతో నిలిచిన ఎత్తిపోతల పథకం**
**రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత స్పష్టీకరణ**
**రాయలసీమ ద్రోహి జగన్ అంటూ మండిపాటు**

**విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి నీటి హక్కులు, రాయలసీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ ప్రసక్తే లేదని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తేల్చి చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సిఎం చంద్రబాబును బూచిగా చూపి రాజకీయ ఉనికి చాటుకోవడం తెలంగాణ రాష్ట్ర అధికార, విపక్షాలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 2020లో ఎటువంటి అనుమతులు లేకుండా రాయలసీమ ఎత్తిపోతల పథక నిర్మాణం చేపడుతున్నామని జగన్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిందన్నారు. ఈ ప్రకటనపై ఆనాటి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో, కేంద్రంతో పాటు ఎన్జీటీ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నాయన్నారు. ఇదేవిషయంపై అప్పట్లో మీడియాలోనూ ప్రచురితమైన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోవడానికి ప్రధాన కారణం వైఎస్ జగన్మోహన్ రెడ్డేనని మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. రాయలసీమకు >>2



# అసోం ఎన్నికల ఇన్‌ఛార్జిగా ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ, జనవరి 4:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాం స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆమెను నియమించింది. ఐఏసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలకు స్క్రీనింగ్ కమిటీలను నియమించారు. ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలోని అస్సాం స్క్రీనింగ్ కమిటీలో సప్తగిరి శంకర్ ఉలక, ఇమ్రాన్ మసూద్, సిరివెల్ల ప్రసాద్ సభ్యులుగా ఉన్నారు. అస్సాంతో పాటు, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లకు స్క్రీనింగ్ కమిటీలను కూడా కాంగ్రెస్ పార్టీఏర్పాటు చేసింది. కేరళ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ అధ్యక్షత వహిస్తారు. సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉంటారు. మరోవైపు తమిళనాడు, పుదుచ్చేరి స్క్రీనింగ్ కమిటీకి టీఎస్ సింగ్ డియో నేతృత్వం వహిస్తారు. యశోమతి ఠాకూర్, జీసీ చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ సభ్యులుగా ఉంటారు. పశ్చిమ బెంగాల్ కమిటీకి బీకే హరిప్రసాద్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. మహ్మద్ జావేద్, మమతా దేవి, బీపీ సింగ్ సభ్యులుగా ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సంప్రదింపులు వంటి బాధ్యతలను స్క్రీనింగ్ కమిటీలు నిర్వహిస్తాయి.

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం

**ఆ లక్ష్యంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం**
**వారణాసిలో జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం**
**ప్రధాని నరేంద్ర మోడీ**



**న్యూఢిల్లీ, జనవరి 4:** క్రీడా రంగంలో భారతదేశం సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోడీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. టీమ్ ఫస్ట్ అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, >>2

5-1pg2exHMNWJQE 2_5-1pg2exHMNWJQE.qxd 05/Jan/26 12:05 AM Page 1





ఆదివారం హైదరాబాద్‌లో సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

# సాయిబాబా సేవలు మరువలేనివి

## కుటుంబసభ్యులను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త:** టీడీపీ సీనియర్ నేత, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్, ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులు సాయిబాబా తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబునాయుడు కొనియాడారు. ఆదివారం సాయంత్రం విదేశీ పర్యటన ముగించుకుని, హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు విమానాశ్రయం నుంచి నేరుగా సాయిబాబా నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్య లను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సాయిబాబా సతీమణి పి.సరళ, కుమారులు భార్గవ్, వంశీ, చిన్నారులు ధైర్యం చెప్పి, సాయిబాబాతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఒక మంచి కుటుంబ సభ్యుడిని తెలుగుదేశంపార్టీ కోల్పోయిందని, సాయిబాబా మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు వెంట పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్‌గౌడ్, కంభంపాటి రామ్మోహనరావు, కాట్రగడ్డ ప్రసూన, పొలంపల్లి అశోక్, శ్రీపతి సతీష్‌కుమార్ ఉన్నారు. అనంతరం టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలను కలిసిన చంద్రబాబు, సాయిబాబా స్ఫూర్తితో ముందుకు సాగా లని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, నాగు నగేష్, టీటీడీ సభ్యులు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల తగ్గింపు

## విద్యుత్ భారాన్ని ప్రజలపై పడనివ్వం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, జనవరి 4 ప్రభాతవార్త:** విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సుపరిపాలన అందిస్తు ప్రజల మన్ననలను పొందుతోంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పటికీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. ఇవ్వని హామీలను కూడా అమలు చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. గడిచిన వైఎస్ జగన్ రెడ్డి పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ అనిశ్చితి, ఆర్థిక ఒత్తిడి, గందరగోళం ఎదుర్కొంది. విద్యుత్ అనేది ప్రభుత్వానికి రాజకీయ అస్త్రం కాదు, ప్రజల జీవితాలతో ముడిపడిన కీలక మౌలిక రంగం. అలాంటి రంగాన్ని మూర్ఖపు నిర్ణయాలతో అప్పులపాలు చేశారు. 2019లో అధికారం నుంచి దిగిపోయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపాం. కానీ జగన్ రెడ్డి విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని చెప్పి, తన ఐదేళ్ల పాలనలో 9 సార్లు ఛార్జీలు పెంచి దాదాపు రూ.32 వేల కోట్ల ప్రజలపై భారం మోపారు. విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. కమీషన్ల కోసం విద్యుత్ కొనుగోలు చేసి వారి జేబులు నింపుకున్నారు. ఈ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని రూ.1.29 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు" అని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు.

**బాధ్యతాయుత పాలన, చారిత్రాత్మక నిర్ణయాలు:** "2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యమైన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు సంస్కరణలు చేపడుతోంది. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం వేల కోట్ల విలువైన ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వం భరించింది. 2019-2024 కాలానికి సంబంధించిన రూ.4,498 కోట్ల ట్రూఅప్ ఛార్జీల వసూలు చేయరాదంటూ ఏపీఈఆర్సీ లేఖ రాసినా, ఈ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం చారిత్రాత్మక నిర్ణయం. 1999లో ఏపీఈఆర్సీ ఏర్పాటైన నాటి నుంచి తొలిసారి ట్రూడౌన్ ఛార్జీల నమోదు కావడం, ముఖ్యమంత్రి చేపడుతున్న విద్యుత్ సంస్కరణల ఫలితం. ట్రూడౌన్ అమలు ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గుంపు" అని మంత్రి తెలిపారు.

**రైతులకు, వినియోగదారులకు నేరుగా లాభం:** "జగన్ రెడ్డి పాలనలో అత్యాధునిక యూనిట్ రూ.3.50 వసూలు చేసే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్ రూ.1.50కు తగ్గించడం కీలక నిర్ణయం. గత ప్రభుత్వంలో రూ.5.19కు విద్యుత్ కొనుగోలు చేసే, ఇప్పుడు రూ.4.70కు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తూ, రెన్యూవబుల్ ఎనర్జీకి ప్రాధాన్యతనిస్తోంది. సోలార్ పవర్ విద్యుత్ పవర్ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. సోలార్ పవర్ ప్రోత్సాహానికి ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్‌లు, బీసీ వర్గాలకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీపై అదనంగా రూ.20 వేల అధిక సబ్సిడీని కూటమి ప్రభుత్వం అందిస్తోంది" అని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

# క్రీడాకారుల సంక్షేమమే ధ్యేయం

## 15 లోపు స్పోర్ట్స్‌యాప్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి: శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



మీడియా సమావేశంలో క్రీడా యాప్ సమాచార పత్రాన్ని ప్రదర్శిస్తున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు స్పష్టం చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ.రాష్ట్రంలో క్రీడలను ఉద్యమంగా మార్చి, ప్రతి జిల్లాలో మౌలిక వసతులు కల్పించి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శాప్ ఛైర్మన్ స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో క్రీడాకారులకు రావాల్సిన బకాయిలుగా సుమారు రూ.16 కోట్లను ఇప్పటికే విడుదల చేసినట్లు, అలాగే ఫిబ్రవరి నెలలో మరో రూ.8 కోట్లను క్రీడాకారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ సుదీర్ఘ క్రీడా అభివృద్ధి ప్రయాణంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో రాష్ట్ర క్రీడా శాఖకు, ముఖ్యంగా క్రీడాకారుల సంక్షేమం మరియు క్రీడా రంగ అభివృద్ధికి నిరంతర సహకారం అందించిన మీడియా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2026 సంవత్సరంలో కూడా ఇదే విధంగా మీడియా మద్దతు కొనసాగాలని ఆకాంక్షించారు.గతంలో రాష్ట్రంలో క్రీడా విభాగానికి స్పష్టమైన క్రీడా విధానం లేకుండా, సరైన మౌలిక వసతులు లేక నిద్రాణావస్థలో కొనసాగిందని తెలిపారు. తాను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో రాష్ట్రానికి సమగ్ర క్రీడా పాలసీ లేకపోవడంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి సమగ్ర క్రీడా పాలసీని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పాలసీ రూపకల్పనలో మీడియా ప్రతినిధులు, క్రీడా సంఘాలు, ప్లేయర్స్ అసోసియేషన్ల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, అవసరమైన మార్పులు, సవరణలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లను లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలోనూ అనుసరించేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ దిశగా క్రీడల్లో ముందున్న తమిళనాడు సహా దాదాపు 17 రాష్ట్రాల క్రీడా విధానాలు, పనితీరును అధ్యయనం చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి కోసం సుమారు రూ.54 కోట్ల విలువైన ప్రాజెక్టులకు టెండర్లు పూర్తి చేసి, అన్ని ప్రాంతాల్లో పారదర్శకంగా పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. శాశ్వత క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి భాగంగా శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విశాఖపట్నం కొమ్మాదిలో సుమారు రూ.25 కోట్లతో ఆధునిక స్టేడియం నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. విజయనగరంలో ఈ ఏడాదే స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే అరకు-పాడేరు ప్రాంతాల్లో క్రీడల్లో ప్రతిభ ఉన్న గిరిజన పిల్లల కోసం ఎస్టీ కంపోనెంట్ నిధులు, స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కాకినాడలో ఖేలో ఇండియా పథకం కింద సింథటిక్ ట్రాక్ పూర్తి చేసి, అక్కడే క్రీడా అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటర్ గేమ్స్ తో పాటు మల్టీ పర్పస్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రాజమండ్రిలో అమరావతి పుష్కరాల పేరుతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ఇప్పటికే ప్రారంభమైందని, అలాగే ఏలూరులో వెయిట్‌లిఫ్టింగ్ తదితర క్రీడలకు అనుకూలంగా సుమారు రూ.8 నుండి రూ.10 కోట్లతో మరమ్మత్తుల పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కీలక క్రీడా మైదానాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

# ఎపికి గేమ్ ఛేంజర్!

>> ల్యాండింగ్ కావడంపై సీఎం చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఏపీ విమానయాన రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం నమోదైందన్నారు. వ్యాలిడేషన్ ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రాంతీయ అనుసంధానం (కనెక్టివిటీ) బలోపేతం అవుతుందని.. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి భారీగా ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు మద్దతు అందించిన ప్రధాని మోడీకి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ప్రజల సేవలకు విమానాశ్రయం సిద్ధమవుతోందని చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ ఎయిర్ పోర్ట్ ద్వారా వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ ఎయిర్ పోర్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ముందే భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తికానుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిస్తుంది: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డిజిసిఎ అధికారులు ఈ విమానంలో వచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మితమవుతుంది. ఆదివారం ఈ ఎయిర్‌పోర్ట్‌లో న్యూఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక విమానం ల్యాండింగ్ అయింది. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇది ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. ఫ్లైట్‌లో పైలట్ చేసిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాగతం' అనే ప్రకటన తనను భావోద్వేగానికి గురి చేసిందన్నారు. భోగాపురం విమానాశ్రయానికి బీజం వేసింది విజనరీ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని, 2016లో అప్పటి కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు కృషితో కేంద్రం నుంచి ఇన్‌ప్రిన్సిపల్ అప్రూవల్ లభించిందని గుర్తు చేశారు. మధ్యలో జాప్యాలు వచ్చినప్పటికీ, గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను సొంత ప్రాజెక్ట్‌లా అభివృద్ధి చేసిన జిఎంఆర్ గ్రూప్, నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఎల్ అండ్ టి, అలాగే డిజిసిఎ, ఏఏఐ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల సమన్వయానికి మంత్రి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా భూములు త్యాగం చేసిన స్థానిక రైతులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం వల్ల విశాఖపట్నం- విజయనగరం- శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు అంతర్జాతీయ కనెక్టివిటీ, ఉద్యోగ అవకాశాలు, వాణిజ్యం, కార్గో, టూరిజం, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో భోగాపురం ప్రాంతం కూడా ప్రపంచ స్థాయి అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆకాంక్షించారు. ఎయిర్‌పోర్ట్‌తో పాటు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్, ఏరో ఇండస్ట్రీస్ కోసం 500 ఎకరాలు, అలాగే యువతకు స్కిల్లింగ్, ట్రైనింగ్ అందించే ఎడ్యు సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నాలుగు నుంచి ఐదు నెలల్లో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ అనేది కీలక పనులన్నీ పూర్తి దశకు చేరుకున్నాయనడానికి సంకేతమన్నారు. రాత్రింబవళ్లు శ్రమించిన కార్మికులు, సిబ్బందికి రామ్మోహన్ ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రోడ్డు కనెక్టవిటీపై ప్రత్యేక దృష్టి**

భోగాపురం ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యే నాటికి రోడ్డు కనెక్టవిటీ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించామని, విశాఖపట్టణం నుంచి ఇక్కడకు సులభంగా చేరుకునేలా ఏడు రోడ్లతో కూడిన ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. విశాఖపట్టణం, మూలపేట పోర్టులకు కూడా దీనితో అనుసంధానం ఏర్పాటు చేస్తామని, అలాగే విశాఖ - రాయ్‌పూర్ హైవేతో కనెక్టవిటీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుతో పాటు చేపట్టబోయే ఇతర ప్రాజెక్టుల గురించి కూడా వివరించారు. మెట్రోను కూడా త్వరలోనే పట్టాలెక్కిస్తామన్నారు. ఆనందపురం వద్ద కూడలిని విస్తరిస్తామని చెప్పారు. వైజాగ్ పోర్టు నుంచి భోగాపురం వరకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించారని గుర్తు చేశారు. ఫాస్ట్ ట్రాక్ మోడ్‌లో అన్ని పనులు చేస్తున్నామని, ముఖ్యమంత్రి చొరవ వలన ఇప్పటికే విశాఖ కేంద్రంగా పలు కంపెనీలు వచ్చాయని, 15 బిలియన్ల డాలర్ల పెట్టుబడితో గూగుల్ వచ్చిందని ఇదొక మైలురాయని పేర్కొన్నారు. ఎం.ఆర్.వో. ఇండస్ట్రీస్ కార్యకలాపాల కోసం ప్రభుత్వం మరొక 500 ఎకరాలు కేటాయించామని, వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్‌గా భోగాపురానికి అనుసంధానంగా నెలకొల్పుతున్న ఎడ్యుసిటీ కోసం మాన్సాస్ సంస్థ 136 ఎకరాల భూమి ఉచితంగా కేటాయించిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

# అభివృద్ధిలో ఒక మైలురాయి: జగన్

## మా హయాంలోనే భూసేకరణకు రూ. 960 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి :** విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అవ్వడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయి అని, విజన్ వైజాగ్ లక్ష్య సాధన దిశగా పడిన కీలక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత దశకు చేరుకోవడానికి తమ ప్రభుత్వ హయాంలో వేసిన బలమైన పునాదే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ, "మా పాలనా కాలంలో ఈ ప్రాజెక్టుకు వేగవంతమైన అనుమతులు సాధించాం. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కోసం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ప్రాజెక్టుకు పటిష్ఠమైన పునాది వేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. ఆ రోజు మేం చేసిన కృషే ఇవాళ్టి ఈ కీలక మైలురాయిని చేరుకోవడానికి ముఖ్య కారణం" అని వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన జీఎంఆర్ గ్రూప్‌కు జగన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అదేవిధంగా, విశాఖపట్నం పోర్టును భోగాపురం విమానాశ్రయంతో అనుసంధానించే బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు 2023 మార్చిలో ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

>> మొదటిసారిగా నీళ్లిచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబు 2016-17లో గాలేరు-నగరి కాలువ ద్వారా గండికోట రిజర్వాయర్ నింపి పులివెందుల పైడిపాలెం ప్రాజెక్టుకు లిఫ్ట్ ద్వారా నీరందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అక్కడి నుంచి సిబిఆర్ ప్రాజెక్టు ద్వారా కడపకు నీరందించామన్నారు. 40 ఏళ్లలో వైఎస్ కుటుంబం చేయలేని పనిని సిఎం చంద్రబాబు చేసి చూపించారని మంత్రి సవిత కొనియాడారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా సిఎం చంద్రబాబు తీర్చిదిద్దారని, హెచ్‌ఎన్ఎస్ఎస్ ద్వారా కుప్పం వరకూ సాగు నీరందించామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా సిఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు కల్పించిన ఘనత చంద్రబాబుదేని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**రాయలసీమ ద్రోహి జగన్:** రాయలసీమ ద్రోహి జగన్ అని, తన రాజకీయ ఉనికి చాటుకోవడం కోసం డ్రామాలు ఆడడం ఆయనకు అలవాటేనని మంత్రి సవిత విమర్శించారు. 2024 ఫిబ్రవరి 26వ తేదీన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కుప్పం నియోజక వర్గానికి హంద్రీనీవా కాలువకు జగన్ నీటిని విడుదల చేస్తున్నట్లు ఒక డ్రామా ఆడారన్నారు. సినిమా సెట్టింగ్ మాదిరిగా ఓ గేటు పెట్టి... దాన్ని ఎత్తుతున్నట్లు మీడియా ముందు జగన్ హడావుడి చేశారన్నారు. ఆరోజు సాయింత్రానికి అదంతా ఒట్టి మోసమని తెలిపోయిందన్నారు. ప్రారంభించిన గేటు వెంట చుక్క నీరు కూడా పారలేదన్నారు. ఆ మరుసటి రోజు జేసీబీని తీసుకొచ్చి ఆ గేటును అక్కడి నుంచి తరలించిన విషయాన్ని మీడియాలో కూడా పెద్ద ఎత్తున ప్రచురితమైందన్నారు. డ్రామాల జగన్ రెడ్డి... ప్రాజెక్టుల కోసం మాట్లాడడం సిగ్గు చేటని మంత్రి సవిత విరుచుకుపడ్డదారు. అయిదేళ్లలో జగన్ రాయలసీమలో ఎక్కడైనా ఒక్క పిల్ల కాలువ తవ్వారా? అని ప్రశ్నించారు. కొత్త ప్రాజెక్టులు కట్టకపోగా, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను కూడా పట్టించుకోలేదన్నారు. అన్నమయ్య డ్యామ్ గేట్ కొట్టుకుపోయి 42 మంది మృతిచెందినా జగన్ పట్టించులేదని మంత్రి సవిత మండిపడ్డారు.

# విజయవాడలో ఐఎఎస్ భార్య అనుమానాస్పద మృతి

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడలో ఐఎఎస్ అధికారి భార్య అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఐఎఎస్ అధికారి గుజ్జర కిషో భార్య సత్యదీపిక గొంతుకు ఇన్‌ఫెక్షన్ సోక డంతో గత నెల 31న ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె మరుసటి రోజు చికిత్స పొందుతూ మరణించారు. ఆమె మృతి పట్ల బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.కిషోర్‌కుమార్ ఏపీమిషన్ ఫర్‌క్లీన్ కృష్ణా కెనాల్ పీడీగా పనిచేస్తున్నారు.

# తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టిన ప్రభుత్వం

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఏపీ ప్రభుత్వం తప్పుబట్టింది.వాస్తవ విరుద్ధ ప్రకటనలు, లెక్కలు తెర మీదకు తీసుకుని రావొద్దని ప్రభుత్వం స్పష్టం చేసిందిజ తన విన్నపం మేరకు చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిపివేశారని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న ఏపీ ప్రభుత్వం జగన్ హయాంలో అనుమతులు లేకుండా రాయలసీమ ఇరిగేషన్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టింది. జగన్ హయాంలోనే పనులు చేపట్టారు. సీమకు రోజుకు 3 టీఎంసీలు అంటూ గత ప్రభుత్వం హడావిడి చేసింది.



ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగిన తొలి ఎయిర్ ఇండియా విమానం

# మన సంబంధాలు బలోపేతం

>> తెలిపారు. ఈ మహాసభల్లో తనకు ప్రసంగించే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో ఉగాది పండుగను మారిషస్‌లో ఘనంగా నిర్వహించుకుంటామని చెప్పుకొచ్చారు. మారిషస్‌లో జాతీయ సెలవు దినంగా ప్రకటించి ఉగాది పండుగను చేసుకుంటున్నామని వెల్లడించారు. భాష, సంస్కృతి కాపాడటం ప్రతి దేశం బాధ్యత మాత్రమే కాదని.. అవసరం కూడా అని సూచించారు. అచెంచలమైన ప్రపంచానికి మార్గదర్శిగా తెలుగు భాషను అందించారని వివరించారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే మూడో భాషగా తెలుగు గుర్తింపు పొందిందని తెలిపారు. 50 దేశాల్లో తెలుగును ఎక్కువగా మాట్లాడుతుండటం భాషకు ఉన్న గొప్పదనానికి నిదర్శనమని చెప్పుకొచ్చారు. తెలుగు తమ సంస్కృతిలో అంతర్భాగంగా ఉందని తెలిపారు. ఇండియా, మారిషస్‌లను కలిపే సాంస్కృతిక బంధాలుగా తెలుగు ఉందని వివరించారు. ఈ మహాసభలు తెలుగు ప్రవాసాంధ్రులు, ఖండాల మధ్య అనుబంధాన్ని పెంపొందింపజేస్తుందని ధరమ్ బీర్ గోకుల్ వెల్లడించారు.

**ఆర్థిక అభివృద్ధిలో కీలకమార్పు:** 'మారిషస్ దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలకమార్పు తీసుకురావడంలో తెలుగు సమాజం ఎంతో పాటుపడుతోంది. మారిషస్‌లో తెలుగు భాషను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ భాషగా గుర్తించి విద్యాలయాల్లో బోధిస్తున్నాం. ఏపీ నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మారిషస్‌లో సాంస్కృతిక వేడుకగా నిర్వహించుకుంటారు. తెలుగు భాష విద్య సంస్కృతిని కాపాడటంలో మారిషస్ తెలుగు మహాసభ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన 108 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహంతో ఆలయం మారిషస్‌లో ఉంది. మహత్తరమైన వేంకటేశ్వరస్వామి విగ్రహం ఆధ్యాత్మిక, భౌగోళికంగా, భిన్న ఖండాల భక్తులను ఏకం చేస్తోంది'ధరమ్ బీర్ గోకుల్ అని సూచించారు.

**జాతీయ ఐక్యత పెరిగింది:**'మహాసభలను ఘనంగా నిర్వహిస్తూ తెలుగుపై చూపుతోన్న అంకిత భావానికి ఆంధ్ర సారస్వత పరిషత్‌ను అభినందిస్తున్నా. ఈ మహాసభల్లో జరిగిన చర్చలు, ఫలితాలు ప్రపంచంలో తెలుగు గుర్తింపును బలపరుస్తాయి. భారత్, మారిషస్ దేశాలు పరస్పరం అసాధారణ నాగరికత అనుబంధం కలిగిఉన్నాయి. భారత్, మారిషస్ దేశాలు సాంకేతిక అభివృద్ధిలో పరస్పరం సహకరించుకుంటున్నాయి.ఇరుదేశాల మధ్య వైవిధ్యాన్ని పెంపొందిస్తే జాతీయ ఐక్యతను, పరస్పర అవగాహనను పెంపొందింపజేస్తాయి. మారిషస్ జాతీయ నిర్మాణంలో మారిషస్‌లోని తెలుగు సమాజం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది' అని మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ వ్యాఖ్యానించారు.

# నీళ్ల లెక్కలు త్వరలో అన్నీ బయటపెడతా!

>> స్పష్టం చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకం వివాదం నేపథ్యంలో ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కాగా, రాష్ట్రం లో నీటి వనరుల నిర్వహణ, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి (రాయలసీమ లిఫ్ట్, పట్టిసీమ వంటివి)కి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టతనిచ్చే అవకాశం ఉంది. పోలవరం, వెలిగొండ వంటి మేజర్ ప్రాజె క్టులతో పాటు ఈ నీటి పంపకాలు ఏపీ రైతులకు కీలకం. చంద్రబాబు త్వరలో వివరణ ఇవ్వనుండడంతో ఈ అంశం మీద మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్ర పండుగగా వడ్డే ఓబన్న జయంతి

**విజయవాడ,.జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఓబన్న జయంతిని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, అనంతపురం పట్టణంలో రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు నేతృత్వంలో వడ్డెర సామాజిక వర్గీయులు మంత్రి సవితను కలిసి, వడ్డే ఓబన్న జయంతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ, విశ్వకర్మ, వాల్మీకి, కనకదాస, భగీరథ, వడ్డే ఓబన్న, గౌతు లచ్చన్న జయంతులను అధికారికంగా నిర్వహించామన్నారు. బీసీల ముద్దు బిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఈ నెల 11న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. అనంతపురం పట్టణంలో ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓబన్న జయంతికి రాష్ట్ర పండుగగా నిర్వహించేలా గతంలోనే కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో జారీచేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. బ్రిటీష్ పాలకుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చేసిన పోరాట పటిమను భవిష్యత్ తరాలవారికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన జయంతి నిర్వహణను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించారన్నారు. వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడంపై ఆయన సామాజిక వర్గీయులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఎంచంద్రబాబుకు,మంత్రి సవితకు ధన్యవాదాలుతెలియజేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, డైరెక్టర్లు, వడ్డెర సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ డైరీ ఆవిష్కరించిన వెంకయ్య నాయుడు

**విజయవాడ.జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక మహాసంగ్(ఎ.బి.ఆర్. ఎస్.ఎం.) 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఆదివారం సాయంత్రం విజయవాడ ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల అధ్యాపకులతో ఏర్పాటు అయిన ఈ సంస్థ సభ్యుల వృత్తిపరమైన అంశాలు, శిక్షణ, సదస్సులు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతుంది. విజయవాడ నగరం బందరు రోడ్డుని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎ.బి.ఆర్.ఎస్.ఎం. ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు ప్రొఫెసర్ రామిరెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, ఈసీ సభ్యులు డా. బాలకృష్ణ, డా. జి.అనిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం

>> సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడా స్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

## వారం - వర్జ్యం

05-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
విదియ ఉ.9.59
పుష్యమి మ.1.29
వర్జ్యం : రా.1.41-3.13, 2)మ.2.50-3.35
దు.ము.12.36-1.21, సా.5.30-6.30
శుభసమయం : ఉ.9.45-10.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికంగా ఉంటారు. తగు జాగ్రత్తలు పాటించండి.

**మిథునం:**ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అను కూలంగా ఉంటుంది. నరదృష్టి అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:**మీ ఆత్మ గౌరవానికి మచ్చ తేవడానికి ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఫలించవు. వెన్నునొప్పి బాధిస్తుంది.

**సింహం:** సనాతన విద్యల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. ఒక సమస్య తీరితే మరో సమస్య పరిష్కరించుకోవలసి వస్తుంది.

**కన్య:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. మిత్రులకు మీ వంతు సహాయం అందిస్తారు. సంబంధబాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:**దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు భూముల క్రయ విక్రయాలు ప్రోత్సాహకరంగా వుంటాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి కాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మకరం:**స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు వుంటాయి.

**కుంభం:**ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరుచుకునే యత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** మీ మనస్సులోని మాటను ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## "మన శంకరవరప్రసాద్" విజయవంతం కావాలని వేడుకున్నాం

తిరుమల, జనవరి 4 (ప్రభాతవార్త ప్రతినిధి): సినీనటుడు చిరంజీవి, నయనతార నటించిన 'మన శంకర వరప్రసాద్' చిత్రం ఈనెల 12న విడుదల కానుందని, ఆ చిత్రం విజయవంతం కావాలని ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు చిత్ర నిర్మాత సాహు గారపాటి, గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి తెలిపారు. చిత్రం విజయవంతంకోసం ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి నిర్మాతతో కలిసి శ్రీవారి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్రం ట్రైలర్ విడుదలైంది.

## ఆలయ గోపురం పైకెక్కిన నిందితుడికి రిమాండ్

తిరుపతి, జనవరి 4 (ప్రభాతవార్త ప్రతినిధి): ఆధ్యాత్మికనగరం తిరుపతి నగరనడి బొడ్డున కొలువైన గోవిందరాజస్వామి ఆలయ మహాద్వార రాజగోపురంపైకి మద్యంమత్తులో ఎక్కిన నిందితుడు తిరుపతి(43)ని తిరుపతి తూర్పు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ తలుపులు మూసివేసిన తరువాత శుక్రవారం రాత్రి అనధికారికంగా ఆలయంలోనికి వెళ్లి భక్తుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యవహరించిన అతనిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, సిఐ శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి నడిబొడ్డున పట్టణ ప్రజలే కాపలాగా ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో భద్రత తీసికట్టుగా తయారవడం, శుక్రవారం రాత్రి ఆలయం తలుపులు మూసివేసిన తరువాత 11గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఉన్న తెలంగాణ నిజామాబాద్ జిల్లా కుర్మవాడ పెద్దమల్లారెడ్డికాలనికి చెందిన "కుతడి తిరుపతి"(43) గోడదూకి గోపురంపైకి చేరి భయాందోళన గొల్పిందాడు. ఆలయ భద్రతకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడంతో తిరుపతివాసులు తీవ్రంగా పరిగణించారు. అతనిని ఎట్టకేలకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తాళ్ల సాయంతో క్రిందకు తీసుకురావడం జరిగింది. ఈ తప్పిదాలకు కారణమైన టిటిడి జమేదార్ పట్నాభిరెడ్డిపై చర్యలు తీసుకున్నారు. అతనిని ఆలయం నుండి తప్పించారు.

## హైకోర్టుకు చేరిన వేదిక్ వర్శిటీ రగడ

### రిట్ పిటిషన్ దాఖలుచేసిన మాజీ విసి

తిరుపతి, జనవరి 4 (ప్రభాతవార్త ప్రతినిధి): తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయంలో వలులంతాలపై రగడ హైకోర్టుకు చేరింది. ఇప్పటికే విసిగా అనర్హుడని తొలగించిన రాణి సదాశివమూర్తి హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేయడం సంచలనంగా మారింది. గత వైసిపి ప్రభుత్వంలో గత టిటిడి బోర్డు రాణి సదాశివమూర్తిని వేదిక్ వర్శిటీ విసిగా నియమించింది. ఆయనపై అప్పట్లోనే పలు ఆరోపణలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయనను విసిగా తొలగిస్తూ టిటిడి బోర్డు తీర్మానించింది. ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుతో రాష్ట్ర ప్రభుత్వం, ఎక్స్ అఫిషియో కార్యదర్శి, టిటిడి, సివిఎస్‌ఒలు ప్రతివాదులుగా చేర్చారు. విసి పదవికి ఆయన అనర్హుడని విజిలెన్స్ నివేదిక ఆధారంగా తొలగించింది. ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో ఏం జరుగుతుందనేది చూడాల్సిందే.

# ఉద్యోగుల హక్కులు పరిరక్షిస్తాం

● ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వానికి వారధులు ● దేశానికి సందేశం ఇచ్చేలా బిసి, ఓబిసి ఉద్యోగుల సదస్సు నిర్వహణ: మంత్రి ఎస్.సవిత ● బిసిల రక్షణ కోసం 'బిసి రక్షణ చట్టం': మంత్రి కొల్లు రవీంద్ర



సచివాలయం, జనవరి 4 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం బిసి ఉద్యోగులకు వెన్నుదన్నుగా ఉంటూ వారికి ఎంతో ప్రాముఖ్యాన్ని ఇస్తుందని రాష్ట్ర బిసి చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బిసి, ఓబిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ కు మంత్రి సవిత ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బిసి ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశానికి మంచి సందేశం ఇచ్చేలా బిసి, ఓబిసి ఉద్యోగుల సదస్సు నిర్వహణ ఉందన్నారు.ఒక బిసి మంత్రిగా కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వకారణమన్నారు. ఈ మహాసభను విజయవంతం చేసిన బిసి అసోసియేషన్ అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, గౌరవాధ్యక్షులు అప్పారావు సహా ఇతర బిసి నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే ఆశయాలను రాష్ట్రంలో అమలు చేసిన తొలి నాయకుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించి వారు రాజకీయంగా పారిశ్రామికంగా ఎదిగేలా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ఒరవడిని కొనసాగిస్తూ బిసి ఉద్యోగుల పక్షపాతిగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల భయాలకు తావులేకుండా ప్రశాంతంగా పనిచేసే పరిస్థితి ఉందని భరోసా ఇచ్చారు. బిసి, ఓబిసి వర్గాల అభివృద్ధికి విద్యే కీలకమని, డిఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లు, బిసి హాస్టళ్ళు, గురుకుల పాఠశాలల ఆధునీకరణ ద్వారా ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతిని రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా బిసి,ఓబిసి ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా అమరావతిలో ఈ మహాసభ జరగడం చారిత్రాత్మకమన్నారు. గతంలో బిసిలపై జరిగిన అణచివేతకు ఈ సభ ధైర్యాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో బిసిల వైపు చూడాలంటే భయపడేలా బీసీల రక్షణ కోసం ప్రత్యేక "బిసి రక్షణ చట్టం" తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. బిసి ఉద్యోగులతో 26జిల్లాల కమిటీలను వేయడం అభినందించాల్సిన విషయమన్నారు. బిసి ఉద్యోగుల సంఘం నేత గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ, రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, రెగ్యూలర్ విభాగాల్లో కలిపి 7లక్షల మంది బిసి ఉద్యోగులు న్నారని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి ఏప్రిల్ 11ను ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని, బిసిలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, బిసి అట్రాసిటి చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, బిసి, ఓబిసి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వరరావు, జనరల్ సెక్రటరీలు పి.శ్రీధర్, భూషణ్‌రావు, ట్రెజరర్ వై.శంకర్‌రావు, 26జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# కరెంటు చార్జీలు తగ్గించేందుకు సర్కార్ కసరత్తు

● సూర్యఘర్ పేదలకు వరం ● విద్యుత్ రంగాన్ని గత సర్కార్ నాశనం చేసింది: మంత్రి పార్థసారథి



నూజివీడు, జనవరి 4 ప్రభాత వార్త: రాష్ట్రంలో రానున్న రోజులలో విద్యుత్ చార్జీలు మరింత తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పత్రికా విలేఖరుల సమావేశంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమనే మాటకు తాము కట్టుబడి ఉన్నామని, అంతేకాక ప్రస్తుతం ఉన్నా విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు సిఎం చర్యలు తీకుంటున్నారన్నారు. ప్రజలకు మంచి చేసే తమ ప్రభుత్వం ట్రూ డౌన్‌తో రూ.4789 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా తగ్గించిందన్నారు. 2019 ముందు తమ ప్రభుత్వ సమయంలో వేలాది కోట్ల రూపాయలతో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లు నెలకొల్పి రూ.2.49లకే విద్యుత్ అందిస్తామని కంపెనీలు ముందుకు వచ్చినా, కక్షపూరిత ధోరణితో గత ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. రూ.5.19, రూ.5.50ల అధిక రేట్లకు ఓపెన్ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలుకు అగ్రిమెంట్ కుదుర్చుకుని, విద్యుత్ భారాన్ని ప్రజల నెత్తిన వేశారన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా ట్రూ అప్ పేరుతో రూ.4,789 కోట్లు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడిందన్నారు. ఆ భారం ప్రజలపై వేయకుండా తమ ప్రభుత్వమే భరిస్తుందని, తమ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సుపరిపాలనకు ఇది నిదర్శనమన్నారు. ఒక విజనరీ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో నిలిపేందుకు విదేశాల నుండి లక్షల కోట్ల రూపాయలతో పెట్టుబడి పెట్టేలా పారిశ్రామికవేత్తలను ఒప్పించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని, వీటి ద్వారా లక్షలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. సూర్య ఘర్ యోజన పథకం కింద పేదలకు సోలార్ విద్యుత్ యూనిట్లు అందిస్తున్నామన్నారు. రైతులు పొలాల్లో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటు న్నామని, గత ప్రభుత్వం పంచాయతీల నిధులు పంచాయతీ సిబ్బందికి తెలియకుండానే మాయం చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని, రాష్టంలోని గ్రామాలలో 5 వేల కిలోమీటర్ల మేర రోడ్లు, ప్రతీ ఇంటికీ త్రాగునీటి పైప్ కనెక్షన్ అందిస్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు.

## తిరుమల సమాచారం



### వేడుకగా కలహ శృంగార భరిత ఉత్సవం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం తరువాత ఐదవరోజు ఆదివారం తిరుమలలో కలహ శృంగార భరితమైన ప్రణయ కలహోత్సవం జరిగింది. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా ఆలయం మాఢవీధుల్లో ఉత్తరమాఢ వీధికి చేరుకున్నారు. అక్కడ వరాహస్వామి ఆలయం సమీపంలో అమ్మవార్లు, స్వామివారు ఎదురేగారు. ఆలయ అర్చకులు, పరిచారకులు స్వామి అమ్మవార్ల తరపున పూలబంతులను విసిరేసుకుంటూ స్వామివారిని నిందాస్తుతి చేసి పాశురాలను పారాయణం చేశారు. అమ్మవార్ల నుండి తప్పించుకుని ఆలయంలోనికి ఒకే పల్లకిలో వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో జీయంగార్లు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొని ఆసక్తికర సన్నివేశాలను తిలకించారు.



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో బారులు తీరిన శ్రీవారి భక్తులు

### వారాంతం.. వైకుంఠద్వారం

# కొండంతా భక్తజనం

### బారులు తీరిన భక్తులు... వెంకన్న దర్శనానికి 15గంటలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కొనసాగుతున్న వైకుంఠద్వార దర్శనాలు... ఆపై వారాంతం కావడంతో ఆదివారం కూడా తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయానికి భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వద్దకు చేరాయి. సాధారణ సర్వదర్శనంలోనే భక్తులను అనుమతిస్తుండటంతో వైకుంఠ దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తుండటంతో వెలుపల క్యూలైన్లలో నుండి భక్తులు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి వస్తోంది. ఆదివారం ఉదయానికి కూడా భక్తులతో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఉదయం 5గంటలకు వైకుంఠం-1, 2లో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నిండాయి. సర్వదర్శనానికి భక్తులు 20గంటలు నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి మరింతగా భక్తుల రద్దీ పెరిగినా దర్శనానికి 15గంటలు పట్టేసమయం మారింది. తిరుమల క్యూలైన్లలో ఉన్న భక్తులకు వైకుంఠం కంపార్టుమెంట్లలోని భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టి, మజ్జిగ, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. ఆలయంలో త్వరగా క్యూలైన్లు కదిలేలా టిటిడి అడిషనల్ ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం వరకు 43వేల మంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.



# రూ.కోటి విరాళమిచ్చే దాతలకు... ఏడాదిలో

# 3 రోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆ దేవదేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాల్నికార్యాలయంలో చూపి పొందవచ్చు.

### మదినిండా దేవదేవుని దర్శనం

ఒక్కసారి గోవింద.. గోవిందా... నామంతో మనస్ఫూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరిపోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైనా వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన ,కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళ ప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు, దాతలు 1.50 కోట్ల రూపాయలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరు మందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారుజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయం లోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రబాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, వసతి, ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలుబాటు కల్పించారు.

### రూ.కోటి విరాళాలివ్వాల్సిన పథకాలు

దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదాన ట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్‌విబిసి ట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకు దాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఓవి,ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి, చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్) అందజేయవచ్చు.

### మార్చి 3న సంపూర్ణ చంద్రగ్రహణం

# శ్రీవారి ఆలయం మూత

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వ తేదీ మంగళవారం 10.30 గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేస్తున్నారు. ఆరోజు సాయంత్రం 3.20గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి ఆరుగంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మార్చి 3వ తేదీ ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30 గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పున:ప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళ పాద పద్మారాధన సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తులు గమనించి తిరుమల యాత్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని టిటిడి కోరింది.

# రేపు తిరుమలకు మారిషస్ అధ్యక్షుడు రాక



తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్‌గోకుల్ రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనకు మంగళవారం సాయంత్రం తిరుపతికి విచ్చేస్తున్నారు. ఆయన 6, 7తేదీల్లో శ్రీకాళహస్తి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రముఖుని పర్యటనతో తిరుపతి జిల్లా యంత్రాంగం ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ ఎన్.మౌర్య, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇతర ఉన్నతాధికారులు కలసి ఆదివారం భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లపై సమీక్షించారు. అందరూ కలసికట్టుగా పర్యటనను విజయవంతం చేయాలని, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మౌర్య సూచించారు.

# శ్రీవారి దర్శనంతో సకల శుభాలు: ప్రముఖులు



తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ధనుర్మాసంలో వైకుంఠద్వారంలో దర్శించుకుని ఆశీస్సులు అందుకోవడంతో సకల శుభాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం నైవేద్య విరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, రాజస్థాన్ మంత్రి కృష్ణకుమార్, కేంద్ర సహాయమంత్రి ప్రతాపవరావు జిజాదవ్, విశ్రాంత డిజిపి ఆర్‌పి ఠాకూర్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఖాళీ మద్యం సీసాలెలా వచ్చాయి!?



# ఎవరిదీ పాపం?


### పుణ్యక్షేత్ర పవిత్రతను దెబ్బతీస్తున్న మందుబాబులు

### ఆరా తీస్తున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న పాపం ఎవరిదనే వెదికి పట్టుకోవాల్సిన అవసరం పోలీసులు, టిటిడి విజిలెన్స్‌పై ఉంది. తరచూ తిరుమలకు మద్యం బాటిళ్ళతో రావడం, మాంసాహార భోజనాలు తీసుకురావడం పట్టుబడటం వంటి ఘటనలు జరిగిపోతున్నాయి. ఇప్పుడు తిరుమల బాలాజీనగర్ ప్రాంతంలోని ఖాళీస్థలంలో కొన్ని మద్యం ఖాళీ సీసాలు, శీతల పానీయాల సీసాలు పడిఉండటంతో పెద్ద కలకలం రేపింది. ఆదివారం ఉదయం కొందరు యాత్రికులు గమనించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఖాళీస్థలంలో ముళ్ళచెట్ల మధ్య ఖాళీ సీసాలు పడేసింది ఎవరు, అక్కడకు ఎలా తీసుకువచ్చారనేది ఇప్పుడు తేల్చాల్సిన అసలు విషయం. తిరుమలను పూర్తిగా మద్యం, మాంసం, ధూమపానం రహిత క్షేత్రంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో దేవాదాయశాఖ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం అమలు పటిష్టంగా జరుగుతున్నా కొందరు నిబంధనలకు తిలోదాకాలిచ్చేస్తున్నారు. ఆర్టీసి బస్సుల్లో, ప్రైవేట్ ట్యాక్సీల్లో మద్యం సీసాలు తిరుమలకు తీసుకువస్తున్న వారెవరనేది ఇప్పటికే పోలీసులు సమాచారం సేకరించారు. టిటిడి విజిలెన్స్ కూడా ఈ విషయంపై తీవ్రంగానే సెర్చ్‌ఆపరేన్ మొదలుపెట్టింది. తాజాగా ఆదివారం ఉదయం బాలాజీనగర్ ప్రాంతంలో ఖాళీ మద్యం సీసాలు ఉండటంతో పెద్ద దుమారం రేగింది. తిరుమల పవిత్రతను కాపాడటంలో టిటిడి ఉద్యోగులు కీలకం. మరీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, కొందరు మఠాల సిబ్బంది కూడా అలిపిరి తనిఖీ కేంద్రంలో తనిఖీలకు అతీతులుగా మారారు. ట్యాక్సీల్లో ప్రయాణించినా, సొంత వాహనాల్లో వచ్చినా, ఆర్టీసి బస్సుల్లో కార్మికులు తిరుమలకు వస్తున్నా వారంతా ఐడి కార్డులు ధరించి బస్సుల నుండి తనిఖీలకు వెళ్ళడంలేదనేది భక్తుల్లోనూ వ్యక్తమవుతున్న విమర్శలు. తిరుమలకు మద్యం సీసాలతో వస్తున్న వారిని పట్టుకోవడం ఇప్పుడు అటు పోలీసులకు ఇటు విజిలెన్స్‌కు సవాల్‌గా మారింది. మరీ ఈ ఖాళీ మద్యం సీసాలు అక్కడ ఎలా వచ్చాయనేది సిసికెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. తిరుపతి, తిరుమల పోలీసులు పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చి కాపాడటంలో చిత్తశుద్ధితో ఉన్నామనే ప్రకటన చేశారు.

# దేవుని చెంత ఒక్కటయ్యే జంటలు...

# ఆన్‌లైన్‌లోనే బుకింగ్!



### కల్యాణ వేదికలో సకల సౌకర్యాలతో ఉచిత వివాహాలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద, మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణవేదిక ఉంది. పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాల నుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్ చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 తాజా సమాచారం మేరకు 36 వేలకు పైగా జంటలకు వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు, మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు, కుంకుమ, కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళి కుమారుడు, పెళ్లి కుమార్తెబాటు ఇరువురు తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరుమందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు. దర్శనానంతరం ఆరుమందికి 6 ఉచిత లడ్డూలు కౌంటర్లలో అందుకోవచ్చు.

తిరుమలలోని కల్యాణవేదికలో పెళ్లిచేసుకోవాలనే యువతీ యువకులు ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనే కల్యాణవేదిక స్లాట్స్ బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 2016 మేనెల నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఆయా ప్రాంతాల్లోని నెట్‌సెంటర్‌లలో టిటిడి హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఓవి.ఇన్ ద్వారా బుక్‌చేసుకోవాలి. కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే జంటలు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు, ప్రేమ వివాహాలు జరుపబడవు. ఇతర వివరాలకు 0877-2263433 నంబర్‌కు సంప్రదించాలి.

వార్త

జాతీయ ప్రగతి అంటే శక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

న-ఖలీల్ జిబ్రాన్

# మదురో బందీ.. దురాక్రమణే!

'కుక్కను చంపాలంటే దానికి పిచ్చిదని పేరు పెట్టాలని' సామెత ఉండనే ఉంది. ఇప్పుడు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో శ్వేత సౌధాధిపతి ట్రంప్ అదే చేశాడు. తొలుత మదురోను 'నార్కోటిక్ టెర్రరిస్ట్'గా అభి వర్ణించారు. వెనిజులా అనగానే ప్రపంచంలోనే అతిపెద్ద చమురు బావులున్న దేశం. ఇప్పటికే 200ఏళ్లకు పైగా సరిపడ చమురు నిల్వలున్న అమెరికా వెనిజులా చమురు సంపద కోసం తహతహ లాడుతోంది. ఆ నేపథ్యంలోనే తొలుత మదురోను డ్రగ్స్ రాకెట్‌కు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. గత నెల రోజులుగా కన్నేసి ఉంచిన అమె రికన్ గూఢచారులు మదురో కిడ్నాప్‌కు మార్గం సుగమం చేశారు. ఉన్నట్టుండి శుక్రవారంరాత్రి ఒక్కసారిగా అమెరికన్ సైన్యం వెనిజులా రాజధాని కరాకస్‌పై బాంబులు దాడి చేసింది. గుళ్ల వర్షం కురిపించింది. మొత్తం కరెంటు ఆపేసి ఆపరేషన్ నిర్వహించిన అమెరికన్ బలగాలు ఏకంగా మదురో నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించి ఆయనను ఆయన పట్ట మహిషి సిరియా ఫ్లోర్స్‌ను కూడా అమెరికన్ కమాండోలు బందీగా తీసుకెళ్లారు. అర్ధరాత్రి ఒంటిగంట నాలుగు గంటల మధ్య ఈ ఆపరేషన్ జరిగింది. కరాకస్‌పై అమెరికన్ సైన్యం భీకరదాడులు చేసింది. వెనిజులాను ఆక్రమించి, తన ఆధిపత్యంలోకి తీసుకోవడంగానీ, తన అనుయాయుల్ని అక్కడ ప్రతిష్టించడం కానీ ప్రణాళికలు సిద్ధం చేస్తూనే రెండునెలలు దాడి తప్పదని సంకేతాలు పంపారు. ఒకపక్క వెనిజులాను హెచ్చరిస్తూనే ట్రంప్ తన వ్యూహం తాను పన్నారు. వెనెజులా సార్వభౌమత్వంపై అమెరికా దాడి చేసిందని లోకమంతా విమర్శిస్తోంది. ఈ సంఘటనను ఖండిస్తున్నాయి. కొన్నిదేశాలు ఈ చర్యను సైనిక దుశ్చర్యగా వర్ణిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని రష్యా భావన. అవసరమనుకుంటే అమెరికా వెనిజులా మధ్య తాము సయోధ్య చేకూరుస్తామని స్పెయిన్ దేశం ముందుకు వచ్చింది. వెనిజులాతో చైనా వ్యూహాత్మక భాగస్వామి. కాగా చైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఖండించి ఊరుకుంది. వెనిజులాలో తమ దేశ అధ్యక్షుడిపై ఎన్ని వ్యతిరేకతలున్నా మదురోను కిడ్నాప్ చేయడాన్ని ఆ దేశ ప్రజలు జీర్ణించుకో లేకపోతు న్నారు. సాధారణంగా అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం సంపాదించాలన్న సామ్రాజ్యకాంక్ష కలిగి తమకు కలిసి రాని దేశాలపై తరచు దాడులు చేయడం దాని నైజం. తాజా పరిస్థితుల్లో నోబెల్ బహుమతి గ్రహీత మరియా మచాడోను వెనిజులా పీఠం మీద కూర్చోబెట్టాలని ట్రంప్ ప్రణాళిక.

నిజానికి ఆమె మదురోకు వ్యతిరేకంగా పోరాడిన ఉక్కు మహిళగా పేరుంది. ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకురాలు కనుక ప్రజల్లో వ్యతిరేకత ఉండకపోవచ్చు అన్నది ట్రంప్ అభిప్రాయం. ఆమె ఇంతవరకు మదురో కిడ్నాప్ సంఘటనపై నోరు మెదపలేదు. మదురో తన కిడ్నాప్‌కు ముందే దేశంలో అత్యయిక పరిస్థితిని విధించారు. ఉరుములులేని పిడుగులా అమెరికా సైన్యం వెనిజులాపై దాడికి దాడులకు దిగింది. సైనిక స్థావరంలో పొగ, అంధకారం అలుముకున్నాయి. కారకాసులోని లొకార్లోటా, ఫ్యూర్టీ లియునా మిలటరీ చేసే లాగ్ వైరా నౌకాశ్రయం, అనేక ఇతర సైనిక స్థావరాలు పై అమెరికా దళాలు దాడులు చేశాయి. మదురో దంపతులను యుద్ధ నౌకపై అమెరికాకు తరలించారు.

వెనిజులాలో సురక్షితంగా అధికార బదిలీ జరిగే వరకు అక్కడ తమ పర్యవేక్షణ కొనసాగుతుందని మాత్రం ట్రంప్ స్పష్టం చేసారు. వెనిజులాలో అమెరికా చమురు కంపెనీలే వాణిజ్య వ్యవహారాలను నిర్వహిస్తాయని ఆయన చెప్పకనే చెప్పారు. వెనిజులా ఆపరేషన్‌ను ట్రంప్ స్వయంగా వీక్షిస్తూ సంతృప్తి పొందారు.'సెకండ్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలకొట్టడం తాను ఎప్పుడూ చూడలేదని' అంటూనే అంతే అమితవేగంగా అమెరికన్ సైన్యం తమ అభీష్టాన్ని నెరవేర్చిందని కితాబిచ్చారు. ఈ దాడిని ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు పాలకులు, పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మాదకద్రవ్యాల సాకుతో అమెరికా వెనిజులాను అనేకసార్లు మందలించింది. మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకోవాలని అమెరికా వెనిజులాను కోరుతూనే ఉంది. ఈలోగానే తూర్పు పసిఫిక్, కరేబియన్ సముద్ర జలాల్లో సైన్యాన్ని మొహరించింది. 35 వెనిజులా నౌకలపై అమెరికా దాడులు చేసి 115 మందిని చంపేసింది. డ్రగ్స్ నిరోధానికి ఏం చేయాలో పరస్పర చర్చల ద్వారా నిర్ణయించుకుందామని గత జులైలో మదురో ఓ ఇంటర్వ్యూలో అమెరికాకు పిలుపునిచ్చారు. అయినా ఆగస్టులోనే కరేబియన్ సముద్రంలో భారీగా సైన్యాన్ని మోహరించింది. తదనంతర పరిణామాల్లో మదురో తమ మాట ఖాతరు చేయడంలేదని భావించి, వెనిజులాను స్వాధీనం చేసుకో వాలని నిర్ణయానికి ట్రంప్ నిర్ణయించారు. మదురో దంపతుల అరెస్ట్ వెంటనే ట్రంపు మహదానంద భరితుడై వెనిజులా ఉపాధ్యక్షుడు సమన్వయంతో రక్షణ కార్యదర్శి పీతే హేగ్ పెట్, విదేశాంగ కార్యదర్శి మార్కో రోహి యోలను నేతృత్వంలో ఒక బృందం వెనిజులా ప్రభుత్వాన్ని తాత్కాలికంగా నడుపుతుందని ట్రంపు నిర్దేశించారు. 2000 సంవత్సరంలోనే మదురో,ఆయన శ్రీమతిపై న్యూయార్క్ ప్రభుత్వం నార్కో టెర్రరిజం కుట్ర అభియో గాలను మోపింది. ఈ కారణంగా అమెరికా చట్టాల ప్రకారం న్యూయార్క్ కోర్టులోనే విచారించనున్నట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండే వివరించారు. ఏది ఏమైనా అగ్రరాజ్యం అత్యంత చమురు సంపన్న దేశం పైన కన్నేసి, తన కనుసన్నలలో మెలిగే ప్రయత్నం సఫలీకృతమైంది. సామ్రాజ్యవాదం అంటే ఇదే మరి!

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

నిన్ను నీవు కనుగొనడానికి-మార్గం ఇతరుల సేవలో నిన్ను నీవు మరిచిపోవడమే.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### అనాగరిక పద్ధతులను మానాలి

అన్యాయంజరిగితేన్యాయంజరిగేలా చర్యలు తీసుకోవాలి. అవినీతి జరిగితే సంబంధించిన వ్యవస్థలచే నిజం ఏమిటోతెలుసుకుని చట్టప్రకారం శిక్షలువేయాలి. రాష్ట్రాలను, దేశాన్నిఅనేక పార్టీలుఎన్నికలలో గెలిచి పదవులు చేపడతాయి. పార్టీలు, పదవులు శాశ్వతంకావు. ప్రజాక్షేమం దానికితగ్గ సంక్షేమం సమకూర్చడమే పాలకులవిధి. నాయకులు గతప్రభుత్వ విధానాలను ఏలాగైనా విమర్శించవచ్చును.అవినీతి పరులను శిక్షించేదిఒక్కన్యాయ వ్యవస్థ మాత్రమే.ఈక్రమంలో నాయకులు ఒకరినొకరు అసభ్యపదజాలంతో,అనాగరిక పద్ధతులలోవేదికల మీద మాట్లాడడం మంచిదికాదు.ఉరితీస్తాం.రాళ్లతోకొట్టి చంపొచ్చు అంటూ మాట్లాడటంమానుకోవాలి.అప్పుడే సభ్య సమాజంలో పాలకులకుఅత్యంత గౌరవం దక్కుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కొత్త ఏడాదిలో డీ.ఎస్సీపై నిరుద్యోగుల ఆశలు

తెలంగాణలో 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11వేల టీచర్ పోస్టులు త్వరితగతిన భర్తీ చేసిన ప్రభుత్వం మరో 6వేల టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు మరో నోటిఫికేషన్ జారీ చేస్తామని గత డీఎస్సీ పూర్తిచేసే సమయంలో ప్రకటించారు. కానీ ఇప్పటివరకు మరొక నోటిఫికేషన్ జారీ కాలేదు. గత డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయి దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది. పదవి విరమణ ద్వారా ఏర్పడినఖాళీలు ప్రమోషన్స్‌ద్వారా ఏర్పడినఖాళీలు కలిపి దాదాపు 12 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 8 వేల ఎస్జీటీ పోస్టులు 4 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రస్తుతం ఖాళీలు ఉన్నాయి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

### తెలుగుభాషకు కృషి చేయాలి

భారతీయ రైల్వేశాఖ కొత్తగా రెండుస్లీపర్‌క్లాస్‌తో వందే భారత్‌రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీతగాళ్లుకూడా భరించే అవకాశంలేదు. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితోఉన్న వందేభారత్ రైలు టికెట్‌ఛార్జీ, ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరంగమ్యం చేరే సదుపాయం కలుగుతుంది.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

### మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

మన మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు, భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్నిమనం,మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటి వద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షలకోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థం చేసుకునేందుకు సులువుగా ఉంటుంది.ఆచరణమనం చేసి వారసులుకూడా దీన్నితప్పక మక్కువ పెంచాలి. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది.సాహిత్యంలో అనువాదం గొప్పది. గావున భాషల్లో తేడాను , మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి. మన మొక్కలకు మనం నీరుపోసి పెంచినట్లు .

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### విలువలను రక్షించే విధానాలు కావాలి

రాజ్యాంగ విలువలు రక్షించబడిన రాజ్యం విధానాలు కావాలి. తెలంగాణ రైజింగ్ మీద గాని బంగారు తెలంగాణ మీద గాని నమ్మకం లేదు గాని సమగ్ర అభివృద్ధి చెందిన జీవన ప్రమాణాలు మెరుగుపడిన రాజ్యం మాత్రంకావాలి. పాలమూరు ప్రజల గోస తీరాలిఉత్తరాంధ్ర ప్రజల గోసకూడా తీరాలి. రాయలసీమ కూడా సమగ్ర అభివృద్ధి సాధించాలి అప్పుడు మాత్రమే విలువైన ప్రజాస్వామిక రాష్ట్రాలు పాలన చేయడం సుసాధ్యం అవుతుంది. అభివృద్ధి పేరిట ఆరావళి ప్రాంతంలో జరుగుతుంది ఏమిటి? ప్రపంచానికి అమెజాన్ అడవులు ఎలాగో అలాగే ఆరావలి. సుందర్ బన్ అడవులు అయితే వాటిని రక్షించుకోవాలి. అభివృద్ధి పేరిట సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను నాశనం చేయని ప్రభుత్వ విధానం కావాలి.

- భారత అవినాష్, జనగామ

### సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ, తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెడన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సుస్థిరాభివృద్ధితో లక్ష్య సాధన!

**పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటినిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరిం చడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.**

డా. సునీల్ కుమార్ పోతన

శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ అనేవిమానవ ప్రాథమిక అవసరాలు. ఐక్యరాజ్యసమితి 2030సుస్థిర అభివృద్ధి లక్ష్యం ప్రకారం ప్రజలందరికీ పరిశుభ్రమైన నీరు అందించాలి. మెరుగైన స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. పరిశుభ్రతను మెరుగుపర్చాలి. బహిరంగ మలవిసర్జనను అంతం చేయాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి. నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించాలి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి నీటి సంబంధిత పర్యావరణ వ్యవస్థలను రక్షించాలి. మంచి ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి పరిశుభ్రమైన నీరు, సరైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. 2025 పూర్తి అయ్యేనాటికి, ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్య అంశాలలో పురోగతి కొనసాగింది, కానీ, కొన్ని అంతరాలు అలాగే ఉన్నాయి.2015 నుండి తాగునీరు, పారిశుద్ధం, పరిశుభ్రత సేవలకు ప్రాప్యత మెరుగుపడినప్పటికీ, కోట్లమంది ప్రజలు ఇప్పటికీ తగినంతగా సేవలు పొందడంలేదు. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 220 కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే తాగునీటి లభ్యత లేదు. దాదాపు 340కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే పారిశుద్ధ్య సేవలు లేవు. దాదాపు 170 కోట్ల మందికి ఇంట్లో ప్రాథమిక పరిశుభ్రత సౌకర్యాలు లేవు. ముఖ్యంగా పాఠశాలల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక్కడ దాదాపు 64.6 కోట్ల మంది పిల్లలకు ఇప్పటికీ ప్రాథమిక పరిశుభ్రత సేవలు లేవు, ఇలాంటి పరిస్థితుల్లో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలను చేరుకోవడానికి పురోగతి అనేక రెట్లు పెరగాలి. గృహ వ్యర్థజలాల్లో కేవలం 56 శాతం మాత్రమే సురక్షితంగా శుద్ధి చేస్తున్నారు. అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి మంచినీటి పర్యావరణ వ్యవస్థలు క్షీణిస్తున్నాయి. దేశాల మధ్య భాగస్వామ్య నీటి వనరులపై సహకారం పరిమితంగానే ఉంది. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2049కి ముందు ప్రపంచ స్థాయిలో స్థిరమైన నీటి నిర్వహణ సాధించడం సాధ్యం కాదు.భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక2025 అధికారిక గణాంకాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యం పర్యవేక్షణ ప్రకారం భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది. 15.7కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద ఇంట్లో పైపుల ద్వారా పంపు నీటిని పొందుతున్నాయి. మొత్తం జనాభాలోదాదాపు 76 శాతం మంది సురక్షితంగా నిర్వహించే తాగునీటి సేవలను ఉపయోగిస్తున్నారు. దాదాపు అన్ని కుటుంబాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగాఅన్ని జిల్లాలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద బహిరంగ మలవిసర్జన రహితంగా మారినట్లు జలశక్తి మంత్రిత్వశాఖ ధ్రువీకరించింది. అదనంగా,2025 పూర్తయ్యే నాటికి, దాదాపు 5.6



లక్షల గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితం ప్లస్ హోదాను సాధించాయి. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలతో పాటు స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణను ఇది సూచిస్తోంది. నీటి నాణ్యతకు సంబంధించి భారతదేశం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. గృహ వ్యర్థ జలాలలో దాదాపు 29 శాతం మాత్రమే విడుదలకు ముందు శుద్ధి చేస్తున్నారు. ఈ సంకేతం బలమైన మురుగునీటి మౌలిక సదుపాయాల అవసరాన్ని సూచిస్తోంది. తాగునీటి భద్రతను పరిష్కరించడానికి ప్రభుత్వం దేశవ్యాప్తంగా 2,100కి పైగా నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. నీటి వినియోగ సామర్థ్యం, నీటి నిర్వహణ, భూగర్భజలాల లభ్యత, వర్షపు నీటి సేకరణ మెరుగైనట్లు 2025 నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ పరిరక్షణ కార్యక్రమాలు, ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030లక్ష్యాల అనుసంధాన పర్యావరణ ఫ్రేంవర్క్‌తో నదులు, సరస్సులు,చిత్తడి నేలలు, భూగర్భ జలాలను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మొత్తంమీద, 2025 పూర్తయ్యే నాటికి, నీరు, పారిశుద్ధ్య నిర్వహణలో భారతదేశం బలమైన పురోగతిని సాధించింది. నీటి నాణ్యత నిర్వహణ, నీటి వనరుల స్థిరమైన వినియోగాన్ని కీలకమైన అంశాలుగా చెప్పవచ్చు. పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణలో పురోగతిని సాధించినప్పటికీ, సమర్థవంత నిర్వహణలో సవాళ్లు మిగిలే ఉన్నాయి. అనేక గ్రామీణ, పట్టణప్రాంతాలలో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి మురుగునీటి నిర్వహణ వ్యవస్థలు సమస్యగానే ఉన్నాయి. వేగవంతమైన జనాభా పెరుగుదల, అనధికారిక స్థావరాలు, పాతకాలపు మురుగునీటి మౌలిక సదుపాయాల కారణంగా పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ సవాలుగానే ఉంది. నీటి ఒత్తిడి, భూగర్భ జలాల అతి దోపిడీ మరొక ప్రధాన సవాళ్లు. కేంద్ర భూగర్భజలబోర్డు అంచనాల ప్రకారం, భారతదేశంలోని భూగర్భ జలాల అంచనా యూనిట్లలో దాదాపు 18శాతం అతిగా దోపిడీకి గురవుతున్నాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వాతావరణ వైవిధ్యం, మారుతున్న వర్షపాత నమూనాలు, కరువులతో నీటి కొరత తీవ్రంగా ఉంది. మంచినీటి పర్యావరణవ్యవస్థలు కూడా ముప్పులోఉన్నాయి. కాలుష్యం, ఆక్రమణ, ఇసుక తవ్వకం, క్రమబద్ధీకరించని నీటి వెలికితీతతో చిత్తడి నేలలు, నదులు, సరస్సులు క్షీణిస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటి నిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరించడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. •

# ఆహార వృథా అరికడితే పేదరిక విముక్తి

వి. వరదరాజు


ప్రపంచవ్యాప్తంగా 2022లో కోటి టన్నులకుపైగా ఆహారం వృథా జరుగుతోందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్స్ ఫుడ్ వేస్ట్ రిపోర్ట్ వెల్లడించింది. ఈవృథా 164 కోట్ల(ప్రపంచ జనాభాలో 20శాతం )మంది ఆకలి తీర్చగలదని ఆ నివేదిక లెక్కగట్టింది. అత్యధికంగా ఆహారాన్ని నేలపాలు చేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటి. ఇక్కడి సంవత్సర కుటుంబ సగటు వృథా 55కేజీలు. అమెరికాలో 73కిలోలు. ఇండియా అత్యధిక జనాభా గల దేశం, కనుక ఇక్కడ జరుగుతున్న ఆహార వృథా చాలాఎక్కువ. ఏముంది మనం పారేసేవి పిడికెడు మెతుకులే కదా అని అనుకుంటే పొరపాటు. తిలా పాపం తలా పిడికెడుగా పరిణమిస్తుంది. వాతావరణం మార్పుకు దారితీస్తుంది. ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. సామాజిక అన్యాయం కూడాను. ఒక సంవత్సరానికి లక్ష కోట్లవిలువైన ఆహారం ప్రపంచవ్యాప్తంగా నేలలో కలిసి పోతున్నది. దేశంలో 20 కోట్ల మంది పేదలు రాత్రి పూట తిండి లేకుండా కడుపులో కాళ్ళు పెట్టుకొని పడుకోవలసి వస్తుంది. ఇదొక అమిత విచారకర వాస్తవం. కానీ మనం ఏడాదికి 73మిలియన్ టన్నుల వండిన ఆహారంపెంటపాలు చేస్తున్నాం. ఎంత అమానుషమైన పనో మనందరం ఆలోచించాలి. వృథా అరికట్టాలి. పోనీ ఇక్కడ తగినన్ని పంటలు పండడం లేదా? పండుతున్నాయి. అత్యధికంగా పంటలు పండిస్తున్న దేశాలలో ఇండియా ఒకటి.ఆహార వృథా రెండు రకాలు. ఇంట్లో వండినది కుప్ప తొట్టెలో పారబోయడం. పొలం నుండి వినియోగదారునికి చేరే సరఫరా చేసే దారిలో జారవిడిచేది మరొకటి. వెరసి 73 మిలియన్ టన్నులు బుగ్గిపాలు అవుతున్నాయి. కొందరు ఇంటి అవసరాలకు మించి పప్పులు, బియ్యం, నూనె వగైరాలు కొని పాడు చేస్తున్నారు. అస్తవ్యస్త వంట ప్రణాళిక వలన, ఇంట్లో నిలువ చేసే వసతుల లేక వృథా అవుతుంది. కొన్ని ఆచార వ్యాహారాలతో విలువైన ఆహారం వృథా అవుతున్నది. ప్రపంచంలో అత్యధికంగా 61 శాతం గృహ స్థాయిలోనే ఆహార వృథా జరుగుతున్నదన్నది గమనార్హం. ఆహార వృథా వలన పర్యావరణానికి తీవ్రహాని కలుగుతున్నది. వ్యవసాయానికి నేల, నీరు,విద్యుత్ అధికంగా కావాలి. ఆహార వృథా అంటే వెలకట్టలేని సహజ వనరులను నాశనం కావించడం. ఒక ఎకరా వరి పండించడానికి 20 నుంచి 40వేల లీటర్ల నీరు అవసరం. ఇండియాలో నగరాలు, పట్టణాల్లోని చెత్తలో పన్నెండు శాతం ఆహార పదార్థాలే ఆక్రమిస్తాయి. నగర పాలక సిబ్బంది సేకరించిన చెత్తను నేల మాళిగల్లో పూడ్చుతారు. తడి ఆహారపు చెత్త నేలలో చివికేటప్పుడు మిథేన్ వాయువు ఉత్పత్తి జరుగుతుంది. మిథేన్ శక్తివంతమైన హరిత గృహ వాయువు. ఇది వాతావరణంలోని వేడిని పట్టి నిలుపుతుంది. తద్వారా భూమివేడెక్కడానికి దోహదకారి అవుతుంది. మిథేన్ బొగ్గుపులుసు వాయువు కంటే అధిక వేడి కలుగజేస్తుంది. ఆహార వృథా వలన జరిగే సామాజిక నష్టాన్ని త్రోసిపుచ్చలేం.భారీ స్థాయిలో ఆహారోత్పత్తి దేశంలో జరుగుతున్నది. ఇక్కడ ఇరవై శాతం మంది పేదలు తిండిగింజలు కొనలేక పస్తులు పడుకొంటున్న దుస్థితి ఉందనేది త్రోసిపుచ్చలేని వాస్తవం. భూతాపం పెరుగుదల, అస్థిర వర్షఋతువు, వరదలు, కరవులు, తదితర ప్రకృతి వైపరీత్యాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అన్నాన్ని బుగ్గిపాలు చేయడం వలన పరిమితమైన సహజ వనరులపై ఎనలేని ఒత్తిడి పడుతుంది. ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు ద్విముఖ వ్యూహం అవసరం. వ్యక్తిగత స్థాయి పరిష్కారాలు, విధాన సంస్కరణలు కావించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేసుకోవాలి. ఇంటి అవసరాలకు తగినన్ని వెచ్చాలే కొనాలి. కచ్చితమైన భోజన ప్రణాళిక వేసుకోవాలి. సరైన మూతలున్న డబ్బాలలో వెచ్చాలు భద్రపరుచుకోవాలి. సరైన ఉష్ణోగ్రతలో వాటిని దాచుకోవాలి. ఎక్కువగా కూరగాయలు దొరికే కాలంలో ఒరుగులు తయారు చేసుకోవాలి. వంట గదిలో వచ్చిన చెత్తను సద్వినియోగపరచుకోవాలి. అంటే కంపోస్ట్‌చేసి, పూల మొక్కలకు, కూరగాయల మొక్కలకు వేయాలి. ఊరు శుభ్రమోతుంది. పెరటి తోటలు, మిద్దె తోటలు వేయాలి. వీటి పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రభుత్వం శీతలు గిడ్డంగుల నిర్మాణం చేపట్టి, ఆహార పదార్థాల నిలువ సామర్థ్యం పెంచాలి. •

# విద్యా విప్లవంలో డిజిటల్ టీ-శాట్ పాత్ర



ఐ.వి.మురళీ కృష్ణ శర్మ

ఇంటింటికీ టెక్నాలజీ చేరువ కావాలనే లక్ష్యంతో ప్రారంభించిన టీ-శాట్ తెలంగాణ రాష్ట్రానికి వరంగా మారింది. అన్ని రంగాలు, వర్గాల వారికి ఆధునిక సాంకేతికత చేరువ కావాలని స్థాపించిన టీ-శాట్ విజయవంతంగా లక్ష్యాలకు చేరుకుంటోంది. ప్రతి ఇల్లు గ్రంథాలయం కావాలి. ప్రతి మెదడుకు జ్ఞానం చేరాలంటే పుస్తకాలతోనే సాధ్యమవుతుంది అని పెద్దలు అంటుంటారు. ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తకం కూడా రూపంమార్చుకుంది. డిజిటల్ రూపంలో పుస్తకాన్ని తెలంగాణలో ఇంటింటికి చేర్చేందుకు టీ-శాట్ కృషిచేస్తోంది.టీ-శాట్ తీసుకొచ్చిన ఈ డిజిటల్ విప్లవం తెలంగాణ యువత, విద్యార్థుల భవితకు బాటలు వేయడమే కాకుండా అన్ని వర్గాల వారికి చేరువవుతోంది. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఇనిషియేటివ్‌గా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో నడుస్తున్న ఈ నెట్‌వర్క్ సాఫ్ట్‌నెట్ (సొసైటీ ఫర్ తెలంగాణ స్టేట్ నెట్‌వర్క్) ఆధ్వర్యంలో టీ-శాట్ పేరుతో పనిచేస్తోంది. శాటిలైట్ ద్వారా ప్రసారాలు అందిస్తూ గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులకు, యువతకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తోంది. టీ-శాట్ నిపుణ (స్కిల్స్, పోటీ పరీక్షలు), టీ-శాట్ విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) అనే రెండు ప్రధాన చానెళ్లతో పనిచేస్తుంది. ఇవి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా సెల్ఫ్ ప్రిపరేషన్‌కి అండగా నిలుస్తున్నాయి. టీ-శాట్ యాప్, యూట్యూబ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా విలువైన కంటెంట్ అందుబాటులో ఉంది. తెలంగాణలోని ఉన్నత విద్యా మండలితో పలు ఎమ్ఓయూలు కుదుర్చుకుని,అన్నిరకాల ప్రసారాలు అందిస్తుండటం విద్యార్థులకు, నిరుద్యోగులకు టీ-శాట్ గొప్పవరంగా మారింది. టీ-శాట్ విజయాలు అసాధారణమైనవి. దేశంలోనే నెంబర్ వన్ ఎడ్యుకేషనల్ నెట్‌వర్క్‌గా నిలవడం తెలంగాణకు గర్వకారణం. విద్యా ప్రసార చానెళ్లలో 48 లక్షల యూజర్స్‌తో డిజిటల్ ప్రసారాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. యూట్యూబ్‌లో 8.4 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్స్, సుమారు 14 కోట్లకు పైగా వ్యూస్ టీ-శాట్‌కు ఉన్నాయి. డిజిటల్ శాటిలైట్ ద్వారా 48 లక్షల మందికి పైగా యూజర్స్‌తో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. టీ-శాట్16 శాటిలెట్ ద్వారా తెలంగాణలోని సుమారు 80 లక్షలకు పైగా కుటుంబాలకు వైవిధ్యమైన ప్రసారాలు అందిస్తూ అన్ని వర్గాలకు తోడ్పడుతోంది. రాష్ట్రంలోని ప్రధాన కేబుల్ నెట్‌వర్క్‌లో టీ-శాట్ సేవలుఅందుబాటులో ఉండడంతో వీరి ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలు ఇంటింటికీ చేరవవుతున్నాయి. తెలంగాణ విద్యా రంగంలో ఇప్పుడు టీ-శాట్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఐటీ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తూ టీ-శాట్ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేస్తున్నారు. డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీపడాలనే మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన పిలుపును సాకారం చేసేందుకు టీ-శాట్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టీ-శాట్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల వార్షిక పోటీలు 2025 కార్యక్రమం



ద్వారా క్విజ్, వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. నవంబర్‌లో నిర్వహించిన ఈపోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారంటేనే టీ-శాట్‌కు తెలంగాణ విద్యారంగంలో లభిస్తున్న ప్రాధాన్యత తెలుస్తోంది.మహాత్మా గాంధీ యూనివర్సిటీ ద్వారా ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రత్యేక పాఠ్యాంశాలను టీ-శాట్ బోధిస్తోంది. టీ-శాట్,ఫోటానిక్స్ వ్యాలీకార్పొరేషన్ సంయుక్తంగా వీఎల్ఎస్ఐపై వృత్తి నైపుణ్య శిక్షణ కూడా అందిస్తోంది. ప్రజలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, భాషా నైపుణ్యాలపై ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.ప్రత్యేకంగా ఐదు యూట్యూబ్ చానెళ్లతో, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీల్స్‌రూపంలోనూ కంటెంట్ అందిస్తోంది. పోటీపరీక్షలలో టీ-శాట్ యువతకు చేదోడుగా నిలిబడింది. టెట్, డీఎస్సీపోటీ పరీక్షల్లో అభ్యర్థుల విజయానికి టీ-శాట్ కంటెంట్ కీలకంగా మారుతోంది. టీ-శాట్ సేవలతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్రఅభివృద్ధిలో భాగస్వాములుగా మారడం టీ-శాట్‌కు గర్వకారణం. పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారి కోసం ప్రధాన సబ్జెక్ట్ జనరల్ స్టడీస్ పై జీఎస్ ఫర్ ఆల్ పేరిట ప్రత్యేక పాఠాలు ప్రసారం చేస్తోంది. టీజీపీఎస్సీగ్రూప్ 1, 2, 3 ఉద్యోగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పరీక్షలకు నాణ్యమైన కంటెంట్ అందిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉద్యోగాల సాధనలో తోడ్పాటు అందించడానికి టీ-శాట్ నెట్‌వర్క్ డొమైన్‌లో 40 వేలకు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవడానికి, ఉద్యోగాలు సాధించడానికి టీ-శాట్ సేవలను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. అంతేకాక తెలంగాణ స్కిల్ హబ్, టాస్క్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌లతో కూడా టీ-శాట్‌సమన్వయం చేసుకుంటూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులకు, యువతకు మార్గదర్శకంగా స్వాతంత్ర్య సమర యోధులు,వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారి గొప్ప వ్యక్తుల అనుభవాలను, స్ఫూర్తిఅనే కార్యక్రమం పేరుతో ప్రసారం చేస్తూ మానవ విలువల పెంపుకు టీ-శాట్ కృషి చేస్తుంది. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, తెలంగాణ పశుసంవర్ధక శాఖల సమన్వయంతో నిపుణ పేరిట రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోంది. వైద్య నిపుణులతో వైద్య సలహాలు కూడా అందిస్తున్న టీ-శాట్ మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ప్రతి రోజు కార్యక్రమం ప్రసారం చేస్తుండడంతో అంగన్ వాడీ టీచర్లకు, కార్యకర్తలకు ఉపయోగకరంగా ఉంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేలా బోనాలు,బతుకమ్మ పండుగలపై ప్రత్యేక వీడియోలు రూపొందించి మన సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తోంది. టీ-శాట్ ప్రభావం ఇప్పటికే అనేక కోణాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడేలాసంస్థ ప్రోత్సాహిస్తోంది. ఆరోగ్యం, వ్యవసాయం, మహిళలు పిల్లల సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తోంది.తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీలో టీ-శాట్‌ను చేర్చాలని ఇటీవలే అధికారులు సూచించడం ఈ సంస్థ విద్యారంగానికి చేస్తున్న సేవలకు నిదర్శనంగా నిలవడమే కాకుండా రాష్ట్రవిద్యార్థులు, నిరుద్యోగుల జీవితాల్లో పోషిస్తున్నప్రధాన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో టీ-శాట్ తెలంగాణ ప్రజలను జ్ఞానవంతులను చేసే మిషన్‌లో విజయవంతంగా దూసుకుపోతోంది. టీ-శాట్ కేవలం ఒక డిజిటల్ విద్యా సాధనం మాత్రమే కాదు, తెలంగాణ విద్యా విభాగంతో పాటు అన్నిరంగాల్లో మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తూ అందరి మన్ననలు పొందుతోంది. •

# రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలను తగ్గించిన ఘనత సిఎం చంద్రబాబుదే : ఎస్ఎం ఫైజాన్

ఎ కొండూరు, జనవరి 4, ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ రంగ సంస్థల విధ్వంసాన్ని చక్కదిద్ది సామాన్య పేద మధ్యతరగతి



ప్రజలపై భారం పడకుండా విజనరీ సిఎం చంద్రబాబు తీసుకున్న సాహసోపేత నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తిరువూరు పట్టణ పార్టీ పరిశీలకుడు ఎస్ఎం ఫైజాన్ ఎ కొండూరులో ఆదివారం మీడియాకు తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత భారం ప్రజలపై పడకుండా విద్యుత్ చార్జీలను తగ్గించి భారతదేశంలోనే మొదటిసారిగా విద్యుత్ చార్జీలను తగ్గించిన ఘనత నవ్యాంధ్రప్రదేశ్ రూపకర్త సిఎం చంద్రబాబుకే దక్కిందని ఫైజాన్ అన్నారు. జగన్ పాలనలో 9సార్లు చార్జీలు పెంచి రూ.32వేలకోట్ల భారాన్ని మోపడమే కాకుండా విద్యుత్ రంగ సంస్థలను రూ.1.29లోల కోట్ల అప్పుల్లో ముంచి దీవాళా తీయించారని ఫైజాన్ జగన్ అసమర్ధ విధ్వంస పాలనపై తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా తెలుగుదేశం ఎన్‌డిఎ కూటమి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలోపెట్టి గత జగన్ పాలనలో విధ్వంసం నుండి వికాసం వైపు పరుగులు పెట్టిస్తున్న సిఎం చంద్రబాబు పరిపాలన అనుభవాన్ని గొప్ప పరిపాలన దీక్షతకు నిదర్శనమని ఫైజాన్ పేర్కొన్నారు.

# రామడుగు శ్రీనివాసరావుకు ఘన సత్కారం



తిరువూరు, జనవరి 4, ప్రభాతవార్త : లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆదివారం గ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో 17వ వార్డు టిడిపి కౌన్సిలర్ షేక్ హుస్సేన్ దివ్యాంగులకు సేవలందించిన రామడుగు శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రాం ప్రదీప్ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు తీగల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



విజయవాడ కార్పొరేషన్,జనవరి 4,ప్రభాతవార్త: ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించవచ్చని,ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంటారని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# హెల్మెట్ ధరించడం భారం కాదు...అది భాధ్యత

## -హెల్మెట్ ధరించని వాహనదారులపై అవగాహన కార్యక్రమం -సంయుక్త రవాణా కమీషనర్ ఎ.మోహన్

విజయవాడ కార్పొరేషన్,జనవరి 4,ప్రభాతవార్త: హెల్మెట్ ధరించడం భారం కాదు..అది భాధ్యతగా గుర్తెరగాలని,ప్రమాదాల తీవ్రతను తగ్గించి ప్రాణాలు కాపాడే ఒక ఆయుధంలా పనిచేస్తారని సంయుక్త రవాణా కమీషనర్ ఎ.మోహన్ పేర్కొన్నారు. స్థానిక బందరు రోడ్డు లోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం సమీపం లోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం హెల్మెట్ ధరించని వాహనదారులపై ప్రత్యేక తనిఖీలు చేప్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు రోడ్డు భద్రతా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వాహనదారులకు,డ్రైవర్లకు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం జరుగుందన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా వాహనదారుల భద్రత కోసం రవాణా శాఖ అధికారులు హెల్మెట్ ధారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించామని,హెల్మెట్ ధరించని వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చెప్పడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులందరూ



తప్పనిసరిగా హెల్మెట్ ధరించి,తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించక పోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో సంవత్సరానికి వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని ఆయన అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం,తద్వారా ప్రమాదాలు కొని తెచ్చుకుని వ్యక్తిగతంగా కుటుంబపరంగా ఇబ్బందులు పడటం చేయొద్దన్నారు. ఇక చిన్న నిర్లక్ష్యం వాహనదారులతో పాటు కుటుంబ సభ్యుల జీవితాలను సైతం అస్తవ్యస్తంగా మారుస్తుందన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలకు ఒక రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ప్రమాద సమయంలో మన ప్రాణాలకు అస్త్రంలా ఉపయోగపడుతుందన్నారు.నిర్లక్ష్యంగా ఎవరు వాహనాలు నడిపిన కూడా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాద తీవ్రతను తగ్గించి ప్రాణాలను నిలబెట్టుకోవచ్చన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తనను నమ్ముకున్న వారికి జీవితాంతం తోడుగా ఉండే వారి భవిష్యత్తు జీవితం ఉన్నత స్థాయిలో చూడాలనుకుంటే హెల్మెట్‌ధారణ తప్పనిసరిగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు రోడ్ల పైకి ప్రవేశం లేదని చెప్పారు. హెల్మెట్ ధరించిన వాహన చోదకులపై కేసులు నమోదు చెయ్యడం,లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందన్నారు.






# అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

గుంటూరు విద్య జనవరి 4 ప్రభాతవార్త: గుంటూరులో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. ఈ మహాసభలు ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు.గుంటూరు శివారులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ (అమరావతి ప్రాంగణం, హైవే సమీపం) ప్రధాన వేదిక నందమూరి తారక రామారావు వేదికగా పేరు పెట్టారు. ఈ వేదికపైనే ప్రధానమైన కార్యక్రమాలు వేదికగా జరుగుతున్నాయి.జనవరి 3న అన్నమయ్య సహస్ర కీర్తనలతో ఘనంగా ప్రారంభమైంది. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పామిడిఘంటం శ్రీనరసింహ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విశ్వయోగి విశ్వంజీ, ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు మేయర్ తదితరులు తొలి రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు.శ్రీ జాషువా కరుణ శ్రీ కవి సమ్మేళన వేదిక, శ్రీనాథ మహాకవి సదస్సుల వేదిక, పాడనా తెలుగు పాట వేదికల పేరులతో వేదికసాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, చిత్రకళా హస్తకళా ప్రదర్శనలు.ఆధ్యాత్మిక వేదికపై ప్రవచనాలు, హోమాలు, కల్యాణాలు.తెలుగు సినిమా గీతాలాపన, యువత సాంస్కృతిక కార్యక్రమాలు ఆశాంతం ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.మొత్తం 5 వేదికలపై ఏకకాలంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ నిర్వాహకులు చూపరులను వీక్షకులను అబ్బుర పరుస్తున్నారు. ప్రధాన వేదికపై వివిధ పాఠశాలల చిన్నారులు ప్రదర్శించిన తెలుగు వైభవ ప్రదర్శనలో భాగంగా వివిధ కవుల సాహిత్య వైభవాన్ని ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్ర సమరయోధుల పోరాట పటిమలను ప్రదర్శన రూపంలో ప్రదర్శించి చారిత్రాత్మక అంశాలను గుర్తుకు తెచ్చారు.మహాసభలు రెండో రోజు ఆదివారం కార్యక్రమంలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు, త్రిపుర గవర్నర్ పాల్గొన్నారు. తొలి రోజు కార్యక్రమంలో ఒడిషా గవర్నర్, ఇతర రాష్ట్రాల గవర్నర్లు, సుప్రీంకోర్టు/హైకోర్టు జడ్జిలు పాల్గొనగా, మూడవరోజు










సోమవారం ముగింపు ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొననున్నారు.50 కు పైగా దేశాల నుండి తెలుగు సంఘాల ప్రతినిధులు, వేలాది మంది యువత ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడం విశేషం.గతంలో 2017లో హైదరాబాద్‌లో, 2024లో రాజమహేంద్రవరంలో జరిగిన మహాసభల తర్వాత ఇది మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో నిర్వహించడం గుంటూరుకు ప్రతిష్టాత్మక అంశం. (ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం). ఇది తెలుగువారి "అనురాగ సంగమం"గా నామకరణం చేశారు.ఈ మహాసభలు తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటే గొప్ప వేడుక.

# బిసి ఓబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ

విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త : ఆల్ బి సి. ఓ బి సి .ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ ఆదివారం ఉదయం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గుత్తుల వీర బ్రహ్మంగారు రాష్ట్ర అధ్యక్షులు వారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి సంజీవరెడ్డి సవితి, వెనుకబడిన వర్గాల శాఖ, కొల్లు రవీంద్ర కేదారేశ్వరరావు అసోసియేట్ ప్రెసిడెంట్ , పి .భూషన్ రావు, పి శ్రీధర్ ప్రధాన కార్యదర్శిలు, వై.శంకర్రావు రాష్ట్ర కోశాధికారి, ఇతర ప్రధాన నాయకులు రాజేంద్ర ప్రసాద్, గుబ్బల ప్రసాద్, పలగాని సీతారామయ్య, గోలి శ్రీకృష్ణదేవరాయలు, రాజా, పి.రామచంద్ర రావు. 26 జిల్లాల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు 3,500 మంది పైగా సంఘ




గారు మైన్స్ అండ్ జియాలజీ శాఖ, విశిష్ట అతిథులుగా బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ భీమా శంకరరావు హాజరై ప్రసంగించారు. బత్తుల అప్పారావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేశారు. బీసీ .ఓబీసీ .సంఘ ఉద్యోగ ప్రతినిధులు ఇచ్చిన వినత పత్రాన్ని స్వీకరించి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# అలరించిన కూచిపూడి బృంద నృత్యాలు



గుంటూరు కల్చరల్,జనవరి 4,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కల్యాణ వేదికగా సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు బృందం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న భరతమాత పూజా దినోత్సవ వేడుకల్లో భాగంగా 1నుంచి 10వ తరగతి వరకు సీనియర్స్,జూనియర్స్ విభాగాలకు, ఉపాధ్యాయులకు నిర్వహించిన సాంప్రదాయ కళలైన కూచిపూడి బృంద నృత్యాల పోటీలు ఆకర్షణీయంగా సాగాయి. చిన్నారులకు కళాకృతి తయారీ పోటీలు,రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులతో నిర్వహించారు. అనేక ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల నుండి పాల్గొన్న విద్యార్థులకు సంస్థ వారు ప్రశంసా పత్రాలు,బిస్కెట్లు అందించారు.



# పిల్లల్లో సీవీఐ నేత్ర సమస్యలపై ఎల్వీపీఈఐ అవగాహన

విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త : ప్రపంచ వ్యాప్తంగా పిల్లలలో దృష్టి సమస్యలకు ప్రధాన కారణమైన వాటిలో ఒకటైన కార్టికల్/సెరిబ్రల్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (సీవీఐ) గురించి తల్లితండ్రులకు అవగాహన కలిగించు కార్యక్రమం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్వీపీఈఐ విజయవాడ కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లో రిహాబిలిటేషన్ థెరపిస్ట్ సైనీజాన్ మాట్లాడుతూ ఈ కంటి వ్యాధి సాధారణ నేత్ర వ్యాధుల మాదిరి కాకుండా మెదడులోని దృశ్య స్థానాలను దెబ్బతీస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే పిల్లలు కళ్ళు ఆరోగ్యంగా సాధారణంగానే ఉన్నట్లు కనిపించినప్పటికీ వారి దైనందిక జీవితంలో దృష్టిని సరిగా చూడలేక పోవటం, అర్థం చేసుకోవటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు పుట్టుకకు ముందు, జనన సమయంలో లేదా అటుతర్వాత మెదడు గాయం కార్టికల్/సెరిబ్రల్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (సీవీఐ) సమస్యకు కారణం కావచ్చునన్నారు. పిల్లలలోని దృశ్య లోపాలను ముందుగా గుర్తించినట్లయితే వారు చదవటం, అభ్యసించటం, సంభాషించటంలో తగిన సామర్థ్యత పెంపొందించు అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0866-6712024 నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.



ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య శాల (ఎల్వీపీఈఐ) సీవీఐ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆసుపత్రి

# ఫిర్యాదుల పరిష్కారంలో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4,ప్రభాతవార్త : గుంటూరు నగరంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కార్పొరేషన్ లోనే అన్ని విభాగాల అధిపతులు తప్పనిసరిగా పాల్గొనాల్సిం దేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగర కార్పొరేషన్ లో సోమవారం డయల్ యువరు కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డయల్ యువరు కమిషనర్ కార్యక్రమంలో ఉదయం 9 నుంచి గంటపాటు కార్పొరేషన్ ల్యాండ్ లైన్ 0863 2224202 ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను సేకరించటం జరుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన ఫిర్యాదులపై నిరక్ష ్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది హెచ్చరించారు. ప్రజలు ఇప్పటివరకు చేసిన ఫిర్యాదులు



పరిష్కారం పై ప్రతి ఒక్క అధికారి తమ తమ ఫిర్యాదులకు సంబంధించి పరిష్కరించిన వివరాలు, పెండింగ్ ఉన్న వివరాలతో పాటు నివేదికతో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని గతంలో సూచించడం జరిగింది అన్నారు. నిర్దేశిత గడువులోగా ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని నిరక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

# నవజాత శిశువులు చిన్నపిల్లల వైద్యంలో ఆధునిక చికిత్సా విధానాలు

విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త : ఎనికేపాడులోని అను మైబేబీలో జరిగిన పిడియాట్రిక్ వైద్య సదస్సుకు అను మైబేబీ మరియు ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ సౌజన్యంతో ఆదివారం జరిగిన



వైద్య సదస్సులో రాష్ట్రం నలుమూలలు నుండి 400కిపైగా వైద్యులు పాల్గొనగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గాజుల రమేష్ మాట్లాడుతూ, నవజాత శిశువుల వైద్యంలో ఎన్నో ఆధునిక మార్పులు సంభవించాయని, సకాలంలో నిపుణులైన వైద్యులను సంప్రదించడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులచే నిర్వహించిన వర్క్‌షాప్ నిర్వహణ, ప్యానెల్ వైద్యులచే గ్రూపు డిస్కర్షన్స్ సదస్సులో పెద్దఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అను మైబేబీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీదేవి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డైరెక్టర్ కె.రవికుమార్, పిడియాట్రిక్ వైద్య బృందం డాక్టర్ బి.రేవంత్, డాక్టర్ ఎం.ఎన్.శ్వేత, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ జోత్స్న ముత్యాల, డాక్టర్ పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగం కేసులో 3గ్గురు నిందితుల అరెస్టు

మంగళగిరి, జనవరి 4, ప్రభాతవార్త: మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నిధుల దుర్విని యోగం కేసులో ముగ్గురు నిందితులను గుంటూరు జిల్లా సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిధులు దుర్వినియోగం చేశారని చైర్మన్ గాదే పిచ్చిరెడ్డి మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్ లో గత ఏడాది నవంబరు 28వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసును గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బీవీ మధుసూదన రావు దర్యాప్తు చేపట్టారు. నిధుల దుర్వినియోగం వ్యవహారంలో చిర్రావూరి శ్రీనివాస్, తమ్మ ఉమా శంకర్ రెడ్డి, మొగళ్ళ నాగ వెంకట సాయి దుర్గాప్రసాద్ లను అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరచగా న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించారు. ఈ మొత్తం వ్యవహారంలో నిందితులుగా ఉన్న ఈ ఉద్యోగులు ఒక పథకం ప్రకారం కుమ్మక్కై.. మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిధులు రూ.1,16,65,283 దుర్వినియోగం చేశారని చైర్మన్ గాదే పిచ్చిరెడ్డి పోలీసులకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు ఇప్పటికే కురగల్లు, మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిధులు దుర్వినియోగం కేసులో ప్రధాన నిందితుడు రాయల రమేష్ ఇప్పటికే అరెస్టై బెయిల్ పై బయటకు వచ్చారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతుంది.

# మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

## పోక్సో చట్టం కింద కేసు నమోదు..



మంగళగిరి, జనవరి 4, ప్రభాతవార్త: మంగళగిరి పట్టణంలో ఓ మైనర్ బాలిక ను నలుగురు యువకులు శనివారం రాత్రి బాలిక తల్లిదండ్రులపై దౌర్జన్యం చేసి కిడ్నాప్ చేసిన ఘటన చోటు చేసుకున్న విషయం విధితమే. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై మంగళగిరి పట్టణ సిఐ వీరాస్వామి ఆదివారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. గండాలయ పేటకు చెందిన యర్రంశెట్టి సౌజన్య అనే మహిళ తమ కుమార్తెను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారంటూ శనివారం రాత్రి పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఈ మేరకు తాము దర్యాప్తు చేశామని పేర్కొన్నారు. రవితేజ అనే యువకుడితో పాటు మరో ఎనిమిది మంది మైనర్ బాలికను ఆమె తల్లిదండ్రులపై దౌర్జన్యానికి దిగి కిడ్నాప్ చేసి తీసుకు వెళ్లినట్లు తేలిందని చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా తుళ్లూరు సచివాలయం సమీపంలో బాలికను ఆదివారం ఉదయం గుర్తించామని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మైనర్ బాలికకు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రవితేజకు ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్లు విచారణలో వెలుడైనట్లు చెప్పారు. రవితేజ తో పాటు సురేంద్ర దినకర్ మిగిలిన ఆరుగురు నిందితులు తమ ఆధీనంలో ఉన్నారని చెప్పారు. నిందితులపై ఫోక్సో చట్టంతో పాటు కిడ్నాప్, అసభ్యంగా ప్రవర్తించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మైనర్ బాలికలను ఇబ్బందులకు గురి చేస్తే చట్టాలు బలంగా ఉన్నాయని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.



పెదకాకాని వెనిగండ్ల గ్రామంలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 20వ ఉపకార వేతన ప్రధానోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు (సత్తెనపల్లి-ప్రభాతవార్త)

## నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైకాపానేత డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం కట్టమూరులో బూరుగా కోటేశ్వరరావు రత్నకుమారి కుమార్తెలు షర్మిళ, షారోన్ లిల్లీ నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో



పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి..మండల పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు గారు, కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి , కొర్లకుంట వెంకటేశ్వర్లు, అబ్బూరి వీరాంజనేయులు, దార్ల ఏడుకొండలు , మందడపు పృధ్వి రాజు , మాగంటి అంజిబాబు , కొమేర శివశంకర్ , కొమేర వీరాంజనేయులు , మాగంటి పెద్ద దేవుడు, ఎకుల మత్తయ్య , దావీద్ , మాగంటి నరసింహారావు,పల్లె గాబ్రిల్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంధం అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలోని భాగంగా శ్రీవారిని గంధంతో అలంకరించారు. ప్రత్యేకంగా శ్రీవారిని ఊరేగింపు చేశారు. అనంతరం స్వామివారం ఊరేగింపు జరిపారు. సత్తెనపల్లి పట్టణ ప్రజలు చుట్టుపక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు . పట్టణ పోలీసు శాఖ ఊరేగింపులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహాయ సహకారాలు అందించారు.

## వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల పర్యటన

సత్తెనపల్లి రూరల్ జనవరి 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం గోగులపాడు గ్రామంలో గ్రామ ఉప సర్పంచ్ నెల్లూరి వెంకట్ మేనకోడలు నవులూరి సురేష్ జయలక్ష్మి కుమార్తె శ్రీ



లక్ష్మీశర్మిల పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, కొర్లకుంట వెంకటేశ్వర్లు, అబ్బూరు వీరాంజనేయులు, కొమేర శివశంకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కల్యాణ వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం లో కూరగాయల మార్కెట్ వద్ద వున్న శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి 20వ రోజు ధనుర్మాసంలో భాగంగా పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. కోదండరామ స్వామివారికి విశేష అభిషేకం అనంతరం విశేష అలంకరణ చేశారు. స్వామివారి అలంకరణ తిలకించేందుకు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పుస్తకాలు ప్రాణం పోసిన జీవాలు :యర్రం వెంకటేశ్వర రెడ్డి

సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: అమరావతి సేవ సమితి ఆధ్వర్యంలో 'ఫోన్లు వదలండి పుస్తకాలు పట్టండి' కార్యక్రమంలో భాగంగా ఐదవ ఓపెన్ బుక్ రీడింగ్ సెక్షన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటిలోనూ వంటగది ఉన్నట్టే పుస్తకాలు గది ఉండాలని పుస్తకం



అంటే వీసా లేకుండా విశ్వదర్శనం చేయించే అద్భుతమైన పుస్తక విమానం అని పేర్కొన్నారు. సత్తెనపల్లి పెన్షన్ అసోసియేషన్ కార్యదర్శి కే బి ఆర్ జె ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకాలు మానసిక ఉల్లాసానికి, ఉన్నత విలువలకు దోహదం చేస్తాయని అన్నారు. అమరావతి సేవ సమితి అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజనేయులు, కార్యదర్శి పాడిబండ్ల రవి రాజా, సాతులూరి నాగమల్లేశ్వరరావు, జంగాల బాబు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వేల్పూరి, గోపి,సుదర్శన్, ఉత్తేజ్, అంకమ్మరావు, మహేంద్ర కుమార్ , బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## 'దివ్వెల శ్రీనివాసరావు సేవా కార్యక్రమాలు ఎనలేనివి'

సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: విజయవాడ లో ఆదివారం సాయంత్రం విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణ నంది అవార్డు ను సినీనటులు పూర్ణిమ, బాలాజీ, అంతర్జాతీయ సినిమా



హీరోయిన్ సృజన మరియు తదితర ప్రముఖుల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దివ్వెల శ్రీనివాసరావు చేస్తున్న సేవా కార్యక్రమాలు వెల కట్టలేనివి అని అన్నారు.

## టిడిపి 'ప్రతి ఆదివారం ఇంటింటికీ కార్యక్రమం'

సత్తెనపల్లి, జనవరి 4, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు 'ప్రతి ఆదివారం ఇంటి ఇంటికి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 4 వార్డు టీడీపీ అధ్యక్షుడుజానీరామయ్య, ప్రధాన కార్యదర్శి వనమా రామారావు సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ పొట్టి సుబ్రహ్మణ్యం కోలార్ మహేశ్ ప్రెసిడెంట్ ముంతాజ్ ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రజా సమస్యలు తెలుసు కొని కమిటీ తీర్మానం చేసినారు.



# పల్నాడు జిల్లా వార్త



## వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు జాతీయస్థాయి గుర్తింపు అభినందనీయం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి4,ప్రభాతవార్త: వినుకొండ పట్టణ ప్రభుత్వ వైద్యశాలకు జాతీయస్థాయి అవార్డు లభించడం గర్వకారణంగా ఉందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. 2024,25 ఏడాదికిగాను ఎన్‌క్యూఏఎస్ నాణ్యత ప్రమాణాల పాటించి రాష్ట్రస్థాయి కాయకల్ప,శుభ్రత అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో అభినందన సభ ఆదివారం



జరిగింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యులను,సిబ్బందిని పూలమాలలు,శాలువాతో ఘనంగా సత్కరించి,సన్మానించారు. జీ.వీ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో వైద్యశాలలో మందులుకొరత,మౌళిక సదుపాయాల కొరత,నిధుల దుర్వినియోగం పెద్ద ఎత్తున జరిగి పేదలకు మెరుగైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జాతీయస్థాయి గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,నాగశ్రీనురాయల్,నిశంకర్ శ్రీనివాసరావు,వైద్యులు,ఆరోగ్య శాఖ సిబ్బంది కూటమి నాయకులు,పురప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా గోసేవా ఉత్సవం

సత్తెనపల్లి టౌన్, జనవరి 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ వాసవి యువ శక్తి ఆధ్వర్యంలో ఐదవ ఖిగోసేవా ఉత్స వంఖి అత్యంత వైభవంగా జరిగింది. సమాజ హితం కోరి, గోమాతను పూజించే సంప్రదాయాన్ని యువశక్తి సభ్యులు ఘనంగా



నిర్వహించారు.భక్తిశ్రద్ధలతో గోపూజ కార్యక్రమ ప్రారంభంలో భాగంగా నిర్వాహకులు స్థానిక గోశాలలోని శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా గోపూజ చేసి, గోవులకు గ్రాసాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గోసేవ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి నెల తొలి ఆదివారం క్రమం తప్పకుండా ఈ గోసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దాతల సహకారం ఈ నెల గోసేవా కార్యక్రమానికి చేబ్రోలు వెంకటరత్నం, వారి ధర్మపత్ని వెంకటదేదీప్య మరియు కుమార్తె నేహా గుప్తా ఆర్థిక సహకారం అందించారు. గోశాల అధ్యక్షులు పెండ్యాల మల్లేశ్వరరావు పర్యవేక్షణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.పాల్గొన్న ప్రముఖులుగోసేవలో శ్రీ వాసవి యువ శక్తి సభ్యులు ఈ కార్యక్రమంలో కొల్లిపర నరసింహారావు, జవ్వాజీ సుబ్బారావు, కుకుట్ల రాదాకృష్ణ, కొత్త రామకృష్ణ,లఘుమవరపు రమేష్, బి. శివ రంజిత్ కుమార్,కాకరపర్తి సుబ్రహ్మణ్యం,గ్రంధిమోహన్, రాఘవ, పుల్లారావు, సీహెచ్. అనిల్,భక్తులకు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన రాంబాబు

అచ్చంపేట, జనవరి 4 ప్రభాత వార్త: పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావును నేషనల్ ఫండమెంటల్ లీగల్ రైట్స్ టు సిటిజన్స్ కన్జ్యూమర్స్ ఇంప్లిమెంట్ సొసైటీ వైస్ చైర్మన్ రాంబాబు



మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎస్పీకి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సమాజ సేవకులుగా రాంబాబు సేవలను ఎస్పీ బి. కృష్ణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పుట్టిన రోజు వేడుక

పెదకూరపాడు.జనవరి 4, ప్రభాతవార్త: మండలంలోని 75 తాళ్లూరులో ఘనంగా పెదకూర పాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వేడుకలో పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు. పరస నుండి 75 తాళ్లూరు వరకు భారీ ర్యాలీతో ఎమ్మెల్యేక కూటమి శ్రేణులు స్వాగతం పలికారు.మార్గం పొడవు నా ఎమ్మెల్యేని గజమాలలతో నాయకులు.కూటమి శ్రేణులు సత్కరించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## బడుగు , బలహీన వర్గాల పార్టీ సిపిఐ : మునగోటి శ్రీనివాసరావు

క్రోసూరు, జనవరి 4 ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. క్రోసూరు మండల పరిధిలోని పీసపాడు బీసీ కాలనీలో సిపిఐ శాఖ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిపిఐ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ1925 డిసెంబర్ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందని వంద సంవత్స రాల శతాబ్ద వారోత్స వాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పండగ వాతావరణం లో వేడుకలు నిర్వహించుకోవడం శుభ పరిణిమన్నారు. తెలంగాణ సాయుధ భూమికోసం భుక్తి కోసం కార్మికుల హక్కుల కోసం పోరాడిన పార్టీ సిపిఐ అని శ్రీనివాసరావు అన్నారు. అలాగే పోతుగంటి నాగేశ్వరరావు, నియోజవర్గ రైతు సంఘం అధ్యక్షులు కంచేటి పెద్దబ్బాయి మాట్లాడుతూ ఆనాటి నుండి ఈనాటి వరకు అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన సిపిఐ జెండా పోరాటం నిర్వహిస్తుందని వారు గుర్తు చేశారు. జనవరి 18వ తారీఖున ఖమ్మంలో సిపిఐ 100 సంవత్స రాల శతాబ్ది వేడుకలకు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆకుల శ్రీనివాసరావు , పీర్లపాటి శివుడు, చామంతి పూడి పాండు,మహిళా కార్యదర్శి యాదగిరి శకుంతల, ఆనందు లక్ష్మి, పిచ్చమ్మ, పోపిరి సత్యనారాయణ, క్రోసూరు పట్టణ సిపిఐ కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నూజెండ్ల శ్రీరామయోగి స్వామి తిరుణాళ్ల

నూజెండ్ల,జనవరి4,ప్రభాతవార్త: మండలకేంద్రం నూజెండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరామయోగి స్వామి తిరుణాళ్ళ సోమవారం జరగనుంది. ఏటా తిరునాళ్ల సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకునేందుకు గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాలు,జిల్లాల నుంచి భక్తులు,ప్రజలు



అధిక సంఖ్యలో పాల్గొంటారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి పాదులకు నీరుపోసి పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమవుతారు. తిరునాళ్ళ సందర్భంగా భక్తులకు,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన మూడు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ బ్రహ్మయ్య,ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తిరునాళ్లలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## సీఎం సహాయ నిధి పేద కుటుంబాలకు సంజీవిని వంటిది: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి4,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు సంజీవిని వంటిదని చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని చీఫ్‌విప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన 71 మందికి రూ.67.28 లక్షలు విలువ చేసే చెక్కులను చీఫ్‌విప్ జీ.వీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు.



పేదలకు అండగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న తమ కుటుంబాలకు సీఎం చంద్రబాబు,చీఫ్‌విప్ జీ.వీ అండగా ఉండి ఆదుకోవడం ఆనందంగా ఉందని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న చీఫ్ విప్ జీ.వీ దంపతులు

వినుకొండ,జనవరి4,ప్రభాతవార్త: పట్టణంలోని పాత శివాలయం పక్కన వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్స వం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ,వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కళ్యాణ వేడుకకు ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ





ఆంజనేయులు ఆయన సతీమణి లీలావతి దంపతులు హాజరయ్యారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు,ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా అనుమానిత గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

ఈపూరు,జనవరి4,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సై జ్ స్టేషన్ పరిధిలోని నాటుసారా అనుమానిత గ్రామాల్లో



ఎక్సై జ్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈపూరు మండలం, బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాలు,లాలీపురం కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఎక్సై జ్ ఇన్స్ పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సై జ్ సర్కిల్ పరిధిలో నాటుసారా,కల్తీ మద్యం,నకిలీ మద్యం,కల్తీ కల్లు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని చెప్పారు.

## ప్రభుత్వ భవనమేనా? పేరు కూడా కనబడని పరిస్థితి!

పెదకూరపాడు, జనవరి 4, ప్రభాతవార్త: పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు నియోజకవర్గం అచ్చంపేట మండల కేంద్రంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయ వినియోగంపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఊరి నడిబొడ్డున, ప్రధాన కూడలిలో ఉన్న అచ్చంపేట గ్రామ పంచాయతీ భవనం ప్రజా సేవల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ కార్యాలయంగా ఉండాల్సినప్పటికీ, ప్రస్తుతం ఆ భవనం పైభాగంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు కావడం గమనార్హంగా మారింది.ఈ ఫ్లెక్సీల కారణంగా ప్రజలకు ఆ భవనం గ్రామ పంచాయతీ కార్యాలయమనే పేరు కూడా స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనానికి ఉండాల్సిన గుర్తింపు, గౌరవం తగ్గిపోతున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం ఫ్లెక్సీలు లేదా



అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేయడం నిషేధం కాదని, అయితే అందుకోసం ముందస్తుగా పంచాయతీ అనుమతి తీసుకొని, ప్రభుత్వానికి తగిన పన్నులు చెల్లించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ప్రభుత్వ భవనాలపై కాకుండా పక్కనున్న అనుకూల ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అయితే అచ్చంపేటలో కొన్ని చోట్ల ప్రభుత్వ భవనాలపై, అలాగే ఆర్ బీ రోడ్ల మార్జిన్లలో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు కావడం వల్ల నిబంధనల అమలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా అభిమానం పేరుతో వ్యక్తిగత ప్లకార్డులు ఏర్పాటు చేయడం వల్ల దృశ్య కాలుష్యం కూడా పెరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని ఇతర గ్రామ పంచాయతీ కార్యాలయాలు అన్నీ సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలుగా కొనసాగుతుంటే, అచ్చంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం మాత్రమే ఈ విధంగా ఎందుకు ఉందన్న అంశంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. నిబంధనలు అన్ని చోట్ల సమానంగా అమలవ్వాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆస్తులు పూర్తిగా ప్రజా ప్రయోజనాలకే వినియోగంలో ఉండాలని, వాటి వినియోగంలో స్పష్టత, క్రమశిక్షణ ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పంచాయతీ రాజ్ యాక్ట్‌లోని నిబంధనలను సమగ్రంగా అమలు చేస్తూ, అచ్చంపేటలోని ప్రభుత్వ భవనాలు పూర్తిగా ప్రజా సేవల కేంద్రాలుగా కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, జనవరి 4, ప్రభాతవార్త: అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం మురికిపూడి లోని శ్రీ కందిమళ్ళ శారదాంబ జిల్లా పరిషత్ హైస్కూల్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ప్రారంభించారు. అమెరికాలో స్థిరపడిన పెంట్యాల శ్రీధర్ ,దొండపాటి దినేష్,జాష్టి వెంకట్ సహకారంతో ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు




చేశారు.ఈ మెడికల్ వైద్య శిబిరం నందు నందు ప్రముఖ వైద్యులు డాక్టర్ కందిమళ్ళ అంకమ్మ చౌదరి, డాక్టర్ కందిమళ్ళ తేజస్వి, డాక్టర్ యన్.వీరభద్రయ్యా, డాక్టర్ చిగురుపాటి రామారావు, డాక్టర్ బొల్లినేని శిరీష, డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ మాదాల కృష్ణ చైతన్య, డాక్టర్ బి సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 800 మంది వరకూ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని వైద్య సలహాలతో పాటు ఉచిత మందులు కూడా అందుకున్నారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య సభాధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సోమేపల్లి వాసు , నిర్వాహకులు పెంటేల వెంకటసుబ్బయ్య , పెంటేల రఘునాథ బాబు , జంపాని వెంకటేశ్వర్లు




, ఇంటూరి చిన ముక్కంటేశ్వర్లు , ధూళిపాళ్ల పెద వె వెంకటేశ్వర్లు , ఇంటూరి రవికుమార్ , ఇంటూరి అశోక్ , ఇంటూరి శేషగిరి , కొప్పాకు వెంకటేశ్వర్లు , కొల్లా శ్రీనివాసరావు , ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'గుడ్ మార్నింగ్ చిలకలూరిపేట'

చిలకలూరిపేట, జనవరి 4, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ పట్టణ అధ్యక్ష,కార్యదర్సులు "గుడ్ మార్నింగ్ చిలకలూరిపేట" కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్,ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, 34 వ వార్డులో క్లస్టర్,యూనిట్, అధ్యక్ష,కార్యదర్సులు,బూత్ కన్వీనర్లు మరియు ముఖ్య నాయకులను కలుపుకొని పర్యటిస్తూ స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం



జరిగింది.వార్డులో కావలసిన రోడ్లు,డ్రైన్లు నోట్ చేసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని తెలియచేసారు. క్లస్టర్ ఇంచార్జ్ మద్దిబోయిన శివ, 8 వ క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా కరిముల్లా, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు , యూనిట్ ఇంచార్జ్ ఇగనంటి జగదీష్, వడితే అంజి నాయక్ , పట్టణ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ముస్తఫా, శిఖ నాగరాజు , 34 వార్డు పార్టీ అధ్యక్షులు వడితే గోవింద నాయక్ , ప్రధాన కార్యదర్శి జంగా సురేష్ , జరపల మోతి బాయ్, బాణావతు రమేష్, నాయక్, వి.సాంబశివ నాయక్ , వి. రమేష్ నాయక్, అఖిలా భాయి , నంబూరి అంజి, బాణావతు చిన్నానాయక్ , బాణావతు శివ నాయక్ , వంకదరు సుబ్బారావు , సామ్యూల్ జాను ,స్వాతి బాయ్ , షేక్ గౌస్ భాష, శివకృష్ణ , బాణావతు శివ నాయక్, శ్రీకాంత్ , హనుమాన్ సింగ్, అబ్బుల్లా , తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ తెలుగు మహాసభల్లో

## కందిమళ్ల సాంబశివరావుకు సత్కారం

చిలకలూరిపేట, జనవరి 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, నాటక రచయిత నటులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు గుంటూరులో జరుగుతున్న ప్రపంచ మూడవ తెలుగు మహాసభల్లో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో



రోటరీ కమ్యూనిటీ హాల్ లో డాక్టర్ సాంబశివరావు చిలకలూరిపేట రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ జాష్టి రంగారావు, అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్ బోడి రామ సుబ్బారావు, రోటరీ డైరెక్టర్లు తెళ్ల సుబ్బారావు, దండా గోపి కరణం వెంకట శివ గఙ్గ సాంబశివరావు ఎన్ చంద్రశేఖర్ రావు తోటకూర వెంకటనారాయణ టి వెంకటేశ్వరరావు కాయిమాని శివరావు తెనాలి వెంకట్రావు, పరుచూరు శ్రీనివాసరావు, పఠాన్ ముక్తార్ అహ్మద్, హరిదాసుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించారు.

# పల్నాడు జిల్లా వార్త



## 'మీ కోసం' కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి: జిల్లా కలెక్టర్



నరసరావుపేట, జనవరి 4 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లాలోని ప్రజలుతమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కు వచ్చే అర్జీదారులు ఖమీ కోసంఖ కాల్ సెంటర్ నంబర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్ కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు [illegible] వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.నేడు (సోమవారం)కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## కోటప్పకొండ నుండి కొత్తపాలెం రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన జనసేన నేతలు



నరసరావుపేట,జనవరి 4 ప్రభాతవార్త :: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ నుండి కొత్తపాలెం వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డును జన సైనికులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 8 కిలోమీటర్ల రోడ్డును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రూ. 3.9 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. ఈ నిధులతోనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారని గుర్తు చేశారు. నిర్మాణ పనులను జనసేన పార్టీ నాయకులు పర్యవేక్షణ చేయగా మొత్తం 80 పనిని పూర్తి చేయడం జరిగిందన్నారు. మరో వారంలో రోడ్ మొత్తం పూర్తవుతుందని జనసేన పార్టీ అధికార ప్రతినిధి షేక్ ఆద్రుఫ్ తెలియజేసినారు. కార్యక్రమంలో నరసరావుపేట జనసేన పార్టీ నాయకులు అదృఫ్, శిరీ యాదవ్,చెన్నూపల్లి సాంబ,మిరియాల సోము,క్రిష్ణంశెట్టి ఏడుకొండలు,షేక్ ఖాజావలి, గురజాల వాసు,షేక్ బాషా, తదితరులు పాల్గొన్నారు..

## కోటప్పకొండలో అన్నప్రసాద వితరణకు విరాళం

నరసరావుపేట, జనవరి 4 ప్రభాతవార్త ::రాష్ట్రంలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండపై స్వయంభువుగా వెలసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానము అన్నప్రసాద వితరణకు భక్తులు విరాళం అందజేశారు.ఆదివారం ఆలయ కార్యనిర్వహణ అధికారి, సహాయ కమిషనర్ డి చంద్రశేఖర రావు వివరాలు తెలిపారు.తూర్పు కమ్మపాలెం, ఒంగోలు వాస్తవ్యులు దిగుమర్తి ప్రసాద్, లక్ష్మీ ్మ గార్లు మరియు కుమారుడు శివకృష్ణ ఆలయానికి విరాళం అందజేశారు అన్నారు. భక్తులకు అన్నదానము జరుపుటకు రూ.1,00,001/లు డి.డి. ద్వారా ఇచ్చినట్లు తెలియజేశారు. సోమవారం దర్శించుకోవడంతో పాటు తీర్థప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రం వారికి కార్యక్రమంలో అందించారు. ఆలయానికి, స్వామికి సమర్పించే కానుకులకు నిబంధనల మేరకు పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ డి.చంద్రశేఖరరావుతో పాటు, తెలిపారు. కార్యాలయం మేనేజర్ చల్లా శ్రీనివాసరావు సిబ్బంది మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యేచే ఎస్టీయు ఎస్ఎస్సి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



నరసరావుపేట,జనవరి 4 ప్రభాతవార్త :::స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఎస్టియు రాష్ట్ర సంఘం వారిచే రూపొందించబడిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను నరసరావుపేట శాసనసభ్యులు శ్రీ చదలవాడ అరవింద్ బాబు ఆవిష్కరించారు.స్టడీ మెటీరియల్ చూసి ఎమ్మెల్యే పదవ తరగతి విద్యార్థుల కొరకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విద్యార్థుల కొరకు ఇటువంటి ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎస్టియు సేవలను కొనియాడారు. యూనియన్ నాయకులకు శుభాకాంక్షలు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏమండీ, ఆర్థిక కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని,గౌరవాధ్యక్షులు కె యేసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రజిత్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్కే కరిముల్లా, జిల్లా బాధ్యులు పివి భీష్మారావు, ఎస్ హనుమంతరావు, టి ఆంజనేయులు, మల్లికార్జున్ రెడ్డి, వై రామయ్య, అమర్నాథ్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏఎం.రెడ్డి కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం

నరసరావుపేట, జనవరి 4 ప్రభాతవార్త ::పెట్లూరి వారిపాలెం గ్రామంలోని ఏఎం.రెడ్డి స్మారక విద్యాసంస్థలలో పది రోజుల పాటు జరగనున్న మెషిన్ లెర్నింగ్ ఇన్ హెల్త్ కేర్ అంశంపై ఆదివారం బిట్స్ పిలాని ప్రొఫెసర్ డాక్టర్ అభిజిత్ దాస్ ఆధ్వర్యంలో షెడ్యూల్ ట్రైబ్స్ కు చెందిన విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు వివిధ సాఫ్ట్ స్కేల్స్ తో కూడిన విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమని తద్వారా విద్యార్థులు బహుళ జాతీయ కంపెనీలలో త్వరితగతిన ఉద్యోగాలు పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల యొక్క మానసిక మరియు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవటానికి ఈ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కళాశాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి శాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అకాడమిక్ డీన్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తా: డిసిసి అధ్యక్షుడు అలెగ్జాండర్

నరసరావుపేట,జనవరి 4 ప్రభాతవార్త ::పల్నాడు జిల్లా డిసిసి అధ్యక్షునిగా నాలుగోసారి నియామకానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నూతనంగా పల్నాడు జిల్లా డీసీసీ అధ్యక్షునిగా నియమితులైన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. ఆదివారం జిల్లా డీసీసీ కార్యాయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులచే జరిగిన అలెగ్జాండర్ సుధాకర్ అభినందన సభకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు డిసిసి అధ్యక్షునిగా నాలుగు సార్లు నిర్మితులైన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ని గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించి అందరికి పంచిపెట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూవరుసగా నాలుగవ సారి కూడా జిల్లా పార్టీ అధ్యక్షునిగా తనను ఎంపిక చేసిన కేంద్ర మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు.పార్టీ బలోపేతానికి కృషి, నిబద్ధతతో కృషి చేస్తామన్నారు.ప్రత్యేకంగా సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, మల్లిఖార్జున ఖర్గేకి, వైఎస్ షర్మిల రెడ్డికి, పల్నాడు జిల్లా అన్నీ నియోజక వర్గ ఇంచార్జీలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం కోసం తాను అహర్నిశలు కృషి చేస్తానన్నా రు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ ఎం బాషా, సీదా కృష్ణ రావ్, ఇమ్మాన్యూల్, నాగూర్, నాగార్జున, ఖాజా, బ్రహ్మయ్య, కాంగ్రెస్ అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




## నూతన రహదారులను పరిశీలించిన టిడిపి నాయకులు

నరసరావుపేట,జనవరి 4 ప్రభాతవార్త :: నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో జరుగుతున్నటువంటి రహదారి నిర్మాణ పనులను ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు పరిశీలించారు. వివరాలను నాయకులు కొల్లి బ్రహ్మయ్య తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కృషితో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి అన్నారు. దీనిలో భాగంగానే వివిధ గ్రామాలకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్నటువంటి అనేక రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రోడ్లు భవనాలు, రహదారుల శాఖ మంత్రి అనేక ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఆ పనులకు సంబంధించి నిధులు సైతం మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే చేసిన వినతి పై అధికారులు రహదారుల నిర్మాణంలో సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాలలో ఈ పనులు జరుగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా ఫిబ్రవరి మాసంలో శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ వద్ద జరిగే జాతరకు అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది భక్తులకు గత ఏడాది ఎక్కడ ఇటువంటి అసౌకర్యం లేకుండా త్రికోటేశ్వర స్వామి ఆశీస్సులతో కల్పించడం జరిగిందన్నారు. ఈ



## వైకాపా విధ్వంసకర పాలనలో విద్యుత్ సంస్థలు చితికిపోయాయి: ఎమ్మెల్యే 'జూలకంటి'



మాచర్ల, జనవరి 4 ప్రభాతవార్త: వైసీపీ విధ్వంసకర పాలనలో విద్యుత్తు సంస్థలు చితికిపోయాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తగ్గించిన విద్యుత్తు ఛార్జీలపై హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.లక్ష 29 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిన దుర్మార్గుడు జగన్రెడ్డి అని ఆయన వెల్లడించారు. విద్యుత్తు ఛార్జీలు పెంచమని ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటికీ ఒక్క పైసా కూడా విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని చెప్పారు. అంతేకాక యూనిట్ ధరపై రూ.13 పైసలు ఛార్జీలు తగ్గించి, ప్రజలపై పడుతున్న రూ.4,498 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. జగన్రెడ్డి ట్రూఅప్ ద్వారా ప్రజలపై భారం మోపితే, ట్రూడౌన్ అమలు ద్వారా ఆ భారాన్ని సీఎం చంద్రబాబు తగ్గిస్తున్నారని వివరించారు. సోలార్ పవర్ను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ పవర్ను అందజేస్తుందని తెలిపారు. గాడి తప్పిన అన్ని ప్రభుత్వ రంగ వ్యవస్థలను గాడిన పెట్టి, రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్లు అహర్నిశలు శ్రమిస్తున్నారని జూలకంటి కొనియాడారు. ఈ సమావేశంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్ల దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



మాచర్ల, జనవరి 4 ప్రభాతవార్త: వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ పరిధిలోని పట్టణ, రూరల్ పోలీసులను ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ల దొంగతనం కేసులను తక్షణమే పరిష్కరించి, దొంగలను అరెస్టు చేయాలన్నారు. బాధిత రైతుల నుంచి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి, వెంటనే నష్టపోయిన పరిహారాన్ని రికవరీ చేయాలని సూచించారు. రైతులను క్షోభకు గురి చేస్తున్న దొంగలను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. వారి వెనుక ఎంతటి వారున్నా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా ఎస్పీ కృష్ణారావుతో మాట్లాడానని త్వరలో రైతులు నష్టపోయిన దాన్ని రికవరీ అందజేస్తామని వివరించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షునిగా కృష్ణమోహన్

వెల్దుర్తి, జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏపీటీఎఫ్ మండల వార్షిక సమావేశం వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ఎంపీపీ స్కూల్ ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము కిషోర్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ని నియమించాలని, పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్ ఇప్పటికే ఆలస్యమైనందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ వెల్దుర్తి మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఆర్.కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే మహబూబ్బాష, ఆర్థిక కార్యదర్శిగా వి.ప్రదీప్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్గా కె.ఉదయ్కుమార్, పి.ప్రవీణ్, డి.జాన్సన్బాబు, సంపూర్ణ, పి.వెంకట సుధాకర్లు ఎన్నికైనట్లు కొమ్ము కిషోర్ ప్రకటించారు.





## మట్టిలో మాణిక్యం.. మైన్స్ సైంటిస్ట్ రమేష్కుమార్

కారంపూడి, జనవరి 4 ప్రభాతవార్త: తాను చదువుకున్న బడిని మరువక, తాను ఎదిగిన మూలాలను గౌరవిస్తూ, నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు భారత ప్రభుత్వ గనుల శాఖ శాస్త్రవేత్త వి.రమేష్ కుమార్ నాయక్. శనివారం కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం ఐ.శివశేషిరెడ్డి మాట్లాడుతూ రమేష్కుమార్ 2014లో పదో తరగతి పూర్తిచేసి తన ప్రతిభతో ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ నూజివీడులో ఇంజినీరింగ్ సీటు సాధించడమే కాకుండా, దేశంలోనే అత్యున్నత పరిశోధనా సంస్థ బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్లో ఉన్నత విద్య ఎంటెక్ అభ్యసించారు. నేడు శాస్త్రవేత్తగా ఎదిగిన ఆయన ప్రయాణం నేటి విద్యార్థులకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా రమేష్కుమార్ నాయక్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. కష్టాలు కడలి వంటివి, కానీ విద్య అనే నావ ఉంటే ఎంతటి విజయాన్నైనా సుసాధ్యం చేయవచ్చన్నారు. కష్టపడి చదువుకుని దేశ గనుల శాఖలో శాస్త్రవేత్తగా ఎదిగే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి క్రమశిక్షణ, నిరంతర కృషి మాత్రమే రాజమార్గాలని ఆయన హితవు పలికారు.



**గురుశిష్యుల అపూర్వ సమ్మేళనం**

తమ దగ్గర చదువుకున్న విద్యార్థి నేడు దేశానికి సేవలందించే శాస్త్రవేత్త స్థాయికి ఎదగడం పట్ల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రమేష్నాయక్ను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు పూలబాటలు వేసుకోవాలని, ప్రతి ఒక్కరూ రమేష్కుమార్లా ఎదిగి పాఠశాలకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని హెచ్ఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత: రూరల్ సీఐ

వెల్దుర్తి, జనవరి 4 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్బాషా పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మండాది గ్రామ సమీపంలో హైవే రహదారిపై వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువశాతం తలకు బలమైన గాయాలు కావడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ను భారం కాకుండా, ఒక రక్షణ కవచంగా భావించాలని సూచించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా నాణ్యమైన ఐఎస్ఐ ముద్రగల హెల్మెట్ ధరించాలి. ఇది ప్రమాద సమయాల్లో ప్రాణాపాయం నుంచి కాపాడుతుందన్నారు. అతివేగంతో వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ప్రతి వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్సు వంటి పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఎస్సై ఎం.సత్యనారాయణతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## రౌడీషీటర్లకు రూరల్ సీఐ హెచ్చరికలు



వెల్దుర్తి, జనవరి 4 ప్రభాతవార్త: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మాచర్ల రూరల్ సీఐ నఫీజ్బాషా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రౌడీషీటర్ల ప్రవర్తనపై ఆరా తీశారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకోకపోతే జైలుశిక్ష తప్పదని సీఐ మరోసారి గుర్తు చేశారు. వెల్దుర్తి ఎస్సై ఎం.సత్యనారాయణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభకు ఆర్ఎంపి పిఎంపీలు తరలిరావాలి

నకరికల్లు, జనవరి 4 ప్రభాతవార్త ::ఈనెల 10వ తేదీన గుంటూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభకు ఆర్ఎంపీ, పీఎంపీ సోదరులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపి (ఐ) అండ్ పిఎంపి 213/84 నరసరావుపేట డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ శనివారం తెలిపారు. మూడు ఫెడరేషన్లు సంయుక్తంగా ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. గుంటూరు.. నగరంలోని ఏటుకూరు రోడ్డులో హైవే పక్కన గల ఆదిత్య హాస్పిల్స్ ప్రాంగణంలో మహాసభ జరుగుతుందన్నారు. ప్రాథమిక వైద్యానికి గుర్తింపు కోసం 40 ఏళ్ళకు పై బడి చేస్తున్న పోరాటానికి సాఫల్యం లభించే రోజు ఆసన్నమైందన్నారు.ఇప్పటికే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర రావు గారికి, నరసరావుపేట బాపట్ల ఎంపీలకు, ఉమ్మడి గుంటూరు జిల్లా లోని 17మంది శాసనసభ్యులకు, డీఎం అండ్ హెచ్ఓ లకు ఆహ్వానం అందించామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏపీఎంపీఏ 213/84 సంఘం గౌరవ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు సూచనలు సలహాల మేరకు మహాసభ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జనవరి 10వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకల్లా మహా సభ ప్రారంభమవుతుందని ప్రతి ఆర్ఎంపీ సభ్యుడు వైట్ అండ్ వైట్ డ్రెస్ కోడ్ తో నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

ఏడాది కూడా అన్ని శాఖల సమన్వయంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సూచనలతో ముందుకు వెళుతున్నామన్నారు. ముఖ్యంగా గురవాయపాలెం నుండి ఉప్పలపాడు వరకు ట్రాఫిక్కు కు సంబంధించి కీలకంగా ఉన్నటువంటి రహదారి నిర్మాణం పూర్తి చేసామన్నారు. కొత్తపాలెం నుండి కోటప్పకొండ వరకు రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఎన్టీఆర్ కాలనీ లకు శాశ్వత పరిష్కారంగా తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కృషికి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు శాఖల అధికారులకు పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, నాయకులు బసవేశ్వర రావు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

## మునిసిపల్ కమిషనర్



**రేపల్లె, జనవరి 4, ప్రభాతవార్త:** రేపల్లె పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని 15–17 సంవత్సరాల వయసు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

# బాపట్ల జిల్లా వార్త



# చిరంజీవి రాయపూడి చాణక్య ముక్కుబడి పూజా కార్యక్రమాలలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు

**కర్లపాలెం, జనవరి04,(ప్రభాతవార్త):** బాపట్ల జిల్లా కర్లపాలెంలో గ్రామ దేవత పెద్దింటమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన ..సీనియర్ మాజీ సైనికుడు రాయపూడి శ్రీనివాసరావు మనవడు చిరంజీవి చాణక్య.. ముక్కుబడి పూజా కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభా



కాంక్షలు తెలియ జేసిన ..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు... కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు పలికెంద వెంకట కృష్ణారావు, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, జాయింట్ సెక్రెటరీ పీతా సారధి, రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సంకర శేషగిరి రావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్, బాపట్ల జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాధవీలత, సీనియర్ మాజీ సైనికులు డి వెంకటేశ్వర్లు, రుక్మాంగదరావు, మర్రి వీరస్వామి, బాల వెంకట కృష్ణా రెడ్డి, లుక్కా మదన్ మోహన్ రావు, రాంప్రసాద్ రెడ్డి, కోటేశ్వరరావు, పూడా నాగరాజు, పిట్టు సింగారెడ్డి, ఆట్ల శివకేశవ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, బోయిని శ్రీనివాసరావు, బసివి రెడ్డి, షేక్ బాజీ, సుబ్బారెడ్డి, దోమా శివా రెడ్డి, పోలిరెడ్డి మరియు అసోసియేషన్ మహిళా సభ్యురాలులు పోలేరమ్మ, రమాదేవి మొదలగు వారు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన ఎరువులు అందిస్తాం : వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 4, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులను అందిస్తామని మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు స్పష్టం చేశారు. ఆదివారం వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జిడిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఎరువుల గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిడిసిఎంఎస్ బిజినెస్ మేనేజరు హరిగోపాల్ అధ్యక్షతవహించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సమయానికి అవసరమైన ఎరువులను రైతులకు అందించినప్పుడే వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. రైతులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కూటమి ప్రభుత్వం కల్పిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. భట్టిప్రోలు ఎరువుల గోదాముతో రైతులకు విస్తృత ప్రయోజనం చేకూరుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నదని ఆనందబాబు వివరించారు. జిడిసిఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ పంటల సాగులో అవసరానికి మించి యూరియా వినియోగిస్తే భూమి సారవంతానికి నష్టం ఏర్పడుతుందన్నారు. సమతుల్యంగా ఎరువులు వాడితే భూమికి, పంటలకు ఎటువంటి నష్టం జరగదని ఆయన తెలిపారు. భట్టిప్రోలు గోదాములో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామని రైతులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని హరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ జయ వెంకట పూర్ణకుమారి, వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి



రమేష్, భట్టిప్రోలు, సూరేపల్లి పిఎసిఎస్ ఛైర్‌పర్సన్స్ పరుచూరి రమేష్, గోవర్ధనగిరి సుధాకర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, రాష్ట్ర కమ్మ కార్పోరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు, కరుణ శ్రీనివాసరావు, శేషుబాబు, వేములపల్లి జగన్నాధరావు, దినకర్‌బాబు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలి

## బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

**కర్లపాలెం, జనవరి04,(ప్రభాతవార్త):** సమరసత సేవా ఫౌండేషన్ కర్లపాలెం మండల సమావేశం జరిగినది. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ ధనుర్మాసం జనవరి 14వ తేదీ వరకు ఉదయాన్నే తెల్లవారుజామున మేలుకొలుపు నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 12వ తేదీ వివేకానంద జయంతి 12వ తేదీ నుండి 26వ తేదీ వరకు భారత మాత పూజలు జరుపుకుంటూ దేశభక్తిని నింపుకుంటూ హిందూ ధర్మ రక్షణకు పాటుపడవలసిన [illegible]. డిసెంబర్ నెలలో ఒకటవ తేదీ నుండి 5వ తేదీ వరకు మండల సమావేశాలు, 10వ తేదీ రెండవ శనివారం సత్సంగం నిర్వహించుకోవాలన్నారు. 15, 30 తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ప్రతి గ్రామంలో భారతమాత ధార్మిక సమితి ఆధారంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నందిపాటి శివ నాగమల్లేశ్వరరావు మహిళా కన్వీనర్ కట్టా సుజాత శ్రీనివాసరావు , తదితరులు పాల్గొన్నారు..

# ప్రపంచ మానవాళి సనాతన హిందూ ధర్మంతో ముడిపడి ఉంది

## దానిని ఆచరించడం మానవాళి కర్తవ్యం : గరికపాటి గురజాడ

**చెరుకుపల్లి, జనవరి 4, ప్రభాతవార్త :** భారతదేశము యొక్క ఉన్నతిని ప్రపంచానికి




చాటగలడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ కీలకమైన పాత్ర పోషిస్తుందటంలో ఎలాంటి సందేహము వలదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గరికపాటి నరసింహారావు తనయుడు గరికపాటి గురజాడ అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ సంవత్సరం సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన చెరుకుపల్లి లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంతో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నపల్లి ఆదిశంకర వ్యాలీ నుండి ర్యాలీగా చెరుకుపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు గరికపాటి గురజాడకు భారతీయులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ రేపల్లె కండ కార్యవాహ ఉప్పు సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గురజాడ మాట్లాడుతూ కులాలు అనేవి మనుషులు ఏర్పరచుకున్నవి మాత్రమే గాని అవి ఎక్కడ కూడా సనాతన ధర్మంలో లేవన్నారు. మనుషులు చేసే పనులను బట్టి ,వృత్తులను బట్టి కులస్తులుగా భావించారన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని భిన్నత్వంలో ఏకత్వం ఒక భారతదేశంలో మాత్రమే ఉన్నదని ఇది సనాతన ధర్మానికి ప్రతిరూపంగా ప్రపంచంలోని మిగిలిన దేశాలన్నీ గుర్తించా యన్నారు. సనాతన హిందూ ధర్మం కాలము గడిచిన కొద్దీ వైభవం పెరుగుతుందే గాని ఎప్పటికీ తగ్గదన్నారు. మనిషి మనుగడ సనాతన హిందూ ధర్మంతోనే ప్రారంభమైందని ఈ ధర్మం ప్రపంచ మానవాళికి ఆదర్శనీయమని ఇది గుర్తించక కొందరు వారికి తోచిన విధానాలను ఏర్పరచుకున్నారన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం లారీ సీజ్

**రేపల్లె, జనవరి 4, ప్రభాతవార్త:** రేపల్లె మండలంలోని 216 జాతీయ రహదారి ముఖద్వారం వద్ద రేపల్లె ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఎపి16 టిఎఫ్ 6319 నెంబరు గల లారీని అదుపులోకి తీసుకున్నారు. రేపల్లె టౌన్ సిఐ ఎ.మల్లికార్జున రావు కథనం ప్రకారం నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో అమర్తలూరి కోటేశ్వరరావు వద్ద 500 బ్యాగ్‌లలో 25 టన్నుల 860 కిలోల పిడిఎస్ రైస్‌ను లోడ్ చేసుకుని కాకినాడకు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కాకినాడకు చెందిన లారీ ఓనర్ కొండమూరి చంద్రరావు చెప్పినందునే వేమూరు




నుంచి బియ్యం లోడు తీసుకువెళ్తున్నట్లు లారీ డ్రైవర్ ఆకుల శివకృష్ణమణికంఠ విచారణలో వెల్లడించాడని సిఐ తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో లారీ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ మల్లికార్జున రావు చెప్పారు.

# సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

**నిజాంపట్నం, జనవరి 4, ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని జడ్‌పిటిసి సభ్యుడు నర్రాసుబ్బయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఆముదాల పల్లి శివారు బాపయ్యనగర్‌లో రూ.10లక్షల జిల్లాపరిషత్ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్ నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆముదాలపల్లి పంచాయితీ అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉందన్నారు. ఆముదాలపల్లి పంచాయితీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముసలారెడి, నర్రా కృష్ణ, పందరబోయిన శ్రీనివాసరావు, మరకా నాగరాజు,



బెల్లంకొండ ఆదిశేషు, నర్రావెంకటేశ్వరరావు, బన్ని, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నిబంధనలను పాటించాలి : ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర, జనవరి 4, ప్రభాతవార్త:రహదారి భద్రత నిబంధనలను వాహనచోదకులు విధిగా పాటించాలని కొల్లిపర ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ అన్నారు. ఆదివారం కొల్లిపరలోని కృష్ణానదీ కరకట్టపై వాహనాలను తనిఖీ



చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనానికి, డ్రైవింగ్‌నకు సంబంధించిన సరైన పత్రాలను వాహనచోదకులు తనిఖీ సమయంలో చూపించాలని చెప్పారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. హెల్మెట్ వినియోగించడం ఒక బాధ్యతగా చూడాలని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు వాహనానికి నెంబరు ప్లేటు లేకుండా నడపరాదన్నారు. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడే హెల్మెట్‌ను పెట్టుకోకపోయినా, అలాగే మద్యం సేవించి వాహనాన్ని నడిపినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని ఆయన చెప్పారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రావెలర్ వాహనాలు, లారీలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచంలో హిందూ ధర్మానికి మించిన ధర్మం లేదు : గురజాడ

**రేపల్లె, జనవరి 4, ప్రభాతవార్త:** ప్రపంచంలో హిందూ ధర్మానికి మించిన ధర్మం లేదని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు తనయుడు ప్రొఫెసర్ గరికపాటి గురజాడ అన్నారు. ఆదివారం నిస్వార్ధంగా పనిచేస్తున్నదని ఆయన తెలియజేశారు. ధర్మాన్ని రక్షిస్తే ధర్మమే కాపాడుతుందనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ముఖ్యంగా హైందవ సమాజం ప్రతి ఒక్కరి అభ్యున్నతిని ఆకాంక్షిస్తుందని



పట్టణంలోని నెహ్రూ విగ్రహం సెంటరులో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురజాడ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ఆచరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. భారతదేశంలో హిందూ సమ్మేళనాలు నిర్వహించుకోవడం ప్రశంసనీయమన్నారు. దేశ భక్తిని నెలకొల్పి దేశాన్ని రక్షించడంలో ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమని గురజాడ చెప్పారు. భారత దేశ సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించడంలో ఆర్ఎస్ఎస్ గురజాడ స్పష్టం చేశారు. సమాజ వికాసానికి దోహదపడే కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తాయని ఆయన వివరించారు. ముందుగా కాషాయ పతాకాలతో ఓల్డుటౌన్ అంకమ్మ చెట్టు వద్ద నుంచి నెహ్రూ విగ్రహం సెంటరు వరకు శోభాయాత్ర నిర్వహించారు. హిందూ సమ్మేళన కార్యక్రమంలో బాలికల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో వరికూటి గోపి, మల్లెల రామచంద్రరావు, కృష్ణమోహన్, సునీల్ ఇస్కా, కమతం విజయకుమారి, జంజనం హేమశంకర రావు, అగస్త్య, పద్మజ, కోట లక్ష్మీసత్యనారాయణ, జంగం శ్యామ్‌ప్రసాద్, శొంఠి బాబూరావు, పేరం కోటేశ్వరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 11న ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ వేడుకలు

**తెనాలి మున్సిపాలిటీ జనవరి4(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ వేడుకలను తెనాలిలోని రామకృష్ణ కవికళాక్షేత్రంలో జనవరి 11ఆదివారం ఎంతో ప్రతిష్టాత్మకగా నిర్వహిస్తున్నట్లు మాఏపి వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. కేవ్వల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఔత్సాహిక కళాకారులకు మాత్రమే



ఈపోటీల్లో పాల్గొనే అర్హతగల నేపధ్యంలో రాష్ట్రంలోని నలుమూలలనుండి 203 ఎంట్రీలు వచ్చాయని ఆయన తెలిపారు. స్థానిక మాఏపి కార్యాల్నయలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని షార్ట్ ఫిలిం మేకర్స్ ని ప్రోత్సహిన్చేందుకు మాత్రమే ఈపోటీలను ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈపోటీలగురించి రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్ళి ఆయనతోనే ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకల బ్రోచర్ ను ఆవిష్కరించినట్లు దిలీప్ రాజా గుర్తు చేశారు. ఎంట్రీలను ఇప్పటికే జ్యూరీ కి పంపినట్లు ఆయన వివరించారు. షార్ట్ ఫిల్మ్ ల చిత్రీకరణలో కనీస ప్రామాణికాలు లేకుండా అలాగే గతంలో యూట్యూబ్ లో పోస్ట్ చేసిన షార్ట్ ఫిలింలను ప్రాథమిక పరిశీలనలో పోటీలనుండి నియమనిబంధనల ప్రకారంగా న్యాయ నిర్ణేతలు తొలగించారని ఆయన స్పష్టం చేశారు. ప్రథమ బహుమతిగా సూపర్ స్టార్ కృష్ణ స్మారక పురస్కారంతోపాటుగా 50 వేల రూపాయల నగదు, పర్మినెంట్ షీల్డ్, ప్రశంసాపత్రం విజేతకు అందిస్తామన్నారు. మహానటి సావిత్రి పేరిట ద్వితీయ ఉత్తమ షార్ట్ ఫిలింకు రూ 30 వేలు, తృతీయ బహుమతిగా కొంగర జగ్గయ్య స్మారక పురస్కారంతో రూ 20 వేల రూపాయల నగదు ,రెండు కన్సోలేషన్ బహుమతులను గుమ్మడి, ఏవియస్ ల పేరిట విజేతలకు ఒకొక్కరికి రూ 10 వేలు రూపాయల నగదు అందుకుంటారని ఆయన వివరించారు. ఇంకా ఉత్తమ నిర్మాత, దర్శకుడు, రచయిత, కెమెరామెన్, ఉత్తమ నటుడు, నటి, కేరెక్టరునటుడు, నటి, సపోర్టింగ్ యాక్టర్లు, బాలనటి, తదితర వ్యక్తగత బహుమతులను విజేతలకు మా ఏపి పురస్కారంతో ప్రంశసాపత్రం, జ్ఞాపికలను అందిస్తామని దిలీప్ రాజా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటూ ఈ పోటీల్లో పాల్గొన్న ఔత్సాహికులదరిని జనవరి 11 న తెనాలిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ సంబరాలకు ఆహ్వానం పలుకుతున్నట్లు కో కన్వీనర్ దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ సమావేశంలో సహాయ దర్శకులు గాజులపల్లి రాముడు, నరేష్ దోనే, నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు. కాగా ప్రత్యేకతెర మీద స్క్రూటిన్నీ జరుగుతున్న దృశ్యాలను మీడియాకు దిలీప్ రాజా చూపించారు.

# ప్రపంచ తెలుగుమహాసభల్లో కళారత్న కాటూరికి "పూర్ణకుంభ పురస్కారం" ప్రధానం

**తెనాలి టౌన్ జనవరి4(ప్రభాతవార్త):** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో, గుంటూరు లో నిర్వహింపబడుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా, తెనాలికి చెందిన ప్రముఖ శిల్పకారుడు, కళారత్న అవార్డు గ్రహీత కాటూరి



వెంకటేశ్వరరావుకి ఆంధ్ర శ్రీ–పూర్ణకుంభ పురస్కారం ప్రదానం చేశారు. ప్రపంచ తెలుగుమహాసభల మొదటిరోజు శనివారం, 3వ తేదీ నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్నిఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రులు, ఎన్‌టీఆర్ లిటరరీ ట్రస్ట్ అధ్యక్షులు టి.డి. జనార్ధన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్. మానవేంద్రరాయ్, పార్లమెంట్ సభ్యులు కె. గోపీనాథ్ చేతుల మీదుగా కాటూరి వెంకటేశ్వరరావు అందుకున్నారు. ఈ మహాసభల సందర్భంగా సభా ప్రాంగణంలో కాటూరి వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఆయన రూపొందించిన విగ్రహాల వద్ద వేలాదిమంది సందర్శకులు ఫోటోలు దిగుతూ, శిల్పకళపై తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారని కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారం అందుకున్న సందర్భంగా కళారత్న కాటూరి వెంకటేశ్వరరావుకి అభిమానులు, సంస్థ సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే విధమైన స్ఫూర్తి కొనసాగిస్తూ, శిల్పకళా రంగంలో మరెన్నో అద్భుతాలు చేయాలని, ఇప్పటికే జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించిన కాటూరి వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నట్లు ఆయన సన్నిహితులు, అభిమానులు పేర్కొన్నారు.

# రౌడీషీటర్లకు 3టౌన్ పోలీసుల కౌన్సిలింగ్

**తెనాలి మున్సిపాలిటీ జనవరి4(ప్రభాతవార్త):** త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లతోపాటు వివిధ కేసుల్లో ఉన్న పాత నేరస్తులను పిలిపించి ఎస్ఐ షేక్.కరీముల్లా వారి రికార్డులను పరిశీలించారు. ఇటీవలి కాలంలో ఏమైనా నేరాలకు పాల్పడ్డారా, వారి ప్రవర్తన ఎలా ఉంది అంటూ ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో



ఉండాలని సూచించారు. ఎక్కడైనా అల్లర్లు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇకనుంచైనా సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో గౌరవం పొందాలని, పద్ధతి మార్చుకోకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

# సమాజసేవలో కాకతీయ సేవాసమితి అగ్రస్థానం

**తెనాలి టౌన్ జనవరి4(ప్రభాతవార్త):** ఆంధ్ర ప్రదేశ్ కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో, కాకతీయ సేవా సమితి తెనాలి వారి నాయకత్వంలో ఆదివారం పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్ అవుట్ గేటు ఎదురుగా గల ఈ కన్వెన్షన్ హాల్ నందు ప్రాంతీయ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వలసిన విధి విధానాలు, విద్యార్థులకు కావలసిన స్కాలర్షిప్పు, అవసరమైన వారిని హాస్టల్లో చేర్చడం, పిల్లలు విదేశాలలో ఉండి ఇక్కడ ఉన్న వృద్ధులకు వారికి అవసరమైన విషయాలలో చేదోడుగా ఉండాలని, అదేవిధంగా అసోసియేషన్ ని ఇంకా ప్రతిష్టం చేయాలని తెలియజేయడం జరిగింది.




తెనాలి, వేమూరు, రేపల్లె, చీరాల, బాపట్ల, పొన్నూరు, కమ్మ సంఘాల నాయకులు హాజరై సమావేశాన్ని బలపరిచారు. కాకతీయ సేవా సమితి అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణ చంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కాకతీయ సేవా సమైక్య అధ్యక్షులు కొడాలి వెంకట సుబ్బారావు, కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, సెక్రటరీ తమ్మినేని రమేష్, మహిళా కమిటీ సెక్రటరీ కనుమూరి రాజ్యలక్ష్మి, కమిటీ నాయకులు గుత్తికొండ లీలా కృష్ణప్రసాద్, దుడ్డుపల్లి వెంకటరమణ, చిలుకూరి రవిబాబు, పాల్గొని సంఘం చేయ ముఖ్యముగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకి భారతరత్న ఇవ్వాలని ముక్తకంఠంతో తీర్మానం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకతీయ సేవాసమితి కార్యదర్శి ముక్కామల మధుబాబు మరియు వైస్ ప్రెసిడెంట్ గుండపనేని కృష్ణయ్య, గౌరవ సభ్యులు సుబ్రహ్మణ్యం కొత్త సుబ్రమణ్యం, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అంచ రామచంద్, కోగంటి రోహిత్, పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి కార్యదర్శి ముక్కామల మధుబాబు వచ్చినవారికి అభినందనలు తెలియజేశారు.

# ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వని కూటమి ప్రభుత్వం

**తెనాలి మున్సిపాలిటీ జనవరి4(ప్రభాతవార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వటం లేదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ కరీం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటలో గల డి.ఎల్.కాంతారావు భవన్లో నిర్వహించిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ముస్లింలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని అంతేకాకుండా కూటమి పాలనలో




ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు బడ్జెట్లో ఎంత కేటాయించి, ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయపరంగా ముస్లింలకు చందాల్సిన పథకాలు వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు కూటమి ప్రభుత్వం విస్మరిస్తే రానున్న రోజుల్లో తగిన రీతిలో సమాధానం చెప్తామన్నారు. అంతేకాకుండా అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపించట్లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణం మరియు రూరల్ గ్రామాలకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు మార్గదర్శి లూథర్ ఉద్యోగవిరమణ సభలో పాల్గొన్న ఆలపాటి



**తెనాలి టౌన్ జనవరి4(ప్రభాతవార్త):** విద్యార్థుల్లో విద్యార్థి దశ నుండే వారికి సమాజం పట్ల బాధ్యతను గుర్తుచేసి, వారిని బాధ్యతగల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు వేల్పుల మార్టిన్ లూథర్ అని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటలో గల ఎన్జీవో అసోసియేషన్ ఫంక్షన్ హాల్ నందు, అమృతలూరు మండలం మూల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, పదవీవిరమణ చేసిన వేల్పుల మార్టిన్ లూథర్ అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా దాదాపు మూడు దశాబ్దాల పాటు సుదీర్ఘంగా, పనిచేసి ఎందరో విద్యార్థులకు విద్యాబోధనలోనే కాకుండా సమాజం పట్ల మార్గదర్శకునిగా వ్యవహరించిన లూథర్‌ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయునిగా పదవీ విరమణ చేసిన లూథర్‌ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయునిగా పదవీ విరమణ చేసిన లూథర్‌నేటి నుంచి కొత్త జీవితం గడపబోతున్న సందర్భంగా ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో లూథర్ కుటుంబ సభ్యులతో పాటు ఆయన అభిమానులు ఆయన వద్ద విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్

## న్యూయార్కు డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో నికోలస్ మదురో

## వెనిజులాను పాలించేది మేమే: ట్రంప్

## దేశ ప్రజలకు స్వేచ్ఛ లభించింది: విపక్ష నేత కొరియా మచాడో

**కారకాస్, జనవరి 4:** వెనిజులాపై అమెరికా దాడుల నేపథ్యంలో ఆ దేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను నియమిస్తూ ఆ దేశ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది . ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో సహా ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్ లను అమెరికా సైన్యం బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వ పాలన కొనసాగింపు, దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయస్థానం పేర్కొంది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన 56 ఏళ్ల డెల్సీ రోడ్రిగ్జ్ నికోలస్ మదురోకు అత్యంత సన్నిహితురాలు. విప్లవ నేత, లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకులు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన ఈమె 1969లో రాజధాని కాకరాస్ లో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన డెల్సీ మదురో ప్రభుత్వంలో కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2018 నుంచి ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రోడ్రిగ్జ్ తన సోదరుడు నేషనల్ అసెంబ్లీ చీఫ్ జార్జ్ రోడ్రిగ్జ్‌తో కలిసి మదురో ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆ దేశ రాజకీయాల్లోనే కాకుండా ఆర్థిక వ్యవస్థపై కూడా పట్టు సాధించారు. దీంతో ఆమె ఆర్థిక, చమురు శాఖల మంత్రిగానూ సేవలందిస్తున్నారు. అమెరికా ఆంక్షల నడుమ వెనిజులా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ఎంతగానో కృషి చేశారు రోడ్రిగ్జ్. ఆ దేశంలోని



చమురు కోసం ట్రంప్ సుంకాలు విధించిన వేళ ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో కీలకపాత్ర పోషించారామె. రోడ్రిగ్జ్ నియామకం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించినట్టు సమాచారం.

**న్యూయార్క్ డ్రగ్స్‌ఏజెన్సీ కార్యాలయంలో వెనిజులా మదురో:** యూఎస్ డ్రగ్ ఏజెన్సీ ఆఫీసులో వెనిజువెలా అధ్యక్షుడు వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భారయ సిలియా ఫ్లోర్స్ అమెరికా భద్రతా దళాల అదుపులో ఉన్నారు. మదురోకి సంబంధించి వీడియోను యూఎస్ సెక్యూరిటీ ఫోర్సెస్ ఓ వీడియోను విడుదల చేశాయి. మదురోని వెనిజులా నుంచి తీసుకువచ్చి అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్(ఎడిఇ) న్యూయార్క్ డివిజన్ కార్యాయలంలో నిర్బంధించినట్లు స్పష్టమవుతోంది. వెనిజులా రాజధాని కారకాస్‌పై ప్రత్యేక అమెరికా దళాలు ఆకస్మిక దాడి జరిపాయి. ఈ దాడి సమయంలోనే ఆ దేశ అధ్యక్షుడు మదురో ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా యూఎస్ సెక్యూరిటీ ఫోర్సెస్ వారిని అదుపులోకి తీసుకున్నారు. యూఎస్ దాడి సమయంలో మదురో, ఆయన భార్య కారకాస్‌లోని హై సెక్యూరిటీ ఫోర్ట్ టియునా మిలిటరీ కాంపౌండ్‌లోని తమ నివాసంలో ఉన్నట్లు తెలుస్తోంది. దాడి విషయం తెలియగానే హైసెక్యూరిటీతో పారిపోయే ప్రయత్నం చేశారు. కానీ, వారి ప్రయత్నం ఫలించలేదు. రాపిడ్ రెస్పాన్స్ 47 టీమ్ అధికారిక ఎక్స్ అకౌంట్‌లో మదురోకి సంబంధించిన వీడియో షేర్ చేసింది. ఈ వీడియోలో లోయర్ మన్‌హట్టన్‌లోని డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ న్యూయార్క్ డివిజన్ కార్యాలయం లోకి మదురోని అధికారులు తీసుకెళ్తున్నారు. చేతులకు సంకెళ్లతో




సెక్యూరిటీ సిబ్బంది మధ్య బందీగా ఉన్నారు. కాగా, మదురోని ఓ గదిలోకి తీసుకెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బందికి ఆయన గుడ్ నైట్, హ్యాపీ న్యూ ఇయర్ అని విష్ చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. వెనిజువెలాపై దాడి తరువాత మదురో, ఆయన భార్యను ముందుగా అమెరికాలోని సైనిక స్థావరానికి తీసుకెళ్లారు. ఆ తరువాత అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలించారు. మదురోను డీఈఏ కార్యాలయం నుంచి బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్తారని తెలుస్తోంది. మదురో, ఆయన భార్యపై నార్కో టెర్రరిజం, యునైటెడ్ స్టేట్స్‌లోకి టన్నుల కొద్దీ కొకైన్ దిగుమతి చేయడం, అక్రమ ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలు మోపారు.


**వెనిజులాను పాలించేది మేమే...యుఎస్ అధ్యక్షుడు ట్రంప్:** ఇదిలా ఉండగా ఇకపై వెనిజులా పాలనపై ట్రంప్ కీలక ప్రకటనచేస్తూ సురక్షితంగా అధికారాల బదిలీ జరిగేదాకా వెనిజులాను మేమే పాలిస్తామంటూ ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు. గత కొంతకాలం వెనిజులా తమ ఆధీనంలోనే నడుస్తుందన్నారు. ప్రజల జీవనానికి సురక్షితమని భావించే వరకూ దేశంలో సరైన, న్యాయమైన అధికారాల బదిలీ అయ్యే వరకూ వెనిజులా పాలన తమ ఆదీనంలోనే ఉంటుందని మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. గతంలో పాలన ఉండకూడదని, సురక్షితంగా సుస్థిరంగా వెనిజులా అభివృద్ధికి మేమే సహకరిస్తామని, అప్పటివరకూ అమెరికా పాలనలోనే ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. అయితే ఈపాలన ఎంతకాలం ఉంటుందోప్రకటించలేదు. వెనిజులాలో ప్రభుత్వ మార్పు, ఆదేశ చమురు వనరులపై నియంత్రణ కీలకమని ట్రంప్ బాహాటంగానే చెప్పారు. ఇపుడు అతిపెద్ద చమురు కంపెనీలు వెనిజులాలో పెట్టుబడులకు ముందుకువస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించారు. డ్రగ్స్‌ను అక్రమంగా అమెరికాలోకి తరలిస్తున్నారని, డ్రగ్స్ మాఫియాను వెనిజులా అధ్యక్షుడు పెంచి పోషిస్తున్నారంటూ నార్కో ఉగ్రవాదం కొనసాగిస్తున్నారంటూ మదురోపై అభియోగాలు నమోదు చేసిన ట్రంప్ వెనిజులాపై సైనిక చర్య తప్పదని కూడా హెచ్చరించారు. చెప్పినట్లుగానే సైనిక చర్యతో మదురో దంపతులను నిర్బంధంలోకి తీసుకుని అమెరికాకు తరలించడం, ఆపై ఉపాధ్యక్షురాలు అధ్యక్షురాలిగా నామినేట్‌కావడం జరిగిపోయాయి.

**వెనిజులా ప్రజలకు స్వేచ్ఛ లభించింది...ప్రతిపక్ష నేత మచాడో:** అమెరికా దాడులుచేసి మదురో దంపతులను నిర్బంధించి తీసుకెళ్లడంపై శాంతిపురస్కార గ్రహీతదేశ విపక్షనేత మారియా కొరినా మచాడో స్పందించారు. వెనిజులాకు స్వేచ్ఛ లభించిందని అమెరికా తన వాగ్దానాన్ని తిరిగి నిలబెట్టుకుందని అన్నారు. ప్రజలారా స్వేఛ్చా సమయం వచ్చింది. వెనిజులా ప్రజలు, ఇతరదేశాలపౌరులపై జరిగిన దారుణ నేరాలకు మదురో ఇపుడు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. చర్చలతో పరిష్కారానికి నిరాకరించాడని, అందుకే అమెరికా తన వాగ్దానం నిలుపుకున్నదని వ్యాఖ్యానించారు. ప్రజాసార్వభౌమాధికారంతో వెనిజులాను పాలించే సమయం వచ్చిందన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, శాంతియుత భవిష్యత్తు నిర్మిస్తామన్నారు. ప్రజాస్వామ్యంకోసం అనేక ఏళ్లుగా తానుచేసిన పోరాటం ఫలించిందన్నారు. వెనిజులా తదుపరి అధ్యక్ష పదవికోసం ఎడ్మండో గొంజాలెజ్ ఉరిటియాకు తన మద్దతుప్రకటించారు. అయితే వెనిజులా అధ్యక్షురాలిగా మచాడోకు అప్పగించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా విముఖంగా ఉన్నారు. మచాడో చాలా మంచి మహిళ అని కాని ఆమె నాయకురాలిగా ఉండటం చాలా కష్టమని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా అమెరికా చేసిన దాడుల్లో సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలోసాధారణప్రజలతోపాటు సైనికులు కూడా ఉన్నారు. వెనిజులాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు అక్కడి మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

# చమురు నిల్వలకోసమే ట్రంప్ దాడులు

## మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ధ్వజం

**న్యూయార్కు, జనవరి 4:** వెనిజులాపై ట్రంప్ ఆదేశాలమేరకు జరిగిన దాడులు ప్రజాస్వామ్యం పునరుద్దరణ, డ్రగ్స్ నియంత్రణ కోసం కానే కాదని, కేవలం ఆదేశంలో ఉనన అపారమైన చమురు నిల్వలు కోసమేనని మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ విమర్శించారు. చముకోసమే ట్రంప్ రాజకీయ ఆశయాలకోసమే ఈ దాడి జరిగిందన్నారు. ఈ చర్యలతో అమెరికా సురక్షితం కాబోదని ఆమె తన సోషల్ మీడియాలో విమర్శనాత్మక వ్యాఖ్యలుచేసారు. బలవంతంగా ప్రభుత్వాన్ని మార్చడం, ప్రాంతీయ అస్థిరతకు కారణమై చివరకు అమెరికన్ల ప్రాణాలకే ముప్పుతెస్తుందని ఆమె హెచ్చరించారు. మదురో ఇక క్రూరమైన నియంత అయినాసరే ఈ చర్య చట్టవిరుద్ధమని కమలా పేర్కొన్నారు. ప్రభుత్వ మార్పు లేదా చమురుపేరుతో ప్రారంభించిన యుద్ధాలు గందరగోళంగా మారి చివరకు అమెరికన్ కుటుం



బాలే బలవుతున్నాయని ఆమె గుర్తుచేసారు. అమెరికా ప్రజలు ఇలాంటి చర్యలు కోరుకోవడంలేదని, ట్రంప్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్‌కు చట్టబద్ధత, స్పష్టమైన ఎగ్జిట్‌ప్లాన్ లేదని, దీనివల్ల అమెరికన్ సైనికుల ప్రాణాలుప్రమాదంలో పడతాయని అన్నారు. బిలియన్ డాలర్లు ఖర్చుచేసి ఒక ప్రాంతాన్ని అస్థిరపరుస్తున్నారన్నారు. ఈచర్యలకు అమెరికాకు వచ్చే లాభం ఏమిటో ట్రంప్ చెప్పలేకపోతున్నారని అన్నారు. న్యూయార్కు కొత్తమేయర్ జోహ్రాన్ మమ్దానీ కూడా ట్రంప్‌పై విమర్శలుచేసారు. ఒక స్వతంత్ర దేశంపై దాడి చేయడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని ఆరోపించారు.

# వెనిజులాకు మస్క్ స్టార్‌లింక్ నెలరోజులు ఉచిత ఇంటర్నెట్

**న్యూయార్కు, జనవరి 4:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెనిజులా ప్రజలకోసం అక్కడ నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజలకు నిరంతరాయంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు నెల రోజుల పాటు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ప్రకటించారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో వెల్లడించారు. అమెరికా సైనిక చర్యలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొద్ది సేపటికే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్, ఆయన పాలన ముగియడంతో ఇకనైనా వెనిజులా అభివృద్ధి పథంలో పయనించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనిజులా ఇప్పుడు శ్రేయస్సును పొందగలదని స్పానిష్ భాషలో వ్యాఖ్యానించారు. లోఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ల ద్వారా పనిచేసే స్టార్‌లింక్ నెట్‌వర్క్, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో కనెక్టివిటీ సమస్యలు లేకుండా చూస్తుంది.



ఫిబ్రవరి 3 వరకు ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయి. మదురో ప్రభుత్వంపై మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందన ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. మదురో ప్రభుత్వ విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతిపక్షానికి బహిరంగంగా మద్దతు పలికిన మస్క్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రతిపక్ష నేత మారియా కొరినా మచాడోకు అండగా నిలిచారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న వెనిజులా, సరైన నాయకత్వం లేకపోవడం వల్లే అభివృద్ధికి దూరమైందని మస్క్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు.




# వెనిజులా పరిణామాలపై భారత్ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులా పరిణామాలపై భారత్ విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజులాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వెనిజులా రాజధాని కారకాస్‌పై దాడిచేసిన దేశ అధ్యక్షుడు మదురో దంపతులను అదుపులోకి తీసుకున్న అమెరికా మదురోపై తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది.

గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈకేసులో మదురో భార్య, కుమారుడితోపాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.

# ఉత్తర నైజీరియా గ్రామంపై సాయుధ మిలిటెంట్ల దాడి

## 30 మంది మృతి, భారీ సంఖ్యలో కిడ్నాప్

**అబూజా, జనవరి 4:** ఆఫ్రికాదేశం ఉత్తర నైజీరియాలోని మారుమూల గ్రామంపై సాయుధులైన దుండగులు భీకర దాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పుల్లో సుమారు 30 మంది గ్రామస్థులు మరణించారు. మరికొందరిని కిడ్నాప్ చేసి అడవిలోకి ఎత్తుకెళ్లారు. నైజర్ రాష్ట్రంలోని కసువాన్‌దాజీ గ్రామంలో ఈ ఘోర ఘటన జరిగింది. ఊహించని ఈ దాడితో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. బోర్గు స్థానిక ప్రభుత్వ పరిధిలోని కసువాన్‌దాజీ గ్రామంపై దుండగుల ముఠా విరుచుకుపడింది. గ్రామంలోకి ప్రవేశించగానే జనంపై కాల్పులు మొదలుపెట్టారు. కనిపించిన వారిని కనిపించినట్లు కాల్చి చంపారు. అంతటితో ఆగకుండా గ్రామంలోని ఆస్తులను ధ్వంసం చేశారు. స్థానిక మార్కెట్‌కు నిప్పు పెట్టారు. అనేక ఇళ్లను దహనం చేశారు. దీంతో గ్రామం మంటల్లో చిక్కుకుంది. మరణాల సంఖ్యపై



పోలీసులు, స్థానికుల మధ్య భిన్న వాదనలు ఉన్నాయి. ఈ దాడిలో కనీసం 30 మంది గ్రామస్థులు మరణించారని పోలీసులుప్రకటిస్తే స్థానికులు మాత్రం మృతుల సంఖ్య 37కు పైగా ఉందని చెబుతున్నారు. చాలా మంది ఇంకా కనిపించడం లేదని, వారిని దుండగులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన తర్వాత భద్రతా బలగాల స్పందనపై విమర్శలు వస్తున్నాయి. కిడ్నాప్ అయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, అధికారులను మోహరించామని నైజర్ రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి వాసియు అబియోడున్ తెలిపారు. దుండగులు ఎక్కడి నుంచి వచ్చారనే దానిపై పోలీసులకు క్లారిటీ వచ్చింది. కబే జిల్లా వెంబడి ఉన్న నేషనల్ పార్క్ ఫారెస్ట్ నుంచి దుండగులు గ్రామంలోకి చొరబడ్డారు. దాడి చేసిన తర్వాత మళ్లీ అడవిలోకే పారిపోయారు. నైజీరియాలో విశాలమైన అటవీ ప్రాంతాలు ఉండటంతో, వాటిని ఈ సాయుధ ముఠాలు తమ స్థావరాలుగా మార్చుకుంటున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ, భద్రత తక్కువగా ఉండే మారుమూల గ్రామాలనే వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి దాడులు జరగడం ఇదే తొలిసారి కాదు. తాజా దాడి జరిగిన కసువాన్‌దాజీ గ్రామం, పపిరి కమ్యూనిటీకి సమీపంలోనే ఉంది. గత ఏడాది నవంబర్‌లో పపిరిలోని ఒక క్యాథలిక్ పాఠశాల నుంచి 300 మందికి పైగా విద్యార్థులను, టీచర్లను దుండగులు కిడ్నాప్ చేశారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో నరమేధం జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన నైజీరియాలో ఆధిపత్యం కోసం అనేక ముఠాలు అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నాయి.

# ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దు..

## బిఎంసి మేనిఫెస్టో విడుదలలో థాక్రే బ్రదర్స్ హితవు

**ముంబయి,జనవరి 4:** అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహిరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధమ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్చలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎప్పటికీ తామే అధికారంలో ఉంటామని బీజేపీ అనుకుంటే పొరపాటని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్ థాక్రే అన్నారు. మహారాష్ట్రను యూపీ, బీహార్‌లా మార్చాలనుకుంటున్నారని విమర్శించారు. మహారాష్ట్ర ఈ దేశానికి దిశానిర్దేశం చేస్తుం దని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు వ్యతిరేకంగా



సుప్రీంకోర్టుకు వెళ్లిన బీజేపీ ఇప్పుడు మహారాష్ట్రలో పోటీ లేకుండా అభ్యర్థులను గెలిపించుకోవడంపై ఏం చెబుతుందని ప్రశ్నించారు. బ్రిహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల మేనిఫెస్టోను తన సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రేతో కలిసి ఆదివారం నాడిక్కడ ఆయన విడుదల చేశారు. బీజేపీ, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకరపై ఈ సందర్భంగా థాక్రే సోదరులు విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహింరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధమ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్చలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. నేతల సెక్యూరిటీ తీసేయాలని అధికారులకు ఆయన తెలిపారని, ఆయనకు అసెంబ్లీలో అధికారం ఉందే కానీ, బయట లేదని చెప్పారు. అభ్యర్థులను పోటీలేకుండా ఎన్నుకోవడం ద్వారా ఓటర్ల హక్కులను నార్వేకర్ కొల్లగొట్టారని, ఆయనపై కేసు నమోదు చేయాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రాంతాల్లో ఉపఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పధాని నరేంద్ర మోదీపై ఉద్ధవ్ థాక్రే విమర్శలు గుప్పించారు. ఇది ముఠా పాలనే కానీ, ప్రజాస్వామ్యం కాదు. ఓట్ చోరీకి పాల్పడుతుంటే రెడ్‌హ్యాండ్‌గా పటుకున్నాం. ఇప్పుడు అభ్యర్థులను తస్కరిస్తున్నారు. మేము మాత్రం మోడీతో రాజీపడే ప్రసక్తే లేదు. రిటర్నింగ్ అధికారుల కాల్ రికార్డులన్నీ మాకు చూపించాలని ఎన్నికల కమిషన్‌ను మేము సవాలు చేస్తున్నాం అని థాక్రే అన్నారు.



# తీరు మారకపోతే మీపైనా చర్యలు

## క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వెనిజులా తాత్కాలికంగా తమ ఆధీనంలోనే ఉంటుందని చెపుతూ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలైన క్యూబా, మెక్సికో, కొలంబియాలకు సైతం వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ తయారీ, మాదక ద్రవ్యాల ముఠాలకు క్యూబా, మెక్సికో, కొలంబియా దేశాలు ఆశ్రయమిస్తున్నాయని, అక్కడి నుంచి అమెరికాలోకి అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కారణంతో వెనిజులా పై సైనిక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆ దేశాలు తమ పద్ధతి మార్చుకోకపోతే వెనిజులా పరిస్థితినే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాల్లోని డ్రగ్స్ ఉత్పత్తి ల్యాబ్‌లపై దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొలంబియాపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. కొలంబియాలో మూడు ప్రధాన కొకైన్ తయారీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వాళ్లే కొకైన్‌ను తయారు చేసి, అమెరికాకు పంపిస్తున్నారని అందుకే అతను జాగ్రత్తగా ఉండాలంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి హెచ్చరించారు. కాగా, వెనిజులా అధ్యక్షుడిని అమెరికా సైన్యం బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో దేశాలు ఖండించాయి. ఇది దురాక్రమణ కిందకే వస్తుందని స్పష్టం చేశాయి. ఈ పరిణామాలు దక్షిణ అమెరికా మొత్తం భద్రతకు ముప్పుగా మారిందని పేర్కొన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని వెనిజులా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు.




# క్షిపణి పరీక్షలతో తూర్పుఆసియాలో కిమ్ ప్రకంపనలు

**ప్యాంగ్యాంగ్, జనవరి 4:** ఉత్తర కొరియా కొన్ని రోజులవిరామం తర్వాత తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆదివారం ఉదయం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించిన జపాన్ ప్రభుత్వం తన దేశ ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సుమారు రెండు నెలల తర్వాత ఉత్తర కొరియా జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి పరీక్ష ఇదే కావడం గమనార్హం. ఉత్తర కొరియాక్షిపణి ప్రయోగం చేసినట్లు జపాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం ఈ క్షిపణి అప్పటికే సముద్రంలో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం 7:50 గంటల ప్రాంతంలో రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని తీరం నుంచి ఉత్తర కొరియా వరుసగా పలు క్షిపణులను సముద్రంలోకి ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది. అమెరికా, జపాన్ దేశాలతో కలిసి పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని సియోల్ వెల్లడించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యుంగ్ చైనా పర్యటనకు బయలుదేరుతున్న తరుణంలో ఈ ప్రయోగాలు జరగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనేలా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సానుకూలంగా స్పందిస్తారని దక్షిణ కొరియా ఆశిస్తున్న వేళ కిమ్ జోంగ్ ఉన్ క్షిపణులతో కవ్వింపులకు దిగారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ శనివారమే ఒక భారీ ఆయుధ కర్మాగారాన్ని సందర్శించారు.క్షిపణుల ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న నైన్త్ పార్టీ కాం గ్రెస్ సమావేశాలలోపు తన సైనిక బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతోనే కిమ్ ఇలాంటి ప్రయోగాలకు పాల్పడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్‌ను కూడా ఇలాగే తీసుకురాగలరా: రోఖన్నా ఆగ్రహం



**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులాపై యుద్ధం ప్రారంభించి మాగాను ట్రంప్ మోసం చేసారని భారత సంతతికి చెందిన అమెరికా చట్టసభల సభ్యుడు రోఖన్నా తప్పుపట్టారు. తాజా దాడులు ఆయన యుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియాలో ఘర్షణలకు వ్యతిరేకంగా తాము ఓటు వేస్తున్నామన్నారు. కానీ అధ్యక్షులు మాత్రం సైనికీకరణకు అనుకూలంగా ఉండే విదేశాంగశాఖలోని కొందరి మాటలకు తలొగ్గుతు న్నారని అన్నారు. తైవాన్ అధ్యక్షుడు లచింగ్ తెనుచైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా నిర్బంధిస్తే ఏంచేస్తారని ప్రశ్నించారు. ఉక్రెయిన్‌పై దాడులపరంపరను కొన సాగిస్తున్న పుతిన్ కూడా ట్రంప్ ఇలాగే హ్యాండిల్‌చేయాలని సూచించారు.

## అశ్లీలకంటెంట్ తొలగించడం, ఖాతాలను కూడా మూసేస్తాం



**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' కంటెంట్ గురించి స్పష్టత ఇచ్చింది ఎక్స్‌లో పోస్ట్ చేసే చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగిస్తామని,అలాంటి కంటెంట్‌ను పోస్ట్ చేసిన అకౌంట్లను శాశ్వతంగా సస్పెండ్ చేస్తామని వెల్లడించింది. అందుకోసం అవసరమైతే స్థానిక ప్రభుత్వాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఎక్స్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ ఖాతా ద్వారా ఈ ప్రకటన వెలువడింది. స్థానిక చట్టాలకు, నియమాలకు విరుద్ధంగా అశ్లీల, అసభ్య కంటెంట్ పెరుగుతున్నట్టు భారత ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌కు జనవరి రెండో తేదీన నోటీసులు జారీ చేసింది.

## నిధులకోసం పసికందును బలిచ్చేందుకు సిద్ధమైన తల్లితండ్రులు కటకటాల్లోకి..




**బెంగళూరు, జనవరి 4:** బెంగళూరు రూరల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. డబ్బు మీద పిచ్చితో చంటిబిడ్డను చంపడానికి సిద్ధమయ్యారు తల్లిదండ్రులు. నిధికోసం 8 నెలల పసి కందును బలి ఇవ్వ డానికి చూసినా పోలీసుల ఎంట్రీతో కథ అడ్డం తిరిగింది. చిన్నారి క్షేమంగా బయటపడింది. కీచక తల్లి దండ్రులు జైలు పాలయ్యారు. సంఘటనకు సంబంధించి పోలీసుల వివరాలప్రకారం హుసకోటే తాలూకా, సులిబెలెలోని జనతా కాలనీకి చెందిన సయ్యద్ ఇమ్రాన్ పురాతన నిధుల కోసం గత కొంత కాలం నుంచి గాలిస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లోని ఓ గదిలో నిధి ఉన్నట్లు అతడికి తెలిసింది. నిధి తమకు దక్కాలంటే ఓ చిన్నారిని బలివ్వటం తప్పదని భావించారు. ఇందుకోసం 8 నెలల తమ బిడ్డను బలివ్వడానికి సిద్ధమయ్యారు. ఈ సమాచారం పోలీసులకు అంది సయ్యద్ ఇంటి దగ్గరకు వెళ్లి పాపను కాపాడారు. భార్యాభర్తలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## ఒడిశా క్వారీలో భారీ పేలుడు: ఇద్దరు మృతి

**ధంకెనాల్, జనవరి 4:** ఒడిశాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ధెంకనాల్ జిల్లాలోని ఓ క్వారీలో భారీ పేలుడు సంభవించడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు కార్మికులు గాయపడి శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మోతంగా పీఎస్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామ సమీపంలో ఓ రాతి క్వారీలో కార్మికులు డ్రిల్లింగ్, మైనింగ్ పనులు చేస్తున్న సమయంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో అక్కడి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సహా ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు, డాగ్ స్క్వాడ్స్ అక్కడకు చేరుకున్నాయి. భారీ శిథిలాల మధ్య చిక్కుకున్న పలువురిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

## వెనిజులాపై అమెరికా దాడులపట్ల వామపక్షాల నిరసన




**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులాపై అమెరికా సైనిక చర్యకు దిగడం, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాయి. వెనిజులాపై అమెరికా చర్యను సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణగా అభివర్ణించిన సీపీఎం, దీన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని పిలుపునిచ్చింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, దృఢమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ దాడిని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్‌ఎస్‌పీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా చర్య ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమేనని ఆ పార్టీల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. బేబీ, డి. రాజా, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్, మనోజ్ భట్టాచార్య సంయుక్త ప్రకటనలో తెలిపారు.

5-1Pg6exHMNWJQE 10_5-1Pg6exHMNWJQE.qxd 04/Jan/26 11:14 PM Page 1



# మత్తు రహిత రాష్ట్రం లక్ష్యం

**● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ● ఇచ్ఛాపురంలో విజయవంతంగా అభ్యుదయం సైకిల్‌యాత్ర**

శ్రీకాకుళం, జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను మత్తురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధృఢసంకల్పంతో ఉన్నారని గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ కేంద్రంగా మారి యువత భవిష్యత్తు చిన్నాభిన్నమైందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ 25 మంది పోలీసులు నాలుగు జిల్లాలు, 75 మండలాలు, 508 గ్రామాల్లో 51 రోజులపాటు 1,300 కి.మీ దూరం సాగిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కలిగిన శక్తిగా మార్చేందుకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడకలు జరగడం సంతోషంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితల కష్టాలు చూసి ఆనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఐజీ గోపినాథ్ జెట్టి మానసపుత్రికగా వచ్చిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకు వచ్చాం. కేవలం శిక్షల ద్వారానే కాకండా, అవగాహన ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని ఆమె వివరించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్‌శాఖతోనే సాధ్యం కాదని ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపార. ఈగల్ ఐజి ఎ.రవికృష్ణ మాట్లాడుతూ స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలో విద్యార్థులు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్ర మార్పు వస్తే మత్తు పదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్‌కు తెలపాలని, టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించాలని, మీకు పోలీసుల నుంచి ఎటువంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టి ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలు, వేల మంది విద్యార్థులు, పోలీసులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. మొదట ఇచ్ఛాపురంలో పోలీస్‌స్టేషన్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు 'డ్రగ్స్ వద్దు బ్రో' పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో రాజావారి మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రితో పాటు ప్రముఖులు సైకిల్ తొక్కగా, హోంమంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గ రమణమూర్తి, గౌతు శిరీష ఉన్నారు.





గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద థాయిలాండ్ భక్తులు

## శివయ్య సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో థాయిలాండ్‌కు చెందిన 15 మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయం తరఫున ఇఓ డి.బాపిరెడ్డి సూచనలతో ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓలు రవి, శ్రీనాథ్‌లు పర్యవేక్షించారు. వారికి ఆలయంలో ప్రతి విగ్రహానికి సంబంధించి వివరించారు. ఇక్కడ క్షేత్ర మహిమను చరిత్రను వివరించారు. థాయిలాండ్ భక్తులకు స్వామి గర్భగుడిలోని స్వయంభువు వృత్తాంతాన్ని అర్చకులు వివరించారు. ఇక్కడ వెలసిన అమ్మవారిని జ్ఞాన ప్రసూనాంబ అని ఎందుకు పిలుస్తారు? అలాగే గురుదక్షిణామూర్తి దక్షిణాభిముఖంగా ఎందుకు వెలిసినారు అనే అంశాలను విదేశీ భక్తులకు వివరించారు. ప్రతి నెల హుండీల్లో అమెరికా, ఇతర దేశాల కరెన్సీ రావటం ఇక్కడకు విదేశీ భక్తుల రాకను సూచిస్తుంది.



కేంద్ర మంత్రికి స్వాగతం చెబుతున్న ఇఓ డి.బాపిరెడ్డి

## కేంద్ర మంత్రి రాహుకేతుదోష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి కుటుంబసభ్యులతో కలిసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ మేరకు ఇఓ డి.బాపిరెడ్డి వేద పండితులతో ఆలయ మర్యాదలతో మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కోవాలని కోరగా ఇఓ బాపిరెడ్డి వెంటనే వారికి ప్రత్యేక రాహుకేతు దోష నివారణ టిక్కెట్టు రూ.5 వేల కినుగోలు చేసి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డిలు వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎపిఆర్‌ఓలు రవి, శ్రీనివాసులు, టెంపుల్ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి, హరికృష్ణ, సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.



## ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు అంకాలమ్మ ఆలయ ట్రస్ట్ విరాళం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి విద్యాదానట్రస్ట్‌కు తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అంకాళమ్మ ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ టి.పీతాంబరం ఆచారి విరాళం అందించాడు. ఆదివారం సాయంత్రం తిరుమలలో దాత టిటిడి అదనపు ఇఓ చిరూమామిళ్ళ వెంకయ్య చౌదరిని కలసి 10,01,111రూపాయలు చెక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళం అందించినట్లు చెప్పారు.

## విద్యుత్ భారం నుండి ఊరట

**- ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్**

గన్నవరం(కృష్ణా), జనవరి 4, ప్రభాతవార్త: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రజలకు రూ.4,498కోట్ల విద్యుత్ భారం నుండి ఊరట కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవటం అభినంద నీయమని రాష్ట్రప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కొనియాడారు.

ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019-24 మద్యకాలంలో వినియోగించిన విద్యుత్‌కు రూ.4,498 కొట్లు ప్రజల నుండి వసూలు చేసేందుకు అనుమతి కోరుతూ ఏపి ఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాయగా ఈమొత్తం ప్రభు త్వమే భరిస్తుందని చంద్రబాబు ప్రకటించినట్లు తెలిపారు. చంద్రబాబు చేపడుతున్న విద్యుత్ సంస్కరణల ఫలితంగా ఏపిఈఆర్సీ ఏర్పాటు అయిన తరువాత తొలిసారిగా ట్రూడౌన్ చార్జీలు నమోదు కావటం గొప్పవిషయంగా పేర్కొన్నారు. ట్రూడౌన్ అమలు ద్వారా తమ ప్రభుత్వం యూనిట్‌కు 13పైసలు చొప్పున తగ్గించినట్లు తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని సియంగా ప్రమాణస్వీకారం రోజున ప్రగల్బాలు పలికిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా 9సార్లు విద్యత్‌చార్జీలు పెంచి రూ.32వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపి వారి నడ్డివిరిచారని మండి పడ్డారు. 2019లో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని జగన్ తన అస్యవ్యస్త పాలనా విధానాలతో విద్యుత్‌కోతలు విధించి ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసారని ఆరోపించారు. కమీషన్‌ల కొసం ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసారని విమర్శించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● పెరుమాళ్లపాడులో అన్నదాతలకు కొత్త పాసు పుస్తకాల పంపిణి**

చేజర్ల (నెల్లూరు), జనవరి 4, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరికొత్త రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామంలో మీ భూమి-మీ హక్కు నినాదంతో నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు చట్టబద్ధత లేనివని, అవి ఇంట్లో ఉంటే అరిష్టమని వ్యాఖ్యానించిన మంత్రి, వాటిని తిరిగి ఇచ్చేయాలని రైతులను కోరారు. ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్, భద్రతా ప్రమాణాలతో ప్రస్తుతం అందిస్తున్న పాస్ పుస్తకాలు పూర్తిగా చట్టబద్ధమైనవని తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు తక్షణమే కనిపిస్తాయని, వీటిలో ఎలాంటి మార్పులైనా, డేటా సెంటర్ ద్వారా మాత్రమే చేయగలమని స్పష్టం చేశారు. ఏ చిన్న తప్పు జరిగినా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు 35 లక్షల మంది రైతుల పాస్ పుస్తకాలను మార్చిందని, కోటి మంది రైతుల భూ హక్కులను గందరగోళానికి గురిచేసిందని విమర్శించారు. రీసర్వే పేరుతో హద్దురాళ్లపై కూడా గత సీఎం బొమ్మలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత సీఎం బొమ్మతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ చేయగా, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 13 గ్రామాల్లో 5,486 పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని తెలిపారు. వీటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు.



### విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు

విద్యుత్ ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేశామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32,166 కోట్ల ట్రూఅప్ చార్జీలను వసూలు చేసిందని, ఇక నుంచి ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వం ఏడాదికి రూ.4,497 కోట్లను భరిస్తుందని తెలిపారు. తిరుపతి రీజియన్ పరిధిలో రూ.1,551.69 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం అన్నారెడ్డి పాలెం, చేజర్ల మండలం పెరుమాళ్లపాడుకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేశామని తెలిపారు. పెరుమాళ్లపాడులోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసి, శుభ ముహూర్తంలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 2026 డిసెంబర్ నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతులకు చట్టబద్ధ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు సుపరిపాలన అందిస్తూ రామరాజ్య స్థాపన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.


ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి. పావని గ్రామ సర్పంచ్ తెలపన్నేని నర్సమ్మ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తాళ్లూరి గిరి నాయుడు, తెలపన్నేని జయంతులు నాయుడు, మాజీ ఎంపీపీలు అన్నలూరు శ్రీనివాసులు, రావి పెంచల రెడ్డి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, అచ్చాల నారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదల్ల వీర రాఘవరెడ్డి, రావి లక్ష్మీ ృ నర్సారెడ్డి, చీర్ల వెంకటేశ్వర్లు, గోనుగుంట రాంబాబు, ఉడతా పెద్ద హజరత్, అచ్చాల సుబ్బారెడ్డి, గుత్త హజరత్ నాయుడు, శ్రీధర్ నాయుడు, ఆత్మకూరు డిఎల్‌పిఓ రమణయ్య ఎంపీడీవో అమర్, తహసీల్దార్ మస్తానయ్య, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ చొరవతో పేద విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ స్కూల్

**● వక్ఫ్‌బోర్డు స్థలంలో 5ఎకరాల్లో భూమిపూజ చేసిన మంత్రి నారాయణ ● వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉచిత విద్య అందించేలా ఏర్పాట్లు**

నెల్లూరు, జనవరి 4 ప్రభాతవార్త- వైద్యం: నెల్లూరులో పేద విద్యార్థులకు కార్పొరేట్,అంతర్జాతీయ విద్య అందించడంపై మంత్రి నారాయణ ప్రత్యేకదృష్టి పేట్టారు.సొంత నియోజకవర్గమైన నెల్లూరు సిటీతోపాటు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు.లక్షల్లో కాదు..కోట్లు ఖర్చు పెట్టి స్కూల్స్ అభివృద్ధి చేయడంతోపాటు ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు.తాజాగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రూరల్ నియోజకవర్గంలో ఉన్న పరమేశ్వర నగర్‌లో 20కోట్లతో అంతర్జాతీయ స్థాయి స్కూల్ ఏర్పాటుకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి,ఎమ్మెల్యే శ్రీదర్‌రెడ్డి,వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్‌తో కలసి భూమి పూజ చేశారు మంత్రి నారాయణ....

వక్ఫ్‌బోర్డు స్థలంలో 5ఎకరాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించేందుక ఈ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు.దీనికోసం అనకాపల్లి ఎంపి సీఎం రమేష్ రూ.20 కోట్లు సీఎస్ఆర్ నిధులు అందించారు. భూమి పూజా కార్యక్రమం మైనార్టీ పెద్దలు, పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి 1000మంది విద్యార్థులకు 1నుంచి 12వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించేలా నిర్మాణం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నెల్లూరు సిటిలో తాను చదువుకున్న విఆర్సీ పాఠశాలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్ది మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గత విద్యాసంవత్సరం ప్రారంభించారు. భూమి పూజ తర్వాత జరిగిన బహిరంగసభలో మంత్రి నారాయణ మాట్లాడారు. ఈ స్కూల్‌కు అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌గా నామకరణం చేశారు. నెల్లూరు సిటీలో సుమారుగా 94వేల ఇళ్లు ఉండగా గత ఎన్నికల సమయంలో 84వేల ఇళ్ళకు డోర్ టు డోర్ కాంపెయిన్‌కు వెళ్ళానన్నారు. అప్పుడే పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. తాను కటిక పేదరికం నుండి వచ్చానని పేదరికం విలువ తెలుసని అన్నారు. తన గురువు నారాయణమూర్తి ద్వారా ఫౌండేషన్ ఏర్పడిందన్నారు. నగరంలోని 15 పాఠశాలను అభివృద్ధి చేసే విధంగా పలువురు దాతలు సహాకారం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, డిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నుంచి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీఎం రమేష్, రెడ్డి ల్యాబ్స్, టివిఎస్ కంపెనీ నుండి సహాకారం తీసుకోవడం జరిగిందన్నారు. నెల్లూరు నగరంలో సుమారు 200కోట్ల రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తాను చదివిన విఆర్ పాఠశాల అభివృద్ధికి తన కూతురు షరిణీ, ఎన్‌సిసి గ్రూపులు సహాయ సహాకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, హాజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాష, నగర మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగరపాలక సంస్థ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ హసీనా, మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్, పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడలో సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: నిరుద్యోగులు, అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఆ వివరాలను చట్ట విరుద్ధ లావాదేవీల కోసం వాటిని ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న విజయవాడకు చెందిన ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. కరెంటు ఖాతా తెరిస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ఆ తర్వాత బ్యాంకు ఎకౌంట్లు సేకరిస్తున్నారు. ఈ ముఠాలోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన అనుమానితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. విజయవాడకు చెందిన పేరపోగు దేవదాసు ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గతేడాది అతని ఇంటి పక్కన ఉండే కృష్ణారెడ్డి (ఏ3) దేవదాసును కలిసి బ్యాంకులో కరెంటు ఖాతాను తెరిచి, ఆన్‌లైన్‌లో షేర్ చేస్తే డబ్బులిస్తారని ఆశ చూపించాడు. రూ.10,000 వస్తాయన్న ఆశతో కృష్ణారెడ్డితో కలిసి భవానీపురంలోని సిటీ యూనియన్ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ కరెంటు ఖాతా తెరిచి, కిట్‌ను కృష్ణారెడ్డికి ఇచ్చాడు. తర్వాత బాధితుడి ఫోన్‌పే ఖాతాలకు రూ.7,000 జమ చేశారు. ఇటీవల దేవదాసు తన ఖాతాను పరిశీలించగా రూ.2 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. భయపడి వెంటనే విజయవాడలోని సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో సూర్య, కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మి ృలను పోలీసులు అరెస్టు చేశారు. కీలక నిందితురాలు పార్వతి ఇంకా అరెస్టు కావాల్సి ఉంది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా వాటిలో 36 ఖాతాల నుంచి 56 మోసాలకు సంబంధించి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

**ఫిలిప్పీన్స్‌కు ఖాతాలు:** కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక విషయాలు వెలుగు చూశాయి. అతని భార్య సౌభాగ్యలక్ష్మి (ఏ4) కూడా అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించేదని తేలింది. వీరిపై విజయవాడ నగరానికి చెందిన సూర్య శ్రీనివాస మణికంఠ అలియాస్ సూర్య (ఏ1) పర్యవేక్షించాడు. ఈ దంపతులు సేకరించిన ఖాతాలను మణికంఠకు అందించేవారు. అతను వాటిని చట్టవిరుద్ధ లావాదేవీల కోసం పార్వతి (ఏ2)కి ఇచ్చేవాడు. ఆమె తిరిగి వీటిని ఫిలిప్పీన్స్‌లో ఉన్న మరో మహిళకు అందించేది. అక్కడి నుంచి ఈ ఖాతాలను బెట్టింగ్‌లు, సైబర్ నేరాలల్లో నగదు బదిలీలకు ఉపయోగించేవారు. ప్రతి ఖాతాకు వీరికి రూ.30,000 కమీషన్ అందేది. ఈ డబ్బును అన్ని దశల్లో పంచుకునే వారని దర్యాప్తులో తేలింది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా, వాటిలో 36 ఖాతాల ద్వారా 56 లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇవి ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో జరిగిన మోసాలకు ఈ ఖాతాలను ఉపయోగించారు.

**కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్:** ప్రధాన నిందితుడు సూర్యను 2023లోనూ అద్దె ఖాతాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా పోలీసులు అరెస్టు చేశారు. 9 నెలలు జైలులో గడిపాడు. బయటకు వచ్చాక టెలిగ్రామ్ ద్వారా అద్దె ఖాతాలు సేకరిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తేలింది. పోలీసులు సూర్యతో పాటు కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మి ృని అరెస్టు చేశారు. వీరి నుంచి 2 కార్లు, 3 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూర్య తన కారుపై రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకున్నారు. దీని పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కీలక నిందితురాలు పార్వతి సహా పలువురి అరెస్టుకు ప్రయత్నిస్తున్నారు.



## బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత మరువలేనిది


**మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మిత**

రామచంద్రాపురం, జనవరి 4 ప్రభాతవార్త: బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, ప్రొడ్యూసర్ సుష్మిత అన్నారు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, బలిజపల్లి గ్రామంలో ఆదివారం "మన శంకర్ వరప్రసాద్ గారు" మెగా చిత్రం ఈ నెల 12న విడుదల నేపథ్యంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి, ప్రొడ్యూసర్ గారపాటి సాహుతో కలసి బలిజపల్లిలోని చిరంజీవి వీరాభిమానులు పొర్లుదండాల ఈశ్వర్ రాయల్, చంద్రశేఖర్ రాయల్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరో మెగాస్టార్ కుమార్తె సుష్మిత, స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తమ గ్రామానికి వస్తున్నారనే ఆనందోత్సాహాలతో గ్రామస్థులు వారికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భాణాసంఛా పేళుళ్ళ నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా హరిదాసు భజనలు, గంగిరెద్దుల ఆటలు, చెక్కల భజనలు, రంగు రంగుల రంగవళ్ళులతో ముందుగానే గ్రామంలోకి సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. గ్రామ దేవతలు నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రామాలయానికి చేరుకున్న వీరికి అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీస్సులందించారు. జల్లికట్టు సంబరాల కొరకు సిద్దం చేసిన బసవన్నలను తిలకించి హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తపసి మురళి రెడ్డి, దండు లక్ష్మీపతి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని" నిర్వహించ నున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు.



## గోవా, త్రిపుర గవర్నర్‌లకు స్వాగతం

గన్నవరం, జనవరి 4 ప్రభాతవార్త: గన్నవరం విమానాశ్రయంలో గోవా, త్రిపుర గవర్నర్‌లకు పలువురు అధికారులు స్వాగతం పలికారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చేరుకున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజులకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రమణ్యం పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు గవర్నర్‌లు రోడ్డుమార్గాన గుంటూరు బయలుదేరి వెళ్ళారు.

# వీబీ-జీ,రామ్-జీ పేరుతో ఉపాధి పథకానికి శ్రీకారం

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 4, ప్రభాతవార్త :** ప్రస్తుతం కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్

**-నేడు ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామసభలు.**
**-100 రోజులు ఉన్న పని దినాలు 125కు పెంపు.**
**-నాలుగు పనులకు అధిక ప్రాధాన్యత.**
**-కోరిన వారికి 14రోజుల్లో పని కల్పించాలి.**
**-నిర్వహణ వ్యయం 6 నుండి 9 శాతానికి పెంపు.**

(వీబీజీ, రామ్‌జీ) పేరుతో ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా నేడు అన్ని గ్రామ పంచాయతీలలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నారు. 17 ఏళ్ల నుండి అమలు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు చేసింది. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించి ఏఏ కార్యక్రమాలు అమలవుతాయో గ్రామసభలలో వివరించనున్నారు. ఈ గ్రామ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులు తోపాటు ఉపాధి కూలీలను ఆహ్వానించి పథకం ప్రధాన అంశాలను వివరించనున్నారు. వాస్తవానికి ఈ గ్రామసభలు గత నెల 26వ తేదీన జరగాల్సి ఉండగా ప్రభుత్వం అనివార్య కారణాలవల్ల వాయిదా వేసింది. తాజాగా నేడు (సోమవారం) నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మార్పులు, చేర్పులతో ఈ పథకం ఈ ఏడాది ఏప్రిల్ నుండి అమలులోకి రానుందని ఎంపీడీవోలు తెలుపుతున్నారు. వీబీజీ, రామ్‌జీ పథకం అమలుతీరుఇంతవరకు వంద రోజులు ఉన్న పని దినాలు 125 రోజులకు ఈ పథకం ద్వారా పెరగనున్నాయినిర్వహణ వ్యయం 6 నుండి 9 శాతానికి పెంచారువ్యయంలో 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రం భరిస్తుండగా ఇకపై 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుందిపథకం అమల్లో భాగంగా ఖరీఫ్ కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు కూలీల కొరత


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

లేకుండా పూర్తిగా రెండు నెలల పాటు ఉపాధి పనులకు విరామం ఇవ్వనున్నారుజల సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, జీవనోపాదుల కల్పన, పకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు కోరిన వారికి 14 రోజుల్లో పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి (వేతనంలో సగం) వారి ఖాతాలకు జమవుతుంది. ఈ మొత్తాన్ని బాద్యులైన సిబ్బంది నుంచి రికవరీ చేస్తారు. కూలీలకు వేతనాలు చెల్లింపులో ఆలస్యమైతే పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పని దినాల పెంపుతో జిల్లాలోని అన్ని పంచాయతీల్లోని ఉపాధి శ్రామికులందరికి అదనపు ఆదాయం లభించనుంది. గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీ పైనే ఆధారపడిఉంది. ఇప్పుడు కొత్తగా పల్లె ప్రగతి పనులు చేపట్టేందుకు మార్గం సులభతరం కానుంది. సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూరలు నున్నాయి. బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటలు, మొక్కల పెంపకం, వ్యక్తిగత సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు కుంతల నిర్మాణాలకు నిధులు మంజూరు కానున్నాయి. ఇకపై ఈ పథకంతో పల్లె ప్రగతి పూర్తిస్థాయిలో అభివృద్ధి కానుందని విశ్లేషకులు తెలుపుతున్నారు.

## వెంగళరావు నగర్ స్కూల్లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 4, ప్రభాత వార్త :** గుంటూరు నగరపాలక సంస్థ బాలిక ఉన్నత పాఠశాల వెంగళరావు నగర్ స్కూల్లో స్కూల్ హెడ్మాస్టర్ పెరికలపూడి రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. విద్యార్థులతో సావిత్రిబాయి పూలే వేషధారణతో చేపట్టిన పలు కార్యక్రమాలు తోటి సహజర విద్యార్థులను, స్థానిక ప్రజలను అలరించాయి. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ పి రమేష్, హెడ్ మిసెస్ కె ప్రమీలాలు సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత కాలంలో ప్రతి కాలనీలో, గ్రామాలలో ఒక స్కూలు ఉందని, సావిత్రిబాయి



పూలే చదువుకునే అప్పటి రోజుల్లో పాఠశాల లేకపోవడం వల్ల తన భర్త వద్ద చదువు నేర్చుకుని వారే ఒక పాఠశాలను నిర్మించారని విద్యార్థులకు తెలిపారు. అప్పట్లో స్త్రీలు వంటింటికే పరిమితం అనే విధానం ఉండేదని, స్త్రీలు వంటింటికి పరిమితం కాదని చదువు ఒక్కటే నిజమైన కుటుంబాభివృద్ధి, దేశ అభివృద్ధి అని చాటి చెప్పిన నిరూపించిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని అన్నారు.



అటువంటి మహోన్నతమైన వ్యక్తి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని తారాలత, పి ఈ టి హరి కుమారి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు పూల మొక్క ఇచ్చి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన అదనపు కమిషనర్


**గుంటూరు కార్పొరేషన్, జనవరి 4, ప్రభాతవార్త:** గుంటూరు నగరాన్ని పర్యావరణ పరిరక్షణ గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్న నగర



కమిషనర్ పులి శ్రీనివాసులకు పూల మొక్క అందించి ప్రత్యేక శుభాకాంక్షలును అదరపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ప్రతి పండుగలకు, నూతన సంవత్సర సమయాలలో అనేకమంది ప్లాస్టిక్ వాడకాన్ని పెంచే విధంగా కవర్లలో బొకేలను అందించటం, ఫ్లెక్సీలను వేసి శుభాకాంక్షలు తెలపటం చేస్తున్నారని, ఈ నూతన సంవత్సరంలో పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా భావించిన వారంతా ప్రజా ప్రతినిధులకు ప్రముఖులకు, ఉన్నత స్థాయి శ్రేణి అధికారులకు శుభాకాంక్షలు తెలిపేవారు ఒక పూల మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. దీంతో ఈ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధారప కమిషనర్ చల్ల ఓబులేసు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందించి ముఖ్యంగా నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం , అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తరపున నూతన సంవత్సర సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## దత్త జయంతి సందర్భంగా విశేష హోమాలు

**గుంటూరు కల్చరల్, జనవరి 4, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు,



శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ పాలక మండలి ఆధ్వర్యంలో డిసెంబర్ 27 నుంచి ప్రారంభమైన14వ సద్ది కార్యక్రమం కొనసాగుతున్న క్రమంలో దత్త జయంతి సందర్భంగా ధార్మిక ప్రాంగణంలో రుత్విక్కులతో దత్తహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు దీక్షాదారులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, లంక విజయ బాబు, పుట్టప్రభాకర్, ఊటుకూరి నాగేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శవంతురాలు సావిత్రిబాయి పూలే

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి4, ప్రభాతవార్త:** సావిత్రిబాయి ఫూలే ఆదర్శవంతురాలిగా చరిత్రలో నిలిచారని ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు కొనియాడారు. వర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు ఫూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సావిత్రిభాయి ఫూలే 195వ జయంతి కార్యక్రమం



జరిగింది. ఈ కార్యక్రమానికి జ్యోతిరావు ఫూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య యం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించి సావిత్రిబాయి ఫూలే గొప్పతనాన్ని విశదీకరించారు. నేడు మహిళలు విద్యావంతులుగా మనగలుగుతున్నారంటే సావిత్రిబాయి పూలే మార్గమే నిదర్శనమన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో మహిళా విద్యా ఉద్యమం చేపట్టిన తొలి వీరవనిత సావిత్రిభాయి ఫూలే అన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడిచిన సావిత్రిబాయి పూలే మహిళావిద్యకు కృషిచేశారని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో మహిళా విద్య పట్ల వ్యతిరేకత ఉన్నకాలంలోనే తన భర్త జ్యోతిరావు ఫూలేతో కలిసి పాఠశాలలు ఏర్పాటుచేసి పురుషులతో మహిళలకు సమానంగా విద్యా అవకాశాలు కల్పించడానికి కృషిచేశారని అన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మహిళా విద్యతో పాటుగా అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు సేవ చేసేవారన్నారు. బాబూ జగ్జీవన్ రాం చైర్ డైరెక్టర్ ఆచార్య పి.జె.రత్నాకర్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్‌కుమార్, నూటా అధ్యక్షుడు ఆచార్య పి.బ్రహ్మజీరావు, అధ్యాపకులు ఆచార్య కె.ధనలక్ష్మీ, ఆచార్య కె.వి.శాంతిశ్రీ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఇ శివప్రసాదరావు, సిఇ వెంకటేశ్వర్లు, సిఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రమణ, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ డా.కోటీ యాదవ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## మండల కార్పెంటర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

**అమరావతి: జనవరి 4 ప్రభాతవార్త** సిఐటియు ఆధ్వర్యంలో మండల కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గం ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా మచ్చ సుబ్రహ్మణ్యం, అధ్యక్షులుగా కటారి రాంబాబు ఉపాధ్యక్షులుగా జకోజు రామకృష్ణ, కార్యదర్శిగా మహమ్మద్ రఫీ, సహాయ కార్యదర్శిగా చలకా రమేష్, ట్రెజరీ గా అశోక్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## బిజెపి పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా నరసింహారావు

**అమరావతి: జనవరి 4 ప్రభాతవార్త :** బిజెపి పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా అమరావతి మండల పరిధిలోని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త నారాయణదాసు. నరసింహారావు ఎన్నికైనారు. గత కొన్ని సంవత్సరాలుగా బిజెపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ బిజెపి సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పనిచేస్తున్న నరసింహ రావును గుర్తించి పార్టీ జిల్లా నాయకత్వం కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర పార్టీ నాయకులకు, జిల్లా పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులునాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యునిగా జిల్లాలో బీసీ సామాజిక వర్గాలలో పార్టీ బలోపేతానికి శాయ శక్తుల కృషి చేస్తానని నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందించారు.



## రెండవ రోజు 2,3రౌండ్లు పూర్తి

### -సెమీ ఫైనల్‌కు చేరుకున్న 15జట్లు

**తాడేపల్లి, జనవరి 4, ప్రభాతవార్త :** కె.ఎల్.విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్ -2026 ఆదివారం రెండవరోజు రెండు మూడు రౌండ్లు పూర్తయాయి. రెండవ రౌండ్‌లో మొత్తం 64 జట్లు పోటీ పడ్డాయి. వాటిలో 30జట్లు గెలుపొందగా మిగిలిన జట్లు ఇంటిబాట పట్టాయి. రెండవ రౌండ్‌లో గెలుపొందిన 30జట్లు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూడవ రౌండ్‌లో మళ్ళీ తలపడ్డాయి. ఆదివారం మూడవ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన



జెన్‌టియు కాకినాగ జట్టు కర్నాటకు కు చెందిన గార్డెన్ సిటి యూనివర్సిటీ పైన విజయం సాధించిన నేపధ్యంలో సోమవారం నాడు క్వార్టర్ ఫైనల్ మరియు సెమీ ఫైనల్‌లో 15జట్లు పోటీ పడుతున్నట్లు సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. సోమవారం నాడు సెమీ ఫైనల్ అనంతరం మంగళవారం ఫైనల్ పోటీలు పూర్తవుతాయని ఆయన అన్నారు.

# డ్వాక్రా బజార్ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**గుంటూరు క్రైమ్, జనవరి 4, ప్రభాతవార్త:** గుంటూరు నగరంలో జనవరి 6 నుండి 18 వరకు నర్సరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదుట జరగనున్న జాతీయ స్థాయి"సరస్ అఖిల భారత డ్వాక్రా బజార్" ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు. ప్రదర్శన శాల ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై, పోలీస్ శాఖ తరఫున చేపట్టబోయే భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రదర్శన/బజార్ నిర్వహణలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. సందర్శకుల సంఖ్యను ముందుగానే అంచనా వేసుకుని, దానికి అనుగుణంగా స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి స్టాల్ వద్ద తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలని, పెద్ద స్టాళ్లకు స్పష్టమైన ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల రద్దీ నివారించేందుకు తగిన పార్కింగ్ ప్రదేశాలను కేటాయించాలని, ప్రతి స్టాల్‌లో గాలి చొరబడే మార్గాలు సరిపడా ఉండేలా చూడాలని, ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా నిర్ణీత సంఖ్యలోనే సందర్శకులను అనుమతించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గుంటూరు మిరపకు గుర్తుగా "మిరపకాయ"ను ఈ సరస్ బజార్ మాస్కాట్‌గా ఎంపిక చేసినట్లు



చెప్పారు. దేశం నలుమూలల నుంచి స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని వివరించారు. హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, గృహ అలంకరణ వస్తువులు, ఆర్గానిక్ ఆహార శాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిల్డ్రన్ పార్క్ వంటి విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. మొత్తం 300 స్టాళ్లలో 150 ఇతర రాష్ట్రాలకు, 150 ఆంధ్రప్రదేశ్‌కు చెందినవిగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందల్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్‌డీవో శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, సౌత్ డీఎస్పీ



భానోదయ, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్, తదితర అధికారులు పాల్గొన్నారు

## ఆటో ద్విచక్రం వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**పెదనందిపాడు జనవరి 4 (ప్రభాతవార్త)** పెదనందిపాడు చిలకలూరిపేట రహదారిలో కోల్డ్ స్టోరేజ్ ల సమీపంలో ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. కాకుమాను



మండలం గార్లపాడుకు చెందిన కావూరు అశోక్ (40) చిలకలూరిపేట సి ఆర్ క్లబ్ లో పనిచేసి తన ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చిలకలూరిపేట పెదనందిపాడు రోడ్డులో పాలపర్రు పెదనందిపాడు మధ్య కోల్డ్ స్టోరజిల సమీపంలో బాపట్ల నుండి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటో ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పెదనందిపాడు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాఆసుపత్రికి తరలించారు.

## పారిశుద్ధ్య పనులు రోజువారి వేతనంపై చేసేవారు ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి : కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 4, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో పారిశుద్ధ్య పనులు రోజువారి వేతనం పై చేసేందుకు ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను కార్పొరేషన్ లో నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాస్ కోరారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్ నెంబర్ 08632345103 ల్యాండ్ నెంబర్ కు ఫోన్ చేసి వారి యొక్క వివరాలు, బ్యాంక్ ఎకౌంట్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్ తో పాటు పత్రాలకు సంబంధించిన జిరాక్స్ కాపీలు అందించాలని తెలిపారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా నగరాన్ని సత్య గుంటూరు గా తీర్చిదిద్దుకోవటానికి నగరంలో ఈ నెలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న కార్మికులకు అదనంగా పనులు చేసేందుకు కార్మికుల అవసరం వల్ల రోజువారి వేతనంపై పనులకు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోజువారి వేతనంపై చేరే కార్మికులు వారికి కేటాయించిన విధుల్లో పనులు చేయాలని కోరారు.



## వైభవంగా శ్రీత్యాగరాజ స్వామి ఆరాధన సంగీత మహోత్సవాలు ప్రారంభం

**గుంటూరు కల్చరల్, జనవరి 4, ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ స్వామి 179వ ఆరాధన సంగీత మహోత్సవాలు 04-01-2026 నుంచి 08-01-2026



వరకు నిర్వహిస్తున్న క్రమంలో శ్రీ త్యాగరాజ స్వామి కళావేదికపై ఆదివారం ఉదయం ఉత్సవాలు స్థానిక కళాకారుల లఘు కచేరీలతో ప్రారంభమైయ్యాయి. సాయంత్రం ఆరాదన సభకు సభాధ్యక్షులుగా ఏ.పి.ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్, ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి జస్టిస్ వినాల జయసూర్య ఆత్మీయ అతిథులుగా వ్యవస్థాపకురాలు, గోసంవర్ధనం, కాంచీపురం, శోభితమ్మ, ప్రముఖ న్యాయవాది, హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎమ్.వి.జె.కే.కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. సభానంతరం ప్రముఖ విద్వాంసులు కె.ఎస్.విష్ణుదేవ్ నంబూద్రి, చెన్నై వారి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. వీరికి వయోలిన్ పై డాక్టర్ కె.వి.కృష్ణ, తిరుపతి ,మృదంగంపై బుర్రా శ్రీరామ్, చెన్నై, ఘటంపై ఎం.హరిబాబు, గుంటూరు వారు చక్కటి వాయిద్య సహకారం అందించారు. తొలుత జరిగిన లఘుకచేరీలో యుక్తశ్రీ, చాందిని, సుధాలక్ష్మీ, గ్రాహ్య, అంసికావర్ణ, వేమూరి సాత్విక, వేణువుపై ఫణితేజ, వీణపై డివిఆర్ సీత పాల్గొన్నారు. వీరికి పాలేటి గోవర్ధన్, సిహెచ్ సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, సభ్యులు, కళాకారులను అతిథులను ఘనంగా సత్కరించారు.

ముఖ్యఅతిధి జస్టిస్ వినాల జయసూర్య మాట్లాడుతూ పని ఒత్తిడిలో తల్లడిల్లే మాకు ఇటువంటి సాంప్రదాయ సంగీతం వినటం వలన ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు .ఇటువంటి సభను నిర్వహిస్తున్న కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ను తదితరులు అభినందించారు. ఈ సభలో అడుగుపెట్టగానే ఒక మంచి అనుభూతి కలిగిందన్నారు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేసిన ట్రంప్ సుంకాలు

**గుంటూరు కల్చరల్, జనవరి 4, ప్రభాతవార్త :** 2025లో ట్రంప్ సుంకాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయటమే అతిముఖ్యమైన సంఘటన అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో 2025సంవత్సరం జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల విశ్లేషణ సభ జరిగింది. సభకు సంస్థ సీనియర్ సభ్యులు దయాసాగర్ అధ్యక్షత వహించారు. విశ్లేషణ సభలో కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వలన భారతదేశంలో రొయ్యలు, బట్టల తయారీ పరిశ్రమలతోపాటు వ్యవసాయ రంగం నష్టపోయిందన్నారు. ఏఐ ప్రభావంతో అనేక పెద్దకంపెనీలు వేలాది మంది ఉద్యోగులను తొలగించాయన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల ప్రపంచం నష్టపోతుందన్నారు. అంతర్జాతీయ రాజకీయాల విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమాసియాలో ఇజ్రాయేల్ సాగిస్తున్న మారణహోమం మానవత్వాన్నే మంటగలిపిందన్నారు .కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య తదితరులు ప్రసంగించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా పూర్తిచేయాలి

### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 ( ప్రభాత వార్త ) :** గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు నిర్దేశిత ప్లాన్ ప్రకారం గడువులోగా శరవేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని మెయిన్ రోడ్ విస్తరణ పనులకు సంబంధించి సంబంధిత ఇంజనీరింగ్ , టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించి తగిన ఆదేశాలు జారీ చేశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయడమే అతి ముఖ్యమని, పనుల జాప్యం వల్ల ప్రజలు రాకపోకలు నిర్వహించే వాహనదారులకు, చుట్టుపక్కల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరంలో జరుగుతున్న ప్రతి పని నిర్దేశించిన గడువులోగా పూర్తిచేసేలా కార్యదర్శులు, సంబంధిత విభాగాల అధికారులు బాధ్యత తీసుకొని ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ల లో ఏర్పాటుకు ఇంజనీరింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ జరుగుతున్న విస్తరణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, చుట్టుపక్క పరిసర ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డి ఈ వెంకటరమణ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఆయా విభాగాలకు చెందిన కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 5న జరిగే భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి


**తాడేపల్లి, జనవరి 4, ప్రభాతవార్త :** కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ అన్నారు. ఆదివారం తాడేపల్లి ఎంటిఎంసి కార్యాలయం ఎదుట డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియా తో జలిల్ మాట్లాడుతూ కేంద్రం నుంచి కూటమి ప్రభుత్వం నుంచి వేల లక్షల రూపాయలు అమరావతి పేరుతో తీసుకొచ్చారని ఇంతవరకు అమరావతికి రాజధానికి ఖర్చు పెట్టింది ఏమీ లేదని విమర్శించారు. అమరావతి రైతులకు కనీసం ప్లాట్స్ కూడా కేటాయించటం లేదన్నారు. అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల హామీలు ఇచ్చి ఏ ఒక్కహామీని నెరవేర్చలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో గెలిచే ప్రసక్తే





లేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ముస్లింలపై జరిగే దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 5న భారత్ బంద్‌కు పిలుపు ఇస్తున్నామని అన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, వ్యాపార సంస్థలు, లారీ యజమానులు ప్రజలు సహకరించాలని బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు 2గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 4, ప్రభాతవార్త :** జిల్లా రెవిన్యూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ముట్లూరు, కారంపూడిపాడు గ్రామాలలో నేడు మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలోని గ్రామ సచివాలయాల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ క్షమారాణి ఆదివారం తెలిపారు. ముట్లూరు గ్రామ పరిధిలో 1825, కారంపూడిపాడు గ్రామ పరిధిలో 739 రైతు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల పరిధిలో ఉన్న 17 గ్రామాలలో నాలుగు గ్రామాలలో భూ సర్వే పూర్తకానందున ఆ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం లేదన్నారు. మిగిలిన గ్రామాలలో యధావిధిగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సదస్సులలో పట్టాదారు పాస్ పుస్తకాలు యజమానులు పాల్గొని వారు భూహక్కు పత్రాలను పొందాలని కోరారు. పట్టాదారు పాస్ పుస్తకాలలో ప్రింటింగ్ తేడాలు ఏమైనా ఉన్నచో సంబంధిత విఆర్‌ఓతో తహసిల్దార్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు.





05-01pg10 12 VJA_05-01pg10.qxd 04/Jan/26 9:33 PM Page 1



# పైపర్స్ వీరోచిత ప్రదర్శన

## సూర్మా క్లబ్ 3-1తో చిత్తు



**న్యూఢిల్లీ:** ఉమెన్స్ హాకీ ఇండియా లీగ్, 2025-26లో ఎస్‌జి పైపర్స్ అటాకింగ్ ఫ్లెయిర్, మిడ్‌ఫీల్డ్ కెమిస్ట్రీ, గోల్ కీపింగ్ వీరోచిత ప్రదర్శనల తో అద్భుత విజయం అందించింది. సూర్మా హాకీ క్లబ్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. అర్జెంటీనా రైజింగ్ స్టార్ జువానా కాస్టెల్లారో అద్భుతమైన పాస్‌తో స్పష్టమైన అవకాశాన్ని పైపర్స్ సృష్టించింది. సూర్మా పెనాల్టీ కార్నర్‌ను పొందగా, పెన్నీ స్క్విబ్ 12వ నిమిషంలో గోల్ చేసి స్కోరును 1-0కి చేర్చింది. కానీ పైపర్స్ తక్షణమే వరుసగా పెనాల్టీ కార్నర్‌లను అడ్డుకున్నా స్పెయిన్‌కు చెందిన ప్రపంచ స్థాయి పిసి స్పెషలిస్ట్ లోలా రియారా (13) ముందుకు వచ్చి గోల్ చేసి గోల్‌ను సమమైంది. మిడ్‌ఫీల్డర్ ఇషిక అద్భుతమైన పరుగుతో బంతిని కెప్టెన్ నవనీత్ కౌర్‌కు స్లిప్ చేయంతో మొదటి క్వార్టర్ 1-1తో ముగిసింది. రెండో క్వార్టర్‌లో పైపర్స్ వరుస దాడులతో సూర్మా క్లబ్‌ను వెనక్కి నెట్టడంతో పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే అది గోల్‌గా మారలేదు, కెప్టెన్ నవనీత్ కౌర్ బంతిని సర్కిల్‌లోకి పంపించగా, జ్యోతి సింగ్ (18) నిర్ణయాత్మకంగా ముగించి పైపర్స్‌ను ఆధిక్యంలోకి తెచ్చింది. 27వ నిమిషంలో గోల్ కీపర్ క్రిస్టినా కోసెంటినో అండగా నిలిచి పెనాల్టీకార్నర్ వేరియేషన్‌ను అద్భుతమైన సేవ్ చేయడంతో పైపర్స్ 2-1 ఆధిక్యాన్ని కాపాడుకునేలా చేసింది. పైపర్స్ దృఢమైన రక్షణతో సూర్మాను ఉక్కిరిబిక్కిరి చేసి గోల్ కీపర్ కోసెంటినో పైపర్స్‌ను ముందుకు తీసుకెళ్లే భాగంలో ఆధిక్యాన్ని 3-1కి పెంచింది. దీంతో పైపర్స్ నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

## యూత్ కాంటెండర్‌లో

# ఫైనల్స్‌కు వివాన్, నైషా



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్ 2026లో వివాన్ దేవ్-నైషా రేవాస్కర్ జోడీ అండర్ 15 మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నారు. టాప్ సీడ్ ఆదిత్య దాస్-అంకోలికా చక్రవర్తిని ఓడించడంతో ఫైనల్‌కు చేరుకోవడంతో పాటు, ఈ మ్యాచ్‌లో అదనపు పాయింట్లు వచ్చాయి. వివాన్-నైషా 13-11, 5-11, 11-7, 5-11, 23-21 స్కోరుతో టాప్ సీడ్‌లను తృటిలో ఓడించారు. వారు తోటి ఆటగాళ్ళు రేయాన్ష్ జలన్-తనిష్క కల్భైరవ్ ద్వయంపై ఫైనల్‌కు చేరుకున్నారు. వివాన్ మరియు నైషా ప్రారంభం నుండే తమ పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. 58 తేడాతో వెనుకబడి, గేమ్ పాయింట్‌ను కాపాడుకున్నారు మరియు తరువాత మొదటి గేమ్‌ను గెలుచుకున్నారు. ఈ జంట మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడమే కాకుండా, ప్రత్యర్థులు మ్యాచ్ పాయింట్ ఎదుర్కొన్న ప్రతిసారీ స్కోరును సమం చేయకుండా అడ్డుకున్నారు. చివరికి వరుసగా 4 పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను ముగించారు. అంతకు ముందు సెమీఫైనల్ మ్యాచ్‌లో సంజయ్ జగదీష్-మైరా సంగెల్కర్‌పై 11-3, 15-13, 11-7 స్కోరుతో గెలిచారు. అలాగే టాప్ సీడ్లు అభినంద్ ప్రధివాధి-అనన్య మురళీధరన్ సార్థక్ ఆర్య-సిండ్రెలా దాస్ లతో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో స్థానం సంపాదించడం ద్వారా తమ అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించారు. సెమీఫైనల్లో అభినంద్-అనన్య 9-11, 14-12, 11-7, 11-8 స్కోరుతో రిత్విక్ గుప్తా-అహోనా రాయ్‌లను ఓడించగా, సార్థక్-సిండ్రెలా 11-6, 12-10, 5-11, 11-5 తేడాతో సాహిల్ రావత్-హార్దీ పటేల్‌లను అడ్డుకున్నారు.




## ప్రో రెజ్లింగ్ లీగ్ వేలంలో..

# రూ.60 లక్షలతో సుసాకి టాప్

## భారత్ రెజ్లర్ సిజీత్‌కు రూ.52 లక్షలు

**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన ప్రధాన ఫ్రాంచైజీ ఆధారిత రెజ్లింగ్ లీగ్ (పిడబ్ల్యూఎల్)-2026 ఏడు సంవత్సరాల విరామం తర్వాత 5వ సీజన్ మళ్లీ జరగనుంది. ఈ నెల 15 నుండి నోయిడాలో ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, యుపి డామినేటర్స్, మహారాష్ట్ర కేసరి, హర్యానా థండర్స్, పంజాబ్ రాయల్స్ పాల్గొంటున్నాయి. ఇందుకు న్యూఢిల్లీలో జరిగిన వేలంలో రెజ్లర్లపై కాసులు వర్షం కురిపించాయి. ఈ వేలంలో అతిపెద్ద స్టార్ అయిన యుయి సుసాకి (జపాన్)ని అత్యధిక ధరకు కొనుగోలు జరిగింది. గట్టి పోటీ ఎదురైనా హర్యానా థండర్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ జపనీస్ లెజెండ్ 4 సార్లు ప్రపంచ ఛాంపియన్, 2 సార్లు ఒలింపిక్ పతక విజేత. ఇందులో 2021 టోక్యోలో జరిగిన స్వదేశీ ఒలింపిక్స్‌లో బంగారు పతకం కూడా ఉంది. మొత్తంగా ఆమె 18 అంతర్జాతీయ ఈవెంట్లలో 17 బంగారు పతకాలను సాధించింది. పోలాండ్‌కు చెందిన హెవీవెయిట్ రెజ్లర్ రాబర్ట్ బరాన్ 125 కిలోల విభాగంలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడిని మహారాష్ట్ర కేసరి రూ.55 లక్షలకు కొనుగోలు చేసింది. ఇక యువ భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ 2025 చివర్లో అండర్ 23 ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నాడు, ఢిల్లీ దంగల్ వారియర్స్ 52 లక్షలకు కొనుగోలు చేసిన భారతీయులలో సుజీత్ అత్యధిక బిడ్‌లో నిలిచాడు. అంటీమ్ పంఘల్ (భారత్) రూ.52 లక్షలకు యుపి డామినేటర్స్ కొనుగోలు చేసింది. రెండుసార్లు ప్రపంచ పతక విజేత అయిన ఆమె ప్రస్తుతం ప్రపంచ నంబర్ 1 స్థానంలో ఉంది. గత సంవత్సరం ఆడిన 4 పోటీలలో పతకాలు (2 స్వర్ణం, 2 కాంస్య) గెలుచుకుంది. అలాగే 2024 పారిస్ ఒలింపిక్ పతక విజేత భారత్ ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్‌ను పురుషుల విభాగంలో టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్ రూ.52 లక్షలకు దక్కించుకుంది.

## విజయ్ హజారే ట్రోఫీ..

# హైదరాబాద్, ఆంధ్రా ఔట్

## క్వార్టర్ రేస్‌కు నో ఛాన్స్

## ఐదు మ్యాచ్‌ల్లో 4 ఓడిపోయిన ఇరు జట్లు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర తీవ్రంగా నిరాశపర్చాయి. హైదరాబాద్ వరుసగా ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడగా, ఆంధ్ర ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచే గెలిచింది. ఇరు జట్లు ఇంకా రెండేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లు గెలిచినా ఆంధ్ర, హైదరాబాద్ క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు. ఈ ట్రోఫీలో మొత్తం 38 జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో 32 జట్లు ఎలైట్ గ్రూప్‌లో ఆడనుండగా, మరో 6 జట్లు ప్లేట్ గ్రూప్‌లో బరిలోకి






దిగుతున్నాయి. ఎలైట్ గ్రూప్‌లోని 32 జట్లను ఏ,బీ, సీ, డీ నాలుగు గ్రూపులుగా విభజించగా, ఒక్కో దానిలో 8 జట్లు ఉంటాయి. ప్రతీ గ్రూపులోని జట్టు తమ ప్రత్యర్థి జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతోంది. అంటే ఒక్కో జట్టు ఏడేసి మ్యాచ్‌లు ఆడుతోంది. గెలిచిన జట్టుకు 4 పాయింట్లు, మ్యాచ్ రద్దైనా లేదా ఫలితం తేలకపోయినా చెరో 2 లభిస్తాయి. ఎలైట్ గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్ల నుంచి 4 జట్లు సెమీఫైనల్స్ ఆడుతాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడుతాయి. ఇక ప్లేట్ గ్రూప్‌లోని 6 జట్లు తమ ప్రత్యర్థితో ఒక్కో మ్యాచ్ ఆడుతాయి. అంటే ఒక్కోటీమ్ ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడుతోంది. ఈ ఐదు మ్యాచ్‌లు ముగిసే సమయానికి టాప్2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్లో గెలిచిన జట్టు తదుపరి ఎలైట్ గ్రూప్‌కు అర్హత సాధిస్తోంది. నాలుగు ఎలైట్ గ్రూపుల్లో కలిపి అత్యంత తక్కువ పాయింట్లు, నెట్ రన్ రేట్ ఉన్న జట్టు ప్లేట్ గ్రూప్‌కు డీమోట్ అవుతుంది. ఈ విధంగానే క్వార్టర్స్ రేసు నుంచి హైదరాబాద్ ఔట్ కానుంది. ఎలైట్ గ్రూప్ బీలో ఉన్న హైదరాబాద్ ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడి ఏడో స్థానంలో కొనసాగుతుండగా, మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లను గెలిచినా క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు. ఈ గ్రూప్‌లో ఉత్తరప్రదేశ్ ఇప్పటికే 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జమ్మూ కాశ్మీర్, విదర్భ, బరోడా, బెంగాల్ వంటి జట్లు ఒక్కొక్కటి 12 పాయింట్లతో పోటీలో ఉన్నాయి. హైదరాబాద్ చివరి 2 మ్యాచ్‌ల గెలిచినా 8 పాయింట్లు మాత్రమే వస్తాయి. అలాగే ఎలైట్ గ్రూప్ డీలో ఉన్న ఆంధ్రా ఐదు మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. 4 పాయింట్లతో 7వ స్థానంలో కొనసాగుతోంది. ఈ గ్రూప్‌లో ఇప్పటికే ఒడిశా, రైల్వేస్, హర్యానా, ఢిల్లీ 12 పాయింట్లతో టాప్ 4లో ఉండగా, సౌరాష్ట్ర 8 తో 5వ స్థానంలో ఉంది. ఆంధ్ర తమ చివరి మ్యాచ్‌లు గెలిచినా 8 పాయింట్లతోనే నిలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో టాప్5 జట్లలో నాలుగు టీమ్స్ తమ చివరి మూడు మ్యాచ్‌ల్లో ఓటమి పాలవ్వాలి. అంతేకాకుండా ఆంధ్ర రన్ రేట్ మెరుగ్గా ఉండాలి. కానీ ఆంధ్ర రన్‌రేట్ మైనస్‌లో ఉంది. కాబట్టి ఆంధ్ర కూడా క్వార్టర్స్ చేరడం అసాధ్యం.



## యాషెస్ సిరీస్‌లో ఘనంగా

# ఆరంభించిన ఇంగ్లండ్

## తొలి రోజు ఆస్ట్రేలియాపై ఆధిపత్యం

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26లో ఆఖరి టెస్టును ఇంగ్లండ్ ఘనంగా ఆరంభించింది. సిడ్నీ వేదికగా ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియాపై ఇంగ్లీష్ జట్టు పై చేయి సాధించింది. అయితే వర్షం కారణంగ ఖమొదటి రోజు కేవలం 45 ఓవర్లు ఆట మాత్రమే సాధ్యపడింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు నష్టానికి 211 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్ (72), హ్యారీ బ్రూక్ (78) ఉన్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 57 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో రూట్, బ్రూక్ అద్భుతమైన పోరాటం కనపరిచారు. మరో వికెట్ కోల్పోకుండా ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మైఖల్ నీసర్, స్కాట్ బోలాండ్ తలా వికెట్ సాధించారు. కాగా ఇప్పటికే యాషెస్ సిరీస్‌ను 3-1 తేడాతో ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసిన ఇంగ్లండ్ మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో మాత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది.

# కమోడిటీ, బులియన్‌లపై వెనిజులా దాడుల ఎఫెక్ట్!



**న్యూఢిల్లీ, జనవరి 4:** అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లకు వెనిజులా ఎఫెక్ట్ తీవ్రస్థాయిలోచూపిస్తోంది. వెనెజువెలాపై దాడులు ప్రకంపనలు సృష్టిస్తున్న తరుణంలో ముడి చమురు, బంగారం, వెండి తదితర కమోడిటీల ధరలకు రెక్కలొస్తున్నాయి. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అంత పెద్దదేమీ కాదంటున్న ఆర్థిక నిపుణులు భారతీయ స్టాక్ మార్కెట్లపై ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండకపోవచ్చనే చెప్తున్నారు. అయితే గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్, క్రూడాయిల్ ఇతర కమోడిటీ ట్రేడింగ్ తప్పక ప్రభావితం కాగలదని చెపుతున్నారు. సోమవారం ఫ్యూచర్ మార్కెట్ కొమెక్స్‌లో గోల్డ్ ధర ఔన్స్ 4,380 డాలర్లను తాకవచ్చుని, సిల్వర్ కూడా 7578 డాలర్లను చేరవచ్చని ఆరంగ నిపుణుడు అనుజ్ గుప్తా అన్నారు. దీంతో స్పాట్ మార్కెట్‌లోనూ ఔన్స్ గోల్డ్ రూ.4,450 డాలర్లు, ఔన్స్ సిల్వర్ 80 డాలర్లు ఉండొచ్చున్న అంచనాలు నెలకొన్నాయి. ఇక భారతీయ ఫ్యూచర్ మార్కెట్ ఎంసీఎక్స్‌లోనూ బంగారం ధర 24 క్యారెట్ 10 గ్రాములు రూ.1.40లక్షలుగా నమోదు కావచ్చుని, వెండి కిలో రూ.2.45లక్షలను తాకవచ్చున్నారు. అమెరికావెనెజువెలా సంక్షోభం సముద్ర మార్గంలో ఇబ్బందులకు దారితీయవచ్చని, ఈ దారిగుండానే ప్రపంచంలోనే వెండి ఎగుమతుల్లో దూసుకుపోతున్న పెరు, చాద్ దేశాలకు ప్రస్తుత పరిస్థితులు చిక్కులు తీసుకురావచ్చని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈ దెబ్బకు గోల్డ్ ధరలు కొండెక్కుతాయని అంటున్నారు. ఇదే జరిగితే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల పరుగుకు పట్టపగ్గాలనేవే ఉండకపోవచ్చు. ఇక ముడి చమురు విషయానికొస్తే ఎంసీఎక్స్‌లో బ్యారెల్ మరింత పెరిగే వీలుంటుందని పేర్కొంటున్నారు.

## వాణిజ్యం




## డిపాజిట్లకంటే ఫండ్స్ పెట్టుబడులపైనే

# ఎక్కువ ఫోకస్!

**ముంబయి,జనవరి 4:** పొదుపుచేసే చర్యల్లోప్రజల్లో పెట్టుబడి విధానాలు మారుతున్నాయి. ఈక్విటీలతోపాటు మూచువల్‌ఫండ్స్‌లో పెట్టుబడులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. 2022 నుంచి 2024 చివరి త్రైమాసికం వరకు స్టాక్ ధరల్లో ర్యాలీ వల్ల ప్రజలు ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నది. ఆర్బీఐ విడుదల చేసిన నెలవారీ బులెటిన్ ప్రకారం, సాధారణ కుటుంబాల బ్యాంక్ డిపాజిట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 8.97 శాతం తగ్గిపోయి, రూ.12.54 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతకు ముందు రెండేండ్లలో కనిపించిన వృద్ధి తిరోగమనం బాట పట్టింది. జీవిత బీమా నిధుల్లో పెట్టుబడులు 17.3 శాతం తగ్గి, రూ.5.3 లక్షల కోట్లకు చేరాయి. పీపీఎఫ్ మినహా చిన్న మొత్తాల పొదుపులు 24 శాతం పతనమయ్యాయి. తక్కువ ప్రతిఫలాన్ని ఇచ్చే సురక్షిత పెట్టుబడులను ఇన్వెస్టర్లు గట్టిగా తిరస్కరిస్తున్నారు. ప్రజలు తమ సొమ్మును అధిక ప్రతిఫలాన్ని ఇచ్చే పథకాల్లో పెడుతున్నారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లు దాదాపు 153 శాతం పెరిగాయి, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు 95 శాతం పెరిగాయి. కరెన్సీ హోల్డింగ్స్ కూడా 77.6 శాతం ఎగబాకాయి. ప్రజలు నగదు అందుబాటులో ఉంచుకునేందుకు సైతం ప్రాధాన్యం ఇస్తున్నారు. వినియోగం కూడా అధికంగా కనిపించింది. 2021-22 నుంచి 2024-25 వరకు పొదుపులో బ్యాంక్ డిపాజిట్ల వాటా 40.9 శాతం నుంచి 35.2 శాతానికి తగ్గింది. అదే కాలంలో మ్యూచువల్ ఫండ్స్ వాటా 2.1 శాతం నుంచి 13.1 శాతానికి పెరిగింది. ఈక్విటీ హోల్డింగ్స్ వాటా 1.3 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. సాధారణ కుటుంబాలు పొదుపు చేసే తీరు క్రమంగా మారుతున్నట్లు ఈ గణాంకాలు చెప్తున్నాయి. సురక్షితమైన పొదుపు చేయాలనే భావం నుంచి అవకాశాల ఆధారిత పొదుపు చేయడం వైపు ప్రజలు మారుతున్నట్లు వెల్లడవుతున్నది.

# రియాల్టీలో విక్రయం కాని ఇళ్లు 5.77 లక్షలు!

## అనరాక్ రియాల్టీ కన్సల్టెన్సీ అంచనా



**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్ రియాలీల్టరంగంలో గత ఏడాది ఏడు మేజర్ నగరాల్లో నాలుగుశాతం ఇళ్లు విక్రయం కాకుండా నిలిచిపోయాయి. అంటే సుమారు 5.77 లక్షలయూనిట్లు అమ్మకాలు లేకుండా నిలిచినట్లు తేలింది. అనరాక్ డేటాను పరిశీలిస్తే ప్రైమరీ రెసిడెన్షియల్‌మార్కెట్‌లో అన్‌సోల్డ్ యూనిట్లు 5,76,617 యూనిట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది చివరినాటికి 5,53,073 యూనిట్లు ఉన్నట్లు తేలింది. సాలీనా అన్‌సోల్డ్ ఇళ్లను టాప్ ఏడు నగరాల్లో నాలుగుశాతంగా ఉంటుంది. ఏడు నగరాల్లో వార్షిక పద్ధతిలోచూస్తే 14శాతం క్షీణించి 3,95,625 మాత్రమే అమ్మకం జరిగాయి. కొత్త ఇళ్ల సరఫరా మాత్రం రెండుశాతం పెరిగి 4,19,170యూనిట్లకు చేరినట్లు అనరాక్ ప్రకటించింది. ముంబయి మెట్రోపాలిటన్‌రీజియన్, హైదరాబాద్‌లలోనే ఎక్కువ అన్‌సోల్డ్‌యూనిట్లు ఉన్నాయి. ఢిల్లీ, ఎన్సీఆర్, పూణె, చెన్నై, బెంగలూరు, కోల్‌కత్తా నగరాల్లోకూడా ఇదేపరిస్థితిఉ న్నట్లు అనరాక్ రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ ప్రకటించింది. ఢిల్లీఎన్సీఆర్‌ఫరిధిలో ఐదుశాతం అన్‌సోల్డ్స్ నిలిచాయి. 90,455 యూనిట్లు ఉన్నట్లు తేలింది. ముంబయి మెట్రో రీజియన్‌లో ఒకటిశాతం తగ్గి 1,79,228యూనిట్లు ఉన్నాయి. బెంగలూరులో అన్‌సోల్డ్స్ స్టాక్ 23శాతంపెరిగి 64,863యూనిట్లు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. పూణెలో మూడుశాతంపెరిగి 83,491యూనిట్లు ఉంటే హైదరాబాద్‌లో 96,140 యూనిట్లు ఉన్నాయి. చెన్నైలో 18శాతం అన్‌సోల్డ్స్ పెరిగి 33,434 యూనిట్లకు చేరాయి. అదే కోల్‌కత్తాలో అన్‌సోల్డ్ ఇళ్లు 29,007కి చేరాయి. హోమ్‌లోన్లపై తక్కువ వడ్డీరేట్లకు రుణాలు లభిస్తే ఈ అన్‌సోల్డ్ సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని అనరాక్ అంచనావేసింది

## ఎయిర్‌లైన్స్‌లో పవర్ బ్యాంకుల వినియోగంపై

# డిజిసిఎ సర్క్యులర్ జారీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ డీజీసీఏ కీలక సూచనలు చేసింది. విమాన ప్రయాణికులు పవర్ బ్యాంక్, అదనపు బ్యాటరీలు వాడే విషయంలో తాజాగా కొన్ని నిబంధనల్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై విమాన ప్రయాణికులు హ్యాండ్ లగేజ్ లో మాత్రమే పవర్ బ్యాంక్, అడిషనల్ బ్యాటరీలు, ఇతర లిథియం బ్యాటరీ డివైజ్ లను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓవర్ హెడ్ కంపార్ట్ మెంట్, ఇతర కార్గో లగేజ్ లలో వీటిని తీసుకెళ్లడానికి అనుమతించరు. దీని ద్వారా విమానంలో ప్రయాణికులకు మరింత భద్రత కలగనుంది. ఈ నిబంధనలకు సంబంధించి డీజీసీఏ డేంజరస్ గూడ్స్ అడ్వైజరీ సర్క్యులర్ జారీ చేసింది. సాధారణంగా లిథియం బ్యాటరీలు కొన్ని సార్లు వేడెక్కి పేలడం, వాటి ద్వారా నిప్పు రవ్వలు అంటుకుని మంటలు వ్యాపించడం వంటివి జరుగుతున్నాయి. అందులోనూ విమానం గాల్లో ఉండగా ఇలా బ్యాటరీలు పేలడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే విమాన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గాల్లో మంటల్ని నియంత్రించడం సాధ్యం కాదు. విమానాల్లోని ఓవర్ హెడ్ కంపార్టుమెంట్లు, కార్గోలు వంటి వాటిల్లో బ్యాటరీల ద్వారా అగ్నిప్రమాదాలను త్వరగా గుర్తించడం సాధ్యం కావట్లేదు. అందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. హ్యాండ్ లగేజ్ లో మాత్రమే ఇవి ఉంటే వీటి ద్వారా ఎప్పుడైనా అనుకోని ఘటనలు జరిగితే ముందుగానే గుర్తించి నియంత్రించే వీలుంది. ఇటీవల కొన్ని విమానాల్లో పవర్ బ్యాంకుల ద్వారా మొబైల్స్ ఛార్జింగ్ పెడుతున్నప్పుడు, ఎయిర్ క్రాఫ్ట్ సీట్ పవర్ ఔట్లెట్లలో చార్జింగ్ చేస్తున్నప్పుడు అవి పేలి కొన్ని అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న డీజీసీఏ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై విమాన ప్రయాణానికి ముందుగా ఈ విషయంలో జాగ్రత్తగా తనిఖీలు చేస్తారు. హ్యాండ్ లగేజీలలో మాత్రమే వీటిని అనుమతిస్తారు. విమానంలో కూడా స్పష్టమైన ప్రకటన, హెచ్చరికలు జారీ చేస్తారు. గత అక్టోబర్లో ఒక దేశీయ విమానంలో పవర్ బ్యాంక్ పేలడం వల్ల విమానాన్ని మధ్యలో దింపాల్సి వచ్చింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు.

# 10% పెరిగిన బంధన్‌బ్యాంకు అడ్వాన్సులు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రైవేటురంగంలోని బంధన్‌బ్యాంకు రుణాలు అడ్వాన్సుల్లో పది శాతం వృద్ధినమోదుచేసింది. మొత్తం మూడో త్రైమాసికంలో 1,45,227 కోట్లు ఇచ్చిన ట్లుప్రకటించింది. ఇదే గత ఏడాది ఇదే త్రైమాసికంలో 1,32,019 కోట్లుమాత్రమే ఇచ్చినబ్యాంకుఈసారి కొంత వృద్ధినమోదు చేసింది. బిజినెస్ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజిలకు సమర్పించిన బ్యాంకు డిపాజిట్లుకూడా 11.1శాతంపెరిగి 1,56,723 కోట్లకు చేరినట్లు ప్రకటించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 1,42,002 కోట్లు ఉన్నట్లు తెలిపింది. మొత్తం డిపాజిటలపరంగా చూస్తే స్వల్పంగా క్షీణత ఉంది. 0.9శాతం క్షీణించి 1,58,075కోట్లవరకూ ఉన్నాయి. రిటైల్ డిపాజిట్లు కూడా బలమైన వృద్ధిని సూచించాయి. 17.2శాతం పెరిగినట్లు ప్రకటించింది. రూ.1,13,420 కోట్లకు చేరింది. రిటైల్ టర్మ్ డిపాజిట్లు కూడా 35.8శాతం పెరిగి 70,690 కోట్లకు చేరింది.

అదే గత ఏడాది ఇదేకాలంలో 52,063 కోట్లవరకూ ఉన్నట్లు బ్యాంకు తెలిపింది. కాసా డిపాజిట్లు మాత్రం 4.5శాతం క్షీణించి రూ.42,730 కోట్లకు చేరాయి. కాసా నిష్పత్తి 27.26శాతంగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో ఉన్న 31.73శాతంనుంచి గణనీయంగా తగ్గింది. ఇక బల్క్ డిపాజిట్లు కూడా 2.శాతం క్షీణించాయి. 43,303 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడిటీ కవరేజి రేషియో కూడా 149.14 శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది.

# కోల్ ఇండియా అనుబంధ సంస్థ ఐపిఒకు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్‌కోక్‌కోల్ లిమిటెడ్ సంస్థ ఈనెల 9వ తేదీ ఐపిఒకు వస్తోంది. కోల్ ఇండియాకు అనుబంధంగా పనిచేస్తున్న భారత్‌కోకింగ్‌కోల్ మొట్టమొదటి పబ్లిక్ ఇష్యూను ఈనెల 9వ తేదీ ఇస్తోంది. కొత్తసంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థలపరంగా మొట్టమొదటి ఐపిఒగా కూడా వస్తోంది. ఇప్పటికే సెబి వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఆఫర్‌ఫర్‌సేల్ విధానంలో 46.57 కోట్ల ఈక్విటీషేర్లను జారీచేస్తోంది. జనవరి 13వ తేదీ బిడ్డింగ్‌ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ఈనెల 8వ తేదీ ఉంటుంది. బొగ్గు రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగానే బిసిసిఎల్ ఐపిఒ ఉంటుందని చెపుతున్నారు.

మార్కెట్‌క్రమశిక్షణ పాటించడంతో పాటు బొగ్గురంగంలో అనిశ్చితిని తొలగించి లాభదాయకత తక్కువ ఉన్నవాటిని ఉపసంహరించుకునే విధానంలో కేంద్రం ముందుకుపోతోంది. సోమవారం కంపెనీ ఆర్థిక పరిస్థితులు, లాట్‌సైజు, ఇష్యూధరలు వంటివాటిని ప్రకటిస్తుందని కంపెనీ ప్రతినిదులు పేర్కొంటున్నారు. గత ఏడాదే కోల్ ఇండియాకు అనుబంధంగా పూరినత స్వతంత్ర సంస్థగా ఉన్న సెంట్రల్‌మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ సంస్థ కూడా ఐపిఒకు వచ్చేందుకు సెబివద్ద డ్రాఫ్ట్ పేపర్లు దాఖలుచేసింది. ఈ సంస్థ కూడా ఒఎఫ్‌ఎస్ రూటులోనే వస్తోంది. 2025లో కంపెనీలు రికార్డుస్థాయిలో రూ.1.76 లక్షలకోట్లు ఐపిఒలద్వారా సమీకరించాయి. దేశీయంగా మంచి నగదు లభ్యతను సాధించింది. మొత్తం 2024లో 90 సంస్థలు 1.60 లక్షలు సమీకరిస్తే గత ఏడాది మరింతగాపెరిగింది. అదే 2023లో 57 కంపెనీలు రూ.49,436కోట్లు సమీకరించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14